RNI NO. TELTEL/2006/17406

**విలేకరులు కావలెను**

అన్ని జిల్లాల నుండి నిఘానేత్రం దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబర్‌కు సంప్రదించగలరు.

ఫోన్ - 9440090053

# నిఘానేత్రం

తెలుగు దినపత్రిక

NEEGHANETHRAM NEWS

నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ సంపుటి : 21 సంచిక : 18 పబ్లిషర్ - కోయల్‌కర్ రామ్ దయానంద్ మంగళవారం 3 సెప్టెంబర్ 2024 పేజీలు : 12 వెల : రూ. 2/-







# అండగా ఉంటాం!

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భరోసా!

### చంద్రబాబు, రేవంత్ రెడ్డికి అమిత్ షా ఫోన్: తక్షణ సాయం

న్యూఢిల్లీ: భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలపై సమీక్షించారు. ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని, కేంద్రం నుంచి అవసరమైన సాయాన్ని అందిస్తామని తెలుగు రాష్ట్రాల సీఎంలకు కేంద్రమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. వరదల కారణంగా రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి.. అమిత్ షాకు వివరించారు. ప్రాణనష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి అన్ని విధాలా సాయం అందజేస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు. అదనంగా ఎన్డీఆర్ఎఫ్ బ్బృందాలను తెలంగాణకు పంపుతున్నట్లు తెలిపారు. మరోవైపు, ఏపీలో చేపట్టిన వరద సహాయక చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెూంమంత్రి అమిత్ షాకు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ ద్వారా పవన్ బోట్లు పంపాలని కోరారు. అవసరమైన మేరకు సాయం చేస్తామని, హెూంశాఖ కార్యదర్శి ద్వారా తక్షణ సాయం అందేలా చూస్తామని అమిత్ షా తెలిపారు. అమిత్ షాతో మాట్లాడాక హెూంశాఖ కార్యదర్శితో మాట్లాడారు ఏపీ సీఎం చంద్రబాబు. పవర్ బోట్లను అత్యవసరంగా రాష్ట్రానికి పంపాలని కోరారు. దీంతో 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే పంపుతున్నామని కేంద్ర హెూంశాఖ తెలిపింది. ఒక్కో ఎన్డీఆర్ఎఫ్ బృందంలో 25 మంది ఉంటారని తెలిపింది. సోమవారం ఉదయంలోగా పవర్ బోట్లు విజయవాడ చేరుకుంటాయని పేర్కొంది. మొత్తం 40 పవర్ బోట్లు రాష్ట్రానికి పంపుతున్నామని తెలిపింది.సోమవారం వాయుమార్గంలో 4 ఎన్డీఆర్ఎఫ్ టీమ్‌లు పంపుతున్నామని, సహాయ చర్యల కోసం 6 హెలికాప్టర్లు పంపుతున్నామన్న కేంద్ర హెూంశాఖ వెల్లడించింది. కాగా, ఏపీ, తెలంగాణలో కురుస్తున్న వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటి వరకు వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో పది మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో వ్యక్తులు వరదల్లో గల్లంతయ్యారు. ఏపీ, తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణలో హైదరాబాద్, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలతో అనేక ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఏపీలో విజయవాడతోపాటు కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో అనేక ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రజలకు అండగా ఉంటామని చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**సీఎంకు పీఎం ఫోన్ :** ముఖ్యమంత్రి ఏ రేవంత్రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితులు, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో వర్షప్రభావ తీవ్రతను సీఎం రేవంత్రెడ్డి ప్రధానికి వివరించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలు, తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. ప్రాణనష్టం జరక్కుండా యావత్ ప్రభుత్వ యంత్రాంగం సహాయకచర్యల్లో పనిచేస్తున్నదని ఈ సందర్భంగా ప్రధానికి తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయాన్ని అందిస్తామన్న చెప్పారు.



## మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాల్సిందే

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేటీఆర్

హైదరాబాద్ : రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కేవలం రూ. 5 లక్షలు నష్టపరిహారం ప్రకటించడం అన్యాయం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 25 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హెూదాలో రేవంత్ రెడ్డినే వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు. మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించండి. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరం ఉంది. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కూడా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అంతకన్నా మోసం మరొకటి ఉండదు, ముఖ్యమంత్రి గారు అని కేటీఆర్ పేర్కొన్నారు. అదే విధంగా, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన, డ్యామేజ్ అయిన వారికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామని చెప్పారు.

ఆ హామీని కూడా నెరవేర్చండి. ప్రభుత్వం అసమర్థత, చేతగాని తనం, ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణంగానే ప్రాణనష్టం జరిగింది. ఇకనైనా ప్రజల ప్రాణాలు రక్షించేందుకు చర్యలు చేపట్టి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించండి అని కేటీఆర్ సూచించారు.




హైదరాబాద్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్ మహా నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి ప్రకటించారు. పౌరులందరూ ఇళ్లలోనే ఉండాలని కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ఆదేశించారు GHMC కమిషనర్ అమ్రపాలి. పిల్లలను, వృద్ధులను ఒంటరిగా రోడ్లపై నడవనివ్వవద్ద న్నారు. పాద చారులు ద్విచక్ర వాహనదారులు నీటిలోకి నడవకూడదని కోరారు. జీహెచ్ఎంసీ పూర్తిగా అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఏదైనా అత్యవసర లేదా సమస్య ఎదురైతే, 040 21111111 లేదా 9000113667కి కాల్ చేయండి @GHMConlineలో సంప్రదించండని కోరారు. మరో 2 రోజుల పాటు భారీ వర్షాలు కారణంగా పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐటీ కంపెనీలు, ఐటీ ఈఎస్కు ఉద్యోగుల భద్రత రీత్యా వర్క్ఫ్రం హెూంకు అనుమతి ఇవ్వాలని సూచనలు చేశారు. ఐటీ కంపెనీలకు వర్క్ఫ్రం హెూం అనుమతించాలని కోరారు పోలీసులు.

## ఇంట్లో వరద నీరు..

## కళ్లల్లో కన్నీరు.. : హరీశ్‌రావు



ప్రభుత్వం కొంతకాలం శుష్క రాజకీయాలు, కూల్చివేతలను ఆపి బాధితులను ఆదుకోవడం పై సంపూర్ణంగా దృష్టి కేంద్రీకరించాలని హరీశ్‌రావు సూచించారు. ఇప్పటికే తక్షణ సహాయ చర్యలు అందలేదని జనం తమ ఆవేదన, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా మనసుపెట్టి చర్యలు తీసుకోవాలి.

వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలి. విద్యుత్ సరఫరాను పునర్దరించాల్సిన చోట వేగంగా చర్యలు తీసుకోవాలి. ఆహారం, నీరు అందుబాటులో ఉంచాలి. అసలే రాష్ట్రం విష జ్వరాలతో విలువిలలాడుతున్నది. వరదల వల్ల మరింత విజృంభించే ప్రమాదం ఉంది. అన్ని శాఖలు అప్రమత్తం కావాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. ఎకరానికి పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అధైర్య పడకండి

# అండగా ఉంటాం

## వరద బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా




హైదరాబాద్, సెప్టెంబర్ 2: తెలంగాణలో భారీ వర్షాలు, వరద సాయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచుతూ కీలక ప్రకటన చేశారు. వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం 4 లక్షల నుంచి 5 లక్షలకు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. సోమవారం కమాండ్ కంట్రోల్ రూంలో వర్షాలపై సమావేశం నిర్వహించారు. చనిపోయిన పాడి గేదెలు ఒక్కో దానికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ. 30 వేల నుంచి రూ. 50 వేలకు పెంచాలని, మరణించిన మేకలు, గొర్రెలకు ఒక్కోదానికి ఇచ్చే రూ. 3 వేల సాయం రూ.5 వేలకు పెంచాలని సీఎం ఆదేశించారు. తక్షణం బాధిత కుటుంబాలకు అందించాలని సూచించారు. వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయలని ఆదేశించారు. కంటింజెన్సీ ఫండ్ కింద ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లా కలెక్టర్లకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ప్రధానికి విజ్ఞప్తి...** రాష్ట్రంలోనే కాకుండా, జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూంలు 24 గంటలు పని చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నిత్యావసర వస్తువుల పంపిణీ,, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని విభాగాల నుంచి ప్రాథమిక నివేదికలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వం నుంచి తక్షణ సాయం కోరేందుకు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో జరిగిన ఈ ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అధికార బృందాలతో పాటు స్వయంగా ప్రధాన మంత్రి ఈ విపత్తును పరిశీలించేందుకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

**టీజీడీఆర్ఎఫ్ ఏర్పాటు....** భవిష్యత్తులో ఇలాంటి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. 25 పెద్ద టవర్లు కూలిపోయినప్పటికీ విద్యుత్తు సిబ్బంది వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించారని గుర్తు చేశారు. అదే విధంగా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్తు సమస్యలు, ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని గుర్తించి తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించి నష్టాలను నివారించాలని చెప్పారు.

వాగులు, వంకలు పొర్లుతున్న దృష్ట్యా దెబ్బతిన్న రోడ్లు, వరద ప్రవహిస్తున్న రోడ్లపై నుంచి ఎవరూ దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. రెవిన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు బృందాలు ఏర్పడి అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలిపారు.



# 'తెలంగాణకు రండి' ప్రధాని మోడీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన తెలంగాణకు తక్షణమే సహాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సెంట్రల్ గవర్నమెంట్‌కు సోమవారం లేఖ రాశారు. రాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాలు, వరదలను జాతీయ విపత్తుగా పరిగణలోకి తీసుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో పర్యటించాలని ప్రధాని మోడీని కోరారు. వర్షాలు, వరదల వల్ల సంభవించిన అపార నష్టంపై కేంద్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తోన్న భారీ వర్షాలు, వరదలపై సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీయడంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో కొనసాగుతోన్న సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరదల్లో చిక్కుకుని చనిపోయిన మృతుల కుటుంబాలకు ఇచ్చే ఎక్స్ గ్రేషియాను పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం అందిస్తోన్న రూ.4 లక్షల ఎక్స్ గ్రేషియాను రూ.5 ఐదు లక్షలకు పెంచారు. ఈ రివ్యూ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి నేరుగా ఖమ్మం పర్యటనకు వెళ్లారు. రోడ్డు మార్గాన ఖమ్మం బయలుదేరిన రేవంత్.. ఖమ్మంలో మున్నేరు వాగు బీభత్సానికి గురైన వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి బాధితులతో మాట్లాడనున్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: వరదల వల్ల చనిపోయిన మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం రూ.5 లక్షలకు పెంచి ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వర్షాలు, వరద సాయంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. "భారీ వర్షాలు ఉన్నచోట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలోని కలెక్టరేట్‌లలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలి. భారీ వర్షాల నేపథ్యంలో 8 పోలీసు బెటాలియన్లకు ఎన్డీఆర్ఎఫ్ తరహా శిక్షణ ఇవ్వాలి. ప్రజలకు జరిగిన నష్టంపై అధికారులు తక్షణమే స్పందించాలి. చనిపోయిన పశువులు, మేకలు, గొర్రెలకు పరిహారం పెంచాలి. వరద నష్టంపై కేంద్రానికి సమగ్ర నివేదిక అందించాలి" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. సహాయక బృందాలు చేపడుతున్న చర్యలపై అధికారులతో సీఎం చర్చించారు.

పంటనష్టం వాటిల్లిన ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పలు ప్రాంతాల్లో రెడ్ అలర్ట్: మంత్రి ఉత్తమ్..



సూర్యాపేట: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే జలాశయాలకు భారీ ఎత్తున వరదనీరు చేరుతోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా వరదల్లో చిక్కుకుని 10మంది ప్రాణాలు వదిలారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సైతం వరస సమీక్షలు నిర్వహించి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. సీఎం ఆదేశాలతో ప్రాణ, ఆస్తి నష్టం నివారించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లాలో పర్యటించారు. నడిగూడెం మండలం రామ చంద్రపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువకు గండి పడిన ప్రదేశాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులను అప్రమత్తం చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. పంట నీట మునిగిన రైతులు ఎవ్వరూ ఆందోళనకు గురికావొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.." భారీ వర్షాల కారణంగా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. దురదృష్టవశాత్తూ కోదాడ, హుజూర్నగర్ ప్రాంతాల్లోనే అతి భారీ వర్షాలు పడ్డాయి. వర్షాలకు కోదాడ ప్రాంతంలో ఇద్దరు మృతిచెందడం బాధాకరం. నాగార్జున సాగర్ ఎడమ కాలువ తెగిపోవడం వల్ల 300ఎకరాల్లో పంట నీట మునిగి నష్టం వాటిల్లింది. ముఖ్యమంత్రితో చర్చించి నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం.

ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వారం రోజుల్లో గండి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు.

# ముఖ్యమంత్రి గారు.. నా మీద కోపంతో నేతన్నల ప్రాణాలు బలిపెట్టొద్దు: కేటీఆర్

హైదరాబాద్: పదేండ్ల పాటు సిరి సంపదలతో కళకళలాడిన సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. నేతన్నల పట్ల కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న నేర పూరిత నిర్లక్ష్యం కార్మికుల ఉసురు తీస్తున్నదనిదని చెప్పారు. నేతన్నల బతుకులకు భరోసా ఇచ్చే బతుకమ్మ చీరల ఆర్డర్లను నిలిపివేసి వాళ్ల పొట్ట కొట్టటం న్యాయమేనా అని ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారికి ఉపాధి లేకుండా చేయటమేంటని నిలదీశారు. ఇది ప్రజాపాలనా? ప్రజల ప్రాణాలు తీసే పాలనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలని ముఖ్యమంత్రికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా మొద్దు నిద్ర నటిస్తున్నారని విమర్శించారు. ఇంకా ఎంతమంది ప్రాణాలు పోతే మీకు సోయి వస్తుందని ప్రశ్నించారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే చర్యలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మరొక్క ప్రాణం పోయినా అది ప్రభుత్వం చేసిన హత్యగానే భావించాల్సి ఉంటుందని ఎక్స్ వేదికగా చెప్పారు. తన మీద కోపంతో నేతన్నల ప్రాణాలు బలి పెట్టవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. వారికి తమ కన్నా ఎక్కువ మంచి చేసి వారి ప్రాణాలు నిలబెట్టాలన్నారు.

# భారీ వర్షాల కారణంగా ఆర్టీసీ బస్సులు రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 2: తెలుగు రాష్ట్రాల్లో వానలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులను రద్దు చేయాలని అధికారులు నిర్ణయించారు.నిన్న రాత్రి వరకు 877 బస్సులను తెలంగాణ ఆర్టీసీ రద్దు చేసింది. ఈరోజు(సోమవారం) ఉదయం నుంచి 570 బస్సులను రద్దు చేశారు. ముఖ్యంగా ఖమ్మం, విజయవాడ , మహబూబ్‌బాద్ వైపుగా వెళ్ళే రోడ్లన్నీ జలమయం అవ్వడంతో బస్సు రూట్‌లన్ను పూర్తిగా బంద్ చేశారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత మళ్ళీ బస్సులను నడుపుతామని ఆర్టీసీ అధికారులు అంటున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే బస్సులను గుంటూరు మీదుగా దారిమళ్లించారు. ఖమ్మం జిల్లాకు యధావిధిగా బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. **నేడు కూడా అతిభారీ వర్షాలు...** మరోవైపు ఈరోజు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ ప్రకటించింది. బంగాళాఖాతంలో అల్పపీడనంతో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. రేపు కూడా మహారాష్ట్రలోని విదర్భలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ క్రమంలోనే విదర్భకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వెస్ట్ మధ్యప్రదేశ్, మరాఠవాడ, తెలంగాణ, గుజరాత్ అస్సాం మేఘాలయలో భారీ వర్షాలు కురవనున్నాయని తెలిపింది. వెస్ట్ మధ్యప్రదేశ్, మరాఠవాడ, తెలంగాణ , గుజరాత్, అస్సాం, మేఘాలయకు ఐఎండీ ఆరంజ్ అలర్ట్ జారీ చేసింది. అటు రెండు తెలుగు రాష్ట్రాలు వర్షాలకు అతలాకుతలం అవవుతున్నాయి. జనజీవనం స్తంభించింది. కాలనీలకు కాలనీలే వరద నీటిలో చిక్కుకుపోతున్నాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా, నిజామాబాద్ తదితర జిల్లాల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నదులు, ఏరులు, వాగులన్నీ పొంగి పొర్లుతున్నాయి. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక జనం బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల వాసులు పూర్తిగా పునరావాస కేంద్రాలకు చేరారు. సమయానికి ఆహారం, నీరు, నిద్ర అన్నీ కరువై అలమటిస్తున్నారు.

# ఇంటికన్నె-కేసముద్రం రైల్వే ట్రాక్..



# యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

కేసముద్రం: తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కేసముద్రం మండలంలోని ఇంటికన్నె-కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ శనివారం రాత్రి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో పలు రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగించేందుకు రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రత్యేక రైళ్లలో కాజీపేట నుంచి ఇసుక బస్తాలు, సిమెంట్, కంకర తెప్పిస్తున్నారు. రాత్రి, పగలు 300 మంది కార్మికులు రెండు భారీ క్రేన్ల సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం మేరకు పనులు పూర్తి చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ రోజు పనులు పూర్తి చేసి మంగళవారం నుంచి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మరమ్మతులు జరుగుతున్న రైల్వే ట్రాక్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



# భారీ వర్షాలు.. 432 రైళ్లు రద్దు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఇప్పటి వరకు 432 రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. దీంతో పాటు 140 రైళ్లు దారి మళ్లించగా.. మరో 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. రద్దయిన వాటిలో సూపర్‌ఫాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా ఉన్నాయి. పలు పాసింజర్ రైళ్లను కూడా రద్దయ్యాయి.

# గరికపాడు వద్ద కొట్టుకుపోయిన రోడ్డు.. 3 కి.మీ మేర నిలిచిన సరకు లారీలు



కోదాడ రూరల్: సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్ వద్ద భారీగా సరకు లారీలు నిలిచిపోయాయి. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై 3 కిలోమీటర్ల మేర ఆగిపోయాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద జాతీయ రహదారి కొట్టుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మరోమార్గం లేక ఆ వాహనాల డ్రైవర్లంతా పడిగాపులు కాస్తున్నారు.

వారంతా రహదారిపైనే భోజనం చేస్తున్నారు. కోదాడకు చేరుకున్న వాహనాలను పోలీసులు మిర్యాలగూడ వైపునకు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. వాహనదారులు కోదాడ వైపు రావద్దని కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.




# శ్రీరామసాగర్‌కు భారీగా వరద 8 గేట్లు ఎత్తి నీటి విడుదల

**నిజామాబాద్ జిల్లా శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతుండడంతో.. 8 ప్రధాన గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహానికి అనుగుణంగా నీటి విడుదలను పెంచే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.**

# ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం ఇవ్వండి.. సైబరాబాద్ పోలీసుల ఆదేశాలు

హైదరాబాద్: తెలంగాణలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. కాగా.. ట్రాఫిక్ పోలీసులు ఐటీ కంపెనీలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. నగరంలోని అన్ని ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు ఆదేశించారు. ఇంటి నుంచి పని చేయడం ద్వారా అత్యవసరాల్లో రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తదని వారు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి నుంచే పనిచేసేందుకు అనుమతి ఇవ్వాలని కంపెనీలకు లేఖ రాశారు. వర్క్ ఫ్రం హెూం చేయాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించి, సహాయక శిబిరాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. **ఐటీ కారిడార్‌లో భారీగా ట్రాఫిక్..** హైదరాబాద్‌లో చినుకుపడితే భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఐటీ కారిడార్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. ఐటీ ఉద్యోగులంతా దాదాపు అందరూ సొంత వాహనాల్లో ఆఫీసులకు వస్తుంటారు. పని వేళలు ముగిసే సమయానికి ట్రాఫిక్ రద్దీ ఎక్కువైపోతోంది. అందుకే ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం అవకాశం ఇస్తే ట్రాఫిక్ తగ్గుతుందని..సహాయక చర్యలు తొందరగా చేపట్టేందుకు వీలు కలుగుతుందని పోలీసులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. శేరిలింగంపల్లి, చందానగర్, ఉప్పల్, చాంద్రయణగుట్ట, మియాపూర్, అల్విన్, హఫీజ్‌పేట, కొండాపూర్, ఫిల్మ్ నగర్, జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్, రహ్మత్ నగర్, ఎల్బీనగర్, హయత్ నగర్ , దిల్‌సుక్ నగర్, మలక్ పేట సహా చాలా ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

## సంపాదకీయం

# బెజవాడ మునక

## గుర్తుకొస్తున్న బ్రహ్మం గారి జోస్యం

వీర బ్రహ్మేంద్ర స్వామి వారు కాల జ్ఞానం చెప్పారు. ఆయన ఇప్పటికి అయిదు వందల ఏళ్ళ క్రితం వారు. ఆనాడు ఆయన చెప్పిన అనేక జోస్యాలు తరువాత కాలంలో నిజం అయ్యాయి. జనాలను నిశ్చేష్టులను చేశాయి. అలాంటి జోస్యమే ఒకటి ఆయన విజయవాడ మీద కూడా చెప్పారు. బెజవాడ లో క్రిష్ణ ఉప్పొంగి కొండ మీద ఉన్న కనకదుర్గమ్మ ముక్కు పుడకను తాకుతుంది అని బ్రహ్మం గారు ఆనాడు రాశారు. ఇపుడు చూస్తే విజయవాడ నిండా నీట మునిగింది. ఏకంగా మోకాల్లోతు పైగా నీళ్ళతో రోడ్లు నిండిపోయాయి. ఇళ్ళలోకి నీళ్ళు వస్తున్నాయి. బుడమేరు పొంగి పొరలి నగరం మీద పడింది. భారీ ప్రాజెక్టులు ఎపుడూ నిండవు, నిండినా అక్కడితో వాన ఉధృతి ఆగడం జరుగుతుంది. కానీ ఒకే రోజు ఏకంగా 29 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు అయితే తట్టుకోవడం కష్టమే కదా. వాగులు వంకలు అన్నీ ఒక్కటి అయి బెజవాడ మీదకు దండెత్తి వచ్చాయి. దాంతో నగరం నీటి మాటున దాగిపోయింది. బెజవాడలో ఎటు చూసినా నీరే కనిపించింది. ఎక్కడికీ పోని నీరుతో జనం సతమతమవుతున్నారు. జనాలు అలా బిక్కుబిక్కుమంటున్నారు. కేవలం రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి ఈ పరిస్థితి. ఇంకా మరి రెండు మూడు రోజులు భారీ వానలు కురుస్తాయని అంటున్నారు. అంతే కాదు ఎన్టీయార్ జిల్లాకు రెడ్ అలెర్ట్ ని వాతావరణ శాఖ ప్రకటించింది. దాంతో ఈ భారీ వానలు ఏమి కొంప ముంచుతాయో అని అంతా తల్లడిల్లుతున్నారు. ఇప్పటికే తిండి లేదు, ఆహారం లేదు, నీరు లేదు, నిద్ర లేదు ఇలా ఉంది బెజవాడ జనం పరిస్థితి. బెజవాడ ఎటు నుంచి ఎటు పోవడానికి అయినా కీలకమైన జంక్షన్. అలాంటి జంక్షన్ ఆగిపోయింది. దాంతో రైళ్లు బస్సులు కూడా ఆగిపోయాయి. అటు నుంచి వరకూ ఇతర రాష్ట్రాల లింక్ కూడా ఆగిపోయింది. మొత్తం మీద చూస్తే బెజవాడ ఇప్పట్లో నీటి నుంచి బయటకు వస్తుందా అన్న చర్చ కూడా సాగుతోంది. బెజవాడని బయటకు తేవడానికి తిరిగి సాధారణ పరిస్థితులు కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు.ప్రయత్నం చేస్తున్నారు. ఆయన బెజవాడ వీధులలో రెస్క్యూ టీంలతో కలసి బోట్ల మీద ప్రయాణం చేశారు. అదే విధంగా బెజవాడ సాధారణ పరిస్థితికి వచ్చేంత వరకూ తాను ఎన్టీయార్ జిల్లా కలెక్టరేట్ లోనే ఉంటాను అని కూడా బాబు ప్రకటించారు. మొత్తం మీద ఈ రకంగా వరదతో బెజవాడ నీట మునగడంతో ఇప్పటికి తాత్కాలిక చర్యలతో సరిపెడితే మాత్రం రానున్న కాలంలో ఇంతకు ఇంతా నగరం నీట మునుగుతుందని అపుడు బ్రహ్మం గారి జోస్యమే నిజం అవుతుందని జనాలు బెంగటిల్లుతున్నారు. ప్రభుత్వం తక్షణం శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. అంతే కాదు ఆక్రమణలను తొలగించి బెజవాడను నీరు పల్లమెరుగు అన్నట్లుగా తీర్చిదిద్దాలని అంతా కోరుకుంటున్నారు.

- కోయల్ కార్ రామ్ దయానంద్

# నిజామాబాద్, కామారెడ్డిలో అమృత్ ప్రాజెక్టుల సమగ్ర సమీక్షకు నేతృత్వం వహించిన షబ్బీర్ అలీ



నిజామాబాద్, సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) నిజామాబాద్ పట్టణ అభివృద్ధి త్రాగునీటి కొరకు 270 కోట్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగు నీటి కోసం 168 కోట్లు,కామారెడ్డి పట్టణ అభివృద్ధి కొరకు 93 కోట్ల నిధులతో శాశ్వత డ్రైనేజీ మరియు తాగునీటి సమస్యలు పరిష్కారం అయ్యేలా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) పథకం అమలుపై సోమవారం తెలంగాణ సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ (ఎస్ సి , ఎస్ టీ , ఓబీసీ,మైనారిటీలు) గౌరవ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్,కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ డిసిసి అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు నిజామాబాద్ కామారెడ్డి జిల్లాకు చెందిన ఇతర సీనియర్ నాయకులు అధికారులు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.అమృత్ 2.0 పథకం కింద నీటి సరఫరా, డ్రైనేజ్ ప్రాజెక్టులు,ముఖ్యంగా నిజామాబాద్,కామారెడ్డి పట్టణ స్థానిక సంస్థల (యుఎల్‌బి)లో కొనసాగుతున్న అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టులు నిజామాబాద్ అర్బన్ మరియు కామారెడ్డి పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి కీలకమైన నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య అవసరాలను తీర్చడం లక్ష్యంగా చేపట్టారు.నిజామాబాద్ లో, అమృత్ 2.0 కింద నీటి సరఫరా ప్రాజెక్టులో మోపాల్‌లో 8 ఎం ఎల్ డి సామర్థ్యంతో కొత్త నీటి శుద్ధి ప్లాంట్ (డబ్ల్యూ టీ పి ) నిర్మాణం అలీసాగర్ వద్ద ఇప్పటికే ఉన్న 15.92 ఎం ఎల్ డి డబ్ల్యూ టీ పి పునరుద్ధరణ ఉన్నాయి. జిల్లాలో నీటి నాణ్యత (పరిశుభ్రమైన) పంపిణీనిమెరుగుపరచడానికి ప్రాజెక్టులు రూపొందించబడ్డాయి.500 కే ఎల్ నుండి 1800 కే ఎల్ వరకు కెపాసిటీ కలిగిన 18 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్‌ల (ఈ ఎల్ ఆర్ ఎస్ ) నిర్మాణాన్ని కూడా ఈ ప్రాజెక్ట్ కలిగి ఉందని, శాశ్వత నీటి సరఫరాను అందించడానికి నగరం అంతటా వ్యూహాత్మకంగా రూపొందించామని షబ్బీర్ అలీగారు తెలియజేసారు. అదనంగా, 81.93 కి.మీ డక్టైల్ ఐరన్ (డి ఎల్ ) పైప్‌లైన్‌లు మరియు 66.79 కి.మీ హై-డెన్సిటీ పాలిథిలిన్ (హెచ్డీ పి ఎల్ ) పైప్‌లైన్‌ల ఏర్పాటు జరుగుతోంది. నీటి పంపిణీ మరియు పర్యవేక్షణను మరింత మెరుగుపరచడానికి, 12,394 కొత్త హౌస్ సర్వీస్ కనెక్షన్లు (హెచ్ ఎస్ ఈ లు) మరియు 146 బల్క్ ఫ్లో మీటర్లు నిర్మించడం జరుగుతుందికామారెడ్డిలో, అమృత్ పథకం కింద ముఖ్యమైన అప్‌గ్రేడ్‌లలో 5 ఎం ఎల్ డి సామర్థ్యంతో డబ్ల్యూ టీ పి ఏర్పాటు మరియు 500 కే ఎల్ నుండి 1100 కే ఎల్ వరకు సామర్థ్యాలతో తొమ్మిది కొత్త ఈ ఎల్ ఎస్ ఆర్ ల నిర్మాణం ఉన్నాయి. ఈ అందుబాటులోకి రాగానే కామారెడ్డిలో పెరుగుతున్న నీటి డిమాండ్‌ను తీర్చి శాశ్వతంగా నీటి సరాసరా క్రమబద్ధీకరించడానికి 7,220 కొత్త హెచ్ ఎస్ సి లు మరియు 70 బల్క్ ఫ్లో మీటర్ల ఏర్పాటుతో పాటుగా 36.4 %km DI% పైప్‌లైన్‌లు మరియు 63.9 %km HDPE% పైప్‌లైన్‌ల ఏర్పాటు కూడా చేస్తున్నాంఅమృత్ 2.0 పథకంలో నిజామాబాద్‌లోని మురుగునీటి (డ్రైనేజ్) ప్రాజెక్టు మరొక ప్రధాన అంశం.ఈ ప్రాజెక్టులో నగరం అంతటా సమగ్ర కవరేజీ ఉండేలా 109.107 కి.మీ.ల మేర వివిధ దయామీటర్ల మురుగు కాలువలను ఏర్పాటు చేస్తాం. మురుగు కాలువల ఏర్పాటుతో పాటు రోడ్డులు పునరుద్ధరణ పనులు చేపడుతున్నాము.

సమర్థవంతమైన మురుగు ప్రవాహాన్ని మరియు నిర్వహణను సులభతరం చేయడానికి 7,500 తనిఖీ గదులు మరియు అనేక జంక్షన్ ఛాంబర్‌ల నిర్మాణం కూడా జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో ఇన్‌స్పెక్షన్ ఛాంబర్స్ నుండి జంక్షన్ ఛాంబర్స్ వరకు 45,000 మీటర్ల హౌస్ సీవర్ లైన్‌లు (110%mm PVC% పైపులు) వేయడం, అలాగే 15,300 మీటర్ల సీవర్ లైన్ (%SWG% పైప్స్)తో పార్శ్వ లైన్‌లలో ఖాళీలను పూరించడం వంటివి ఉన్నాయి. అదనంగా, గ్యాప్ ఏరియాల్లో 251 మ్యాన్‌హెూల్స్‌ను నిర్మిస్తున్నాము మరియు ఇప్పటికే ఉన్న మురుగునీటి లైన్లను ప్రారంభించడం పురోగతిలో ఉంది. ప్రాజెక్ట్ 31.5 %MLD% మరియు15.5 %MLD% సామర్థ్యాలతో దుబ్బ మరియు ఎల్లమగుట్టలో ఇప్పటికే ఉన్న మురుగునీటి శుద్ధి కర్మాగారాల (%STPs%) నిర్మాణం మరియు నిర్వహణపై దృష్టి సారిస్తున్నాం. నిరంతర పర్యవేక్షణ మరియు నిర్వహణను నిర్ధారించడానికి ఈ %STP%ల వద్ద ఆన్‌లైన్ కంటిన్యూయస్ మానిటరింగ్ సిస్టమ్స్ (%OCEMS%) యొక్క సంస్థాపన కూడా అమలు చేయబడుతోంది.ఈ సమావేశంలో, షబ్బీర్ అలీ ప్రాజెక్ట్ నిర్మాణంలో సమయపాలనకు కట్టుబడి ఉండాలని అధికారులకు కాంట్రాక్టర్లకు ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు, నిర్ణీత 24 నెలల వ్యవధిలో అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా త్రాగునీరు మరియు మురుగునీటి మౌలిక సదుపాయాల నిర్మాణం మరియు పునరుద్ధరణలో అధిక-నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.వనరుల సమీకరణ, నిర్మాణాత్మక డిజైన్ల ఖరారు, అవసరమైన స్థలాలను అప్పగించడం వంటి పనులను వేగవంతం చేయాలనే అధికారులకుకోరారు.ప్రాజెక్టుల సజావుగా సాగేందుకు శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి అని నొక్కిచెప్పారు.ఈ సమావేశంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు టెలిఫోన్ ద్వారా పాల్గొని ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్ల కోసం భూసేకరణ, అప్పగింతలను వేగవంతం చేయాలని కోరారు నిజామాబాద్,కామారెడ్డిపట్టణలలో మౌలిక సదుపాయాలకు గణనీయమైన మెరుగుదలలను తీసుకువస్తుందని, ఈ ప్రాంతాల నివాసితులకు మెరుగైన నీటి సరఫరా మరియు మురుగునీటి నిర్వహణను నిర్ధారిస్తుంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం (43%) సహకారంతో నిధుల సమకూరు తాయి. రాష్ట్ర ప్రభుత్వం (47%), మరియు పట్టణ స్థానిక సంస్థలు (10%) వాటాతో పనులు త్వరగా పూర్తి చేస్తామనిషబ్బీర్ అలీ తెలియజేసారు

# ఎరువులు పుష్కలం.. అన్నదాతకు అభయం



తాండూరు: జిల్లాలో వానాకాలం పంటల సాగు అవసరాల రీత్యా ప్రభుత్వం సరిపోను ఎరువులను నిల్వ చేస్తోంది. నిర్ణీత గోదాముల నుంచి డిమాండ్ మేరకు ఎరువుల బస్తాలను దుకాణదారులకు సరఫరా చేస్తోంది. రైతులు అందుబాటులో ఉన్న దుకాణాలకు వచ్చి కావాల్సిన ఎరువుల బస్తాలను కొనుగోలు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

**సనత్‌నగర్, తిమ్మాపూరు నుంచి సరఫరా**

ఇతర దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విశాఖ పోర్టులకు ఎరువులు దిగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి గూడ్సు రైళ్ల ద్వారా హైదరాబాద్ సనత్‌నగర్, రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ గోదాములకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి జిల్లాలోని ఆయా విక్రయ కేంద్రాలకు మార్క్‌ఫెడ్ అధికారులు, ప్రైవేటు డీలర్లు వ్యవసాయ శాఖ సూచించిన మేరకు డిమాండ్‌ను బట్టి సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులకు ఎక్కడా ఎరువుల కొరత లేకుండా చూస్తున్నారు.

జిల్లాలోని 28 ఆగ్రోస్, 19 సహకార సంఘాలు, 3 డీసీఎమ్మెస్‌లు, 6ఎఫ్‌పీవోలు, 18 డీసీఎమ్మెస్‌లకు ఉన్న అనుబంధ సంస్థలతో పాటు 346 దుకాణాలకు మార్క్‌ఫెడ్ ద్వారా వ్యవసాయ శాఖ ఎరువులను సరఫరా చేస్తోందని జిల్లా మార్క్‌ఫెడ్ అధికారిణి తహసీమ తెలిపారు. గోదాములకు వచ్చిపోతున్న ఎరువులను ఎప్పటికప్పుడు గణిస్తున్నట్లు పేర్కొన్నారు.

వాడిన ఎరువులు (మె.టన్నులు)

యూరియా ..: 9,232

డీఏపీ..: 9,893

కాంప్లెక్స్..: 7,989

ఎంవోపీ..: 188

ఎస్ఎస్‌పీ..: 95

**వినియోగించినవి 27,397 మెట్రిక్ టన్నులు**

వానాకాలం సాగు కింద జిల్లాలో ఇప్పటి వరకు కంది, పత్తి, మినుము, పెసర, వరి, జొన్న, చిరుధాన్యాలు, మక్కలు, పత్తి తదితర పంటలను సాగు చేశారు. వీటి ఎదుగుదల, ఆశాజనకమైన దిగుబడులకు సంబంధించి 27,397 మెట్రిక్ టన్నుల ఎరువును వినియోగించారు. ఇంకా పంటల అవసరాల కోసం యూరియా 13,604, డీఏపీ 2,100, కాంప్లెక్స్ 4,786, ఎంవోపీ 292, ఎస్ఎస్‌పీ 175 మెట్రిక్ టన్నుల చొప్పున నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖలో ఎరువుల వ్యవహారాలు చూస్తున్న టెక్నికల్ వ్యవసాయ అధికారి స్నేహ లక్ష్మి తెలిపారు. ఎరువుల కొరత లేకున్నా ఇదే అదనుగా కొందరు వ్యాపారులు కల్తీలకు పాల్పడే అవకాశం లేకపోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో నాసిరకం పత్తి, కంది తదితర విత్తనాలు అమ్మడం, వాటిని అధికారులు పట్టుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఎరువు విషయంలో కూడా అలాంటివి చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. కాబట్టి అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

# వర్సిటీలు.. ఖాళీలు

హైదరాబాద్ : విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులు.. సహ ఆచార్యుల పదవీవిరమణలు విద్యార్థుల బోధనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 11ఏళ్ల నుంచి వర్సిటీల్లో శాశ్వత నియామకాలు చేపట్టకపోవడం.. మూడు దశాబ్దాల క్రితం సహాయ ఆచార్యులుగా ఉద్యోగాల్లో చేరిన వారు క్రమంగా ఉద్యోగ విరమణ చేస్తుండటంతో పోస్టులు వేగంగా ఖాళీ అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లోని ఐదు విశ్వవిద్యాలయాల్లో 60మందికి పైగా ఆచార్యులు, సహ ఆచార్యులు పదవీ విరమణ చేశారు. కొత్త నియామకాలపై ప్రభుత్వం దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి.

**బోధన అంతంతే.. ప్రాజెక్టులు వెనక్కి..** రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులు కొరత కారణం గా విద్యార్థులకు సరిగా తరగతులు జరగడం లేదు. ఉస్మానియా, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, జేఎన్ఏ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాల్లోని కొన్ని విభాగాల్లో ఒకరిద్దరు ఆచార్యులు మాత్రమే ఉన్నారు. దీంతో పరిశోధనలు చేసేందుకు సహకరిస్తున్న సంస్థలకు వెనక్కి వెళ్తున్నాయి. ఇలా ఏటా రూ.800కోట్ల విలువైన పరిశోధన ప్రాజెక్టులు తరలిపోతున్నాయని విశ్రాంత ఆచార్యులు, విద్యానిపుణుల అంచనా. ఒక్కో ప్రాజెక్టుకు రూ.10లక్షల నుంచి రూ.కోటి వరకూ ప్రాయోజిత సంస్థలు వెచ్చిస్తున్నాయి.

సహాయ ఆచార్యులుంటేనే.. వర్సిటీల్లో బోధనాప్రమాణాలు మెరుగుపడాలన్నా, బహుళజాతి సంస్థలకు ప్రాజెక్టులు, పరిశోధనలు చేయాలన్నా సహాయ ఆచార్యులుంటేనే సాధ్యం. శాశ్వత నియామకాలు చేపట్టకపోవడంతో అన్ని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిన నియమించారు. కాంట్రాక్టు పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనులు చేస్తున్నారు కదా అన్న ధోరణిలో గత ప్రభుత్వం వర్సిటీల్లో ఖాళీ పోస్టుల భర్తీని పక్కనపెట్టింది. దీంతో అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందుతున్నారు. శాశ్వత పద్ధతిలో నియమితులైన అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు విధులు నిర్వహిస్తున్నా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండడంతో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతులుండడం లేదు.

# మనకిదో 'పెద్ద'గుణపాఠం!

పెనుబల్లి : సహజసిద్ధ ప్రకృతి వనరు నీరు. నదులు, వాగులు, వంకలకు అడ్డుగా కట్టిన ఆనకట్టల్లోకి నీటిని చేర్చటం ఎంత ముఖ్యమో ప్రవాహానికి అనుగుణంగా దిగువకు పంపటం అంతే ప్రధానం. జలాశయాల్లో ఒడిసిపట్టిన నీటిని జాగ్రత్తగా విడిచిపెట్టకుంటే ఉపద్రవాలే సంభవిస్తాయి. ఈ ప్రక్రియలో కీలక భూమిక వహించే ప్రాజెక్టు గేట్లు, తూముల షట్టర్లు, పంట కాల్వలకు నీటిని తీసుకెళ్లే కాల్వలను పకడ్బందీగా నిర్వహించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా నష్టం తీవ్రత ఊహకందదు. అశ్వారావుపేట మండలంలో భారీ వర్షాలకు కొట్టుకపోయిన పెద్దవాగు ఆనకట్టే ఇందుకు ప్రబల నిదర్శనం. ఈ ఘటన నేపథ్యంలో ఉభయ జిల్లాల్లో పలు మధ్య, చిన్నతరహా ప్రాజెక్టుల నిర్వహణ తీరుపై బృంద కథనం.

సత్తుపల్లి నియోజకవర్గంలో ఏకైక మధ్యతరహా జలాశయమైన పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టు పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. వేల ఎకరాలకు సాగు నీరందించే జలాశయం ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. డ్యామ్ లీకవుతోంది. అలుగు మూడు గేట్లు పడిపోవడంతో వాటికి ఇటీవల మరమ్మతులు చేశారు. మిగతావి చేయాల్సి ఉంది. పెద్ద వాగు పరిస్థితి ఇక్కడ సంభవిస్తే వేల ఎకరాలు నీట మునిగిపోవడంతో పలు గ్రామాల ప్రజలు నిరాశ్రయులవుతారు. నిపుణుల బృందం సూచించినా.. ఏడాది క్రితం హైదరాబాద్ నుంచి వచ్చిన స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ అధికారుల బృందం ప్రాజెక్టును పరిశీలించి లోపాలు గుర్తించారు. వారి సూచన మేరకు ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.24.45కోట్ల అంచనాతో నివేదిక తయారు చేసి పంపారు. ఇంతవరకు నిధులు మంజూరు చేయలేదు. స్థిరీకరించిన ఆయకట్టు 7,350 ఎకరాలు కాగా మరో 3వేల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. పూర్తి స్థాయి నీటిమట్టం 14 అడుగులు కాగా మరో రెండు అడుగులు గేట్లు ఎత్తి నిల్వ చేస్తారు. నీటిమట్టం 16 అడుగులకు చేరిన తరువాత అలుగు ద్వారా అదనపు నీరు కట్లేరులో కలుస్తుంది.

మరమ్మతులు చేయాల్సినవి

కట్ట రివిట్‌మెంట్

డ్యామ్ లీకేజీలు

అలుగుపై తుప్పు పట్టిన గేట్లు

క్యాట్‌వాక్ బ్రిడ్జ రీ వంతెన రెయిలింగ్

కట్ట వెడల్పు రీ క్యాట్‌వాక్ బ్రిడ్జకి దిగే మెట్లు.

వెంగళరాయసాగర్‌కు మరమ్మతుల బెంగ

చంద్రుగొండ మండలంలోని అతిపెద్ద నీటి వనరైన వెంగళరాయసాగర్ జలాశయం అలుగు అయిదేళ్ల క్రితం ధ్వంసమైనా నేటికీ పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోక ప్రమాదం అంచునే ఉంది. 1965లో అప్పటి సీఎం జలగం వెంగళరావు హయాంలో దామరచర్ల-సీతాయిగూడెం గ్రామాల మధ్య ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు పరిధిలో చంద్రుగొండ, అయ్యన్నపాలెం, దామరచర్ల, సీతాయిగూడెం, మహ్మద్‌నగర్, తిప్పనపల్లి గ్రామాలకు చెందిన 2,200 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు అలుగు 2019లో ధ్వంసమైంది. ఆయకట్టు తగ్గిపోయి 1700 ఎకరాలే సాగవుతోంది. చివరి భూములకు నీళ్లందడంలేదు. ఏటా వర్షాకాలంలో ఒక్క పంటకు నీళ్లందించేందుకు ఇసుక బస్తాల ఏర్పాటుకు రూ.10లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ధ్వంసమైన అలుగు మరమ్మతులకు రూ.33.55 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నా.. అయిదేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకుంటే అలుగు భాగం మరింత కోతకు గురై ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం పొంచి ఉందని ఐబీ అధికారులు, నిపుణులు పేర్కొంటున్నారు.

**'రోళ్లపాడు' అస్తవ్యస్తం..**

టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ సమీపంలోని రోళ్లపాడు చెరువు తూము గేటు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గేటు శిథిలావస్థకు చేరడంతో పైకీకిందకు రావడం లేదు. ప్రాజెక్టు ఆయకట్టు విస్తీర్ణం 2,042 ఎకరాలు. రైతులు గతేడాది చందాలు వేసుకుని గేటును తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా, కొద్ది రోజులకే మొరాయించింది. ఇరిగేషన్ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో గతేడాది చెరువులో పోసిన చేపపిల్లలు వాగులో కలిసిపోయాయి. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. నిల్వ ఉండకపోవడంతో ఆయకట్టు రైతులు కొరత ఎదుర్కొంటున్నారు. తీవ్ర వర్షాలతో వరద ఉద్ధృతి పెరిగితే పంట పొలాలు నష్టపోయే ప్రమాదం ఉంది.

**గేట్లకు తోడుగా అలుగు..**

ఖమ్మం జిల్లాలో 2.5 లక్షల ఎకరాల సాగర్ ఆయకట్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పాలేరు జలాశయం. దీని పూర్తి స్థాయి నీటిమట్టం 23 అడుగులు. 2.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయంలో అంతకుమించి నీటి ప్రవాహం ఉంటే ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్ల ద్వారా పాలేరు ఏటి దిగువకు ప్రవహిస్తాయి. గతేడాది జులై 24న రాత్రి గేట్లు మొరాయించటంతో జలాశయంలో పోటెత్తిన వరద నీరు అలుగు ద్వారా దిగువకు ప్రవహించాయి. సిబ్బంది జాకీల ద్వారా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. పుణెకు చెందిన ప్రముఖ సంస్థ గార్డుబోలే ఇంజినీర్లు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టారు. గేట్ల ద్వారా 83వేల క్యూసెక్కుల వరద నీరు బయటకు వెళ్లగలుగుతుందని, అదనంగా 270 మీటర్ల పొడవైన అలుగు ఉండటంతో జలాశయానికి ఎలాంటి ప్రమాదం ఉండదని జలవనరుల శాఖ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు చెప్పారు.

**మొరాయిస్తున్నాయ్..**నేలకొండపల్లి మండలంలోని చెర్వుమాదారం చెరువు గేట్లు మొరాయిస్తున్నాయి. 0.83 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఈ జలాశయం నుంచి నందిగామ బ్రాంచి కాలువకు నీటిని విడుదల చేస్తారు. గేట్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వరద పోటెత్తితే అలుగు ద్వారానే ప్రవహిస్తుంటాయి.

# జీపీఎస్‌తో ఎయిర్‌టెక్ యంత్రాల జాడ

హైదరాబాద్: ఎయిర్‌టెక్ యంత్రం ఎక్కడుంది.. మురుగు నీటి సమస్య పరిష్కరించడానికి ఎంత సమయం తీసుకుంది ఇలా వాటి సేవలపై జలమండలి నిఘా పెట్టేందుకు సిద్ధమైంది.ప్రతి ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్‌ను అమర్చి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి 26 డివిజన్లలో 225 ఎయిర్‌టెక్ యంత్రాలు పనిచేస్తున్నాయి. వీటిని జలమండలి అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తోంది. ఏటా రూ.15 కోట్లపైనే ఖర్చు చేస్తోంది. ప్రతి యంత్రం నిత్యం 500 రన్నింగ్ మీటర్ల మురుగు పైపులను శుభ్రం చేయాలి. లాగ్ పుస్తకాల్లో తప్పుడు సమాచారం నమోదు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. 200 రన్నింగ్ మీటర్లు చెత్త తీసి...500 మీటర్లుగా నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా లేకపోవడం ఇందుకు దోహదం చేస్తోంది.

**ప్రైవేటు సేవలో తరిస్తూ...**

ఎక్కడైనా మురుగు పొంగితే వెంటనే ఈ యంత్రాలు సమస్యను పరిష్కరించాలి. జలమండలి వినియోగదారుల సేవా కేంద్రం 155313కు ఫోన్ చేసి 2-3 రోజుల దాటినా ఉపయోగం ఉండటం లేదు. నెలకు 20 వేల నుంచి 30 వేల వరకు కేవలం మురుగు సంబంధించి సమస్యలపైనే ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో పని చేసిన కొంతమంది విశ్రాంత ఉద్యోగుల బంధువుల పేరుతో కొని అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

నిఘా నేత్రం



## జర్నలిస్టుల రక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ గా బొబ్బిలి నర్సయ్య

నిజామాబాద్ , సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయుడబ్ల్యూజె - ఐజెయు) అనుబంధంగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడుల నివారణ (రక్షణ) కమిటీ రాష్ట్ర కన్వీనర్ గా టీయుడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బొబ్బిలి నర్సయ్యను ఎంపిక చేయడంపై నిజామాబాద్ జిల్లా కమిటీ సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



సీనియర్ జర్నలిస్టు, యూనియన్ రాష్ట్ర నాయకుడు బొబ్బిలి నర్సయ్యకు అవకాశం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేసినట్లు జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంజీవ్, జిల్లా కార్యదర్శి అరవింద్ బాలాజీ, కోశాధికారి సిరిగాద ప్రసాద్, ఆర్గనైజేషన్ కార్యదర్శి సంజీవ రెడ్డిలతో పాటు జిల్లా కమిటీ సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నిజామాబాద్, సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 28 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు, డీడబ్ల్యుఓ రసూల్ బీ,



నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చట్టం దినపత్రిక ఎడిటర్ సిరిగాధ ప్రసాద్ కి కలం యోధ అవార్డు

నిజామాబాద్, సెప్టెంబర్ 02(నిఘా నేత్రం ప్రతినిధి) నిజామాబాద్ నగరంలోని ఖలీల్వాడిలో గల రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సంగీత్ కల్చరర్స్ అకాడమీ వార్షికోత్సవంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రధానోత్సవం ఉత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి అవార్డులను ప్రధానం చేశారు. చట్టం దినపత్రిక ఎడిటర్ సిరిగాధ ప్రసాద్ కి కలం యోధ అవార్డును విశిష్ట అతిథులు ప్రముఖ సినీనటి



ఎస్టర్ నోరోన్హా చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత కాసర్ల శ్యామ్, ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ అమెరికా వాణి గడ్డం, నగర మున్సిపల్ కమిషనర్ మకరంద్, టీఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారాం, నిజామాబాద్ డిఆర్డిఓ సాయి గౌడ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, నిజామాబాద్ జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్, సంగీత్ కల్చరల్ అకాడమీ నిర్వాహకులు, గాయని గాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండండి

**-యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టండి**

**-భారీ వర్షాలపై కలెక్టర్లకు లేఖ రాసిన ఎంపీ అర్వింద్**



అర్వింద్ ధర్మపురి
अरविंद धर्मपुरी
ARVIND DHARMAPURI

MEMBER OF PARLIAMENT

నిజామాబాద్ , సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలపై నిజామాబాద్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి లేఖ రాసారు. లేఖలో జిల్లాలో ఇప్పటికే పనిచోట్ల రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఆర్ అండ్ బి, పోలీస్, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 26 గేట్లు తెరిచినందున మత్స్యకారులు, జాలర్లను అప్రమత్తం చేయాలని, నిరాశ్రయులైన లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి కనీస సౌకర్యాలు అందజేయాలని కోరారు. మరోవైపు ప్రజలంతా కూడా జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని ఆయన కోరారు. వ్యవసాయ మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని, గోదావరి పరివాహక గ్రామాల మత్సకారులు, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే భారతీయ జనతా పార్టీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

# ఎస్సారెస్పీని సందర్శించిన కలెక్టర్, సీపీ

**-దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశం**



నిజామాబాద్, సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) తెలంగాణలోని భారీ ప్రాజెక్టులలో ఒకటైన నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రిజర్వాయర్లో నీటిమట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టు కు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 .00 అడుగులు, 80.00 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1088 .8 అడుగులు, 72.6 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని అధికారులు తెలిపారు. పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుండి ప్రస్తుతం 2 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు. దీంతో 40 ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి లక్షా 63 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని కలెక్టర్ కు వివరించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేసి క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షిస్తున్నామని తెలిపారు దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, ప్రస్తుత లెవెల్ వద్ద నీటి నిల్వలను మెయింటైన్ చేస్తూ, ఎగువ నుండి వస్తున్న ఇన్ ఫ్లో కు అనుగుణంగా వరద జలాలను దిగువకు విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలతో పాటు దిగువన గల లోతట్టు గ్రామాల పరిస్థితి గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఎస్సారెస్పీ దిగువ ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేట, ఈత సరదా కోసం ఎవరు కూడా గోదావరి పరీవాహక ప్రాంతం వైపు వెళ్లకూడదని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కొడిచెర్ల, చాకిరియాల్, సావెల్, తడపాకల్, దొంచందా, గుమ్మిర్యాల్ గ్రామాల వద్ద ఎవరు కూడా గోదావరి వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని, ప్రాణ నష్టం వంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అప్రమత్తతతో కూడిన చర్యలు చేపడుతున్నామని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. లో లెవల్ వంతెనలు, కాజ్ వేల మీదుగా, రోడ్ల పై నుండి వరద జలాలు ప్రవిహిస్తున్న మార్గాలలో వాహనాల రాకపోకలను దారి మళ్ళించామన్నారు. ప్రతి చోట అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. అక్కడక్కడా పురాతనమైన 32 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, జిల్లాలో ఇంతవరకు ఎక్కడ కూడా పంటనష్టం వంటివి జరగలేదని వెల్లడించారు. ముందస్తుగానే మూడు చోట్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, ఎస్సారెస్పీ ఎస్.ఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

# భారీవర్షాలతో ప్రజలకు ఇబ్బందులు

**-అవసరమైతే తప్ప బయటకు రావాలి**

**-అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్**

నిజామాబాద్,సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప నగర ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని,భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగాఅధికార యంత్రాంగన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దన్నారు. నాళాలు, డ్రైనేజీ పొంగుపొర్లుతున్నందున చిన్నారులను, వృద్దులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులంతా చర్యలు తీసుకోవాలని కోరారు. ష్టవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతోపాటు మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిజా మాబాదు నగరంలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయని ఇటువంటి సమయంలో త్రాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్త తీసుకొని స్వచ్ఛమైన త్రాగు నీరు అందించేల చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు, మునిసిపల్ శాఖలకు విజ్ఞప్తి చేసారు. ఈదురు గాలుల వలన చెట్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న గృహాలలో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని,ఏవైనా ప్రమాదం జరిగే విధ్యుత్ స్తంభాలు ఉంటే వాటి వద్ద సూచికలు ఏర్పాటు చేయవలసిందిగా కరెంటు డిపార్ట్మెంట్, మునిసిపల్ శాఖకు విజ్ఞప్తి చేశారు. నగర ప్రజలు కూడా విధ్యుత్



స్తంబాలు తెగిపడిన విద్యుత్ వైర్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విషజ్వరాలు ప్రభాలుతున్న ఈ సమయంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మందుల కొరత, డాక్టర్ కొరత లేకుండా చూడాలని వైద్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది నిల్వ ఉన్న వర్షపు నీటిని, కలుషిత నీటి వ్యర్థలను తొలగించాలని,కాలనిలో దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్, స్ప్రే చేయాలనీ విజ్ఞప్తి చేసారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. నగర వాసులకు ఎటువంటి ఇబ్బంది ఉన్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నెంబర్ 8309038027కు అలాగే జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183 వెంటనే సమాచారం ఇవ్వగలరని కోరారు.

## విద్యా సంస్థలకు మంగళవారం కూడా సెలవు

**-కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

నిజామాబాద్, సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు వరుసగా ఈ నెల 3వ తేదీన (కూడా) సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు సెలవు పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు మంగళవారం సైతం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు

## నవీపేట్ గ్రామ పంచాయతీలో డిపిఓ ఆకస్మిక తనిఖీ

నవీపేట్, సెప్టెంబర్ 02 (నిఘా నేత్రం ప్రతినిధి) నిజామాబాద్ జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తుల తరుణ్ నవీపేట గ్రామ పారిశుద్ధ్య నిర్వహణను ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు దృష్ట్యా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి మురికి




కాలువలలోని పూడికను తొలగించి శుభ్రం చేయించాలని నవీపేట్ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి కే రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ, సెప్టెంబర్ 2 (నిఘా నేత్రం ప్రతినిధి) గత మూడు రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణరాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహా దారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీలో పర్యటించారు. కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశిం చారు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించాల



న్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకువెళ్ళవద్దని,అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు. కరంటు స్తంభాలు,వైర్లనుముట్టుకోవద్దన్నారు. చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచాలని, బయటకు రానివ్వద్దన్నారు. ఆయన వెంట బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగంగంగాధర్,ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు,నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సేవలు మరువలేనివి

**-కాంగ్రెస్ నాయకులు**

నిజామాబాద్, సెప్టెంబర్ 02( (నిఘా నేత్రం ప్రతినిధి) నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ భవన్ లో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి అని,రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి రైతులందరికీ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చారని,రుణమాఫీ



చేశారని,అదేవిధంగా విద్యార్థుల కోసం ఫీస్ రీయింబర్స్ మెంట్ చేశారని అన్నారు. అదేవిధంగా బడుగు బలహీనర్గాలకు ఎన్నో సేవలు చేశారని పెదాల కోసం ఆరోగ్య శ్రీ పథకం అందించారని .ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఎస్ఆర్ మార్గంలో రైతులకు రుణమాఫీ చేశారని ప్రజలకు సేవ చేస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నటికీ రాజశేఖర్ రెడ్డి ని మరువలేరాని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐడీసీఎమ్ఎస్ చైర్మన్ తార చంద్ నాయక్,సీనియర్ నాయకులు అదే ప్రవీణ్,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్,రాష్ట్రఎన్ ఎస్ యు ఐ %ఱ% ఉపాధ్యక్షులు విపుల్ గౌడ్,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం,సుభాష్ జాదవ్,సాయిలు,లవంగ ప్రమోద్,స్వామి గౌడ్,సాయి కుమార్ ,కేశ రాజు, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

# సారొోస్తారా..!

తాండూరు : జిల్లాలో విద్యా వ్యవస్థపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభమై మూడు నెలలు కావొస్తున్నా తరగతులు సక్రమంగా సాగడంలేదు. బదిలీలు, పదోన్నతుల తరువాత పరిస్థితి మరింత గందర గోళానికి దారితీసింది. ఉన్నత విద్యా వ్యవస్థ కొంత పర్లేదనిపించినా.. ప్రాథమిక పాఠశాలల బోధన సార్లు లేక గాడి తప్పింది. జిల్లాలో నెలకొన్న ఈ పరిస్థితులపై కథనం.

సర్దుబాటుకు అంగీకరించడంలేదు

జిల్లాలోని సమీప పాఠశాలలో ఎక్కువ సంఖ్య విద్యార్థులున్న పాఠశాలలకు వెళ్లేందుకు 'సర్దుబాటు'కు ఎంఈఓల సూచనలను ఉపాధ్యాయులు అంగీకరించడంలేదు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య ఎక్కువ, తక్కువలపై విద్యాశాఖ కార్యాలయానికి నివేదిక పంపినా నేటికీ చర్యలు కానరాలేదు.

పరిగి: పరిగి మండలం ఇబ్రహీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 68 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులున్నారు. పాఠశాలకు వెళ్లాలంటే గడిసింగాపూర్ గ్రామం వద్ద దిగాల్సి ఉంది. ఆరు కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి బస్సు సదుపాయం సరిగా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు రాలేకపోతున్నారని తల్లిదండ్రులు తెలిపారు.

పూర్తిగా మూసేశారు

కొడంగల్ మండలంలోని ధర్మాపూర్‌లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో పాఠశాలను పూర్తిగా మూసేశారు. గత్యంతరంలేక



అంగడిరైచూర్ ప్రభుత్వ పాఠశాలలో కొందరు విద్యార్థులు చేరగా, మరికొందరు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.

పొరుగు గ్రామాలకు వెళ్తున్నారు

తాండూరు పట్టణ శివారు యాలాల మండలం బామ్లానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిల దశకు చేరడంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించడం మానేశారు. ఐదేళ్ల క్రితం పూర్తిగా మూత పడింది. ఇక్కడి ఉపాధ్యాయులను ఇతర గ్రామాలకు బదిలీచేశారు. చేసేది లేక విద్యార్థులు పొరుగున ఉన్న రాజీవ్ గృహకల్ప కాలనీ, కోకట్ గ్రామాలకు వెళ్తున్నారు.

జిల్లాలో విద్యా వ్యవస్థ తీరు

ప్రాథమిక పాఠశాలలు: 764 ప్రాథమికోన్నత: 116 ఉన్నత: 174 మొత్తం విద్యార్థులు: 1,09,500 బదిలీ అయిన ఎస్‌జీటీలు: 1075 ఎస్ఏలు: 641 స్పౌజ్ బదిలీలు: 170 ఉండాల్సిన ఉపాధ్యాయులు: 4335 ప్రస్తుతం అందుబాటు: 3,717 భర్తీచేయాల్సి ఖాళీలు: 630

# ఆస్పత్రుల్లో మందుల కొరత

కరీంనగర్ : కరీంనగర్ జనరల్ ఆస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న రోగికి వైద్యుడు రాసిన మందుల చీటీ. ఇందులో పైన రాసిన రెండు మాత్రలు అజిత్రోమైసిన్-500, విటమిన్-సి అందుబాటులో లేవని ఫార్మాసిస్ట్ ఇలా వాటి పేర్ల పక్కనే మార్క్ చేసి అవి తమ వద్ద ప్రస్తుతం అందుబాటులో లేవు. బయట దుకాణాల్లో తీసుకోండి. అని సూచించారు. దీంతో బాధితుడు ప్రైవేటు దుకాణంలో రూ.210 వెచ్చించి తీసుకున్నాడు. గురువారం ఆస్పత్రికి వచ్చిన 1250 మందికి రాసిన వాటిలో ఒకటి, లేదా రెండు రకాలు బయటనే కొనాల్సి వచ్చింది.

అందుబాటులో లేనివి..అజిత్రోమైసిన్, డైక్లోఫెనాక్, విటమిన్-సి, సెఫిక్సిమ్, మిసోప్రోస్టల్, సిప్రోఫ్లాక్సిన్, ఆస్కార్బిక్ ఆసిడ్, టెల్మిస్ర్టాన్, నిఫిడెపైన్ తదితర 15 రకాల మాత్రలు ఆస్పత్రుల్లో అందుబాటులో లేవు. నొప్పుల గోళీలను వైద్యులు రాస్తుండటంతో విధిగా వేరే చోట కొనాల్సి వస్తోంది. వీటితోపాటు చర్మ సంబంధితమైన ఆయింట్‌మెంట్‌లో కీలకమైన మెకనోజాల్ లేదు. కంటికి, చెవికి సంబంధించిన చుక్కల మందుగా దవాఖానాల్లో ఇచ్చే సిప్లా ఔషధం కరవైంది. ఇవే కాకుండా దాదాపుగా 15 వరకు ఇంజక్షన్‌లు అరకొరగా ఉండటంతో ఉన్న వాటితో సరిపెడుతున్నారు.

ఎక్కడెక్కడ ఎలా..?పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో మందుల కొరతతో ఆస్పత్రి నిధుల నుంచి కొన్నింటిని స్థానిక ఔషధాలయాల నుంచి టెండర్ విధానంలో కొనుగోలు చేశారు. నానాటికీ సీజనల్ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ 600 మంది వరకు రోగులు రోజూ వైద్యానికి వస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆస్పత్రికి రోజూ వైద్యం కోసం 450-500 మంది వస్తారు. ఇక్కడ 150 పడకల ఆస్పత్రితోపాటు మాతాశిశు కేంద్రంలోనూ చికిత్సనందుకునే వారు ఎక్కువగానే ఉంటారు. ప్రస్తుతం ఇక్కడ కొన్ని మందులు అందుబాటులో లేవు. లేని మాత్రలను బయట కొనడంతో కొందరు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి రోజూ దాదాపు 800 మంది రోగులు వస్తున్నారు. గతంలో 500- 600 వచ్చే వారి సంఖ్య జ్వరాలతో గణనీయంగా పెరిగింది. దీంతో మందుల కొరత ఏర్పడింది.

సరఫరా లేక...ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ.8.5 కోట్ల విలువైన ఔషధాలు హైదరాబాద్ నుంచి సరఫరా చేస్తారు. జ్వరాలు, ఒళ్లు నొప్పుల తీవ్రతతో కొన్ని రకాల మందుల వినియోగం పెరగడంతో కొరత ఏర్పడింది. ఈ ఇబ్బందిని అధిగమించేందుకు నాలుగు జిల్లాల ఆస్పత్రుల్లోనూ తక్షణ అవసరాల కింద కొన్ని మందులను కొనుగోలు చేస్తున్నారు. ఆస్పత్రి నిధులను ఇందుకోసం వెచ్చిస్తున్నారు. కరీంనగర్‌లో ఇప్పుడున్న ఇబ్బందిని అధిగమించేందుకు అవసరమైన మందులను రూ.25 లక్షల వరకు టెండర్ల రూపంలో కొనబోతున్నారు. ఇదే విధంగా మిగతా జిల్లాల్లోనూ రోగులకు ఇబ్బంది రాకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నారు.

మాలాంటి వాళ్లకు కష్టం.. నా చేతి నొప్పి తీవ్రంగా ఉంది. డాక్టర్ కొన్ని మందులు రాసిచ్చారు. ఇక్కడ అడిగితే ఇవి లేవన్నారు. బయట కొన్నా. రూ.350 అయ్యాయి. మాలాంటి వాళ్లకు ఇబ్బంది అవుతుంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లడానికి ఇబ్బంది అని ఇక్కడి వస్తే ఇక్కడ కూడా పైసలు ఖర్చువుతున్నాయి.

- బొంగోని గౌరవ్వ, లొత్తునూరు, గొల్లపల్లి మండలం

నొప్పుల గోళీలు లేవట నొప్పుల గోళీలే లేవట. బయట కొనాలి. బయట వీటికి ఎన్ని పైసలయితయో.. ఏమో.! సర్కారు దవాఖానాలో మందులు లేకుంటే కష్టమైతది. నాకే కాదు అందరికీ ఏదో ఒక గోళీ తక్కువగా ఇస్తున్నారు. -రవి, బావుపేట, కరీంనగర్ఇబ్బంది రాకుండా చూస్తున్నాం.. మందుల పరంగా ఇబ్బంది రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసరంగా ఏమేమి అవసరమో వాటిని కొనుగోలు చేస్తాం. సర్కారు ఆస్పత్రిలో అందుతున్న సేవలపై నమ్మకంతో ఇక్కడికి ఎక్కువ మంది వస్తున్నారు. పరిస్థితుల్లో మరింతగా మెరుగైన సేవల్ని అందించగలగాలి. లోపాలను సరిచేసి అవస్థలు లేకుండా పర్యవేక్షణ పెంచుతున్నాం. - డా.వీరారెడ్డి, జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు, కరీంనగర్

# తీరనున్న వన్యప్రాణుల దాహార్తి



పెద్దపల్లి : వన్యప్రాణుల దాహార్తి తీర్చడంతో పాటు భూగర్భ జలాలు పెంచేందుకు అటవీశాఖ నిర్మించిన నీటి వనరులు జలకళ సంతరించుకున్నాయి. గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలు, నీటికుంటలు, ఇతర వనరులు పొంగిపొర్లుతున్నాయి. అటవీ ప్రాంతం పచ్చదనాన్ని సంతరించుకుంది. వనరుల్లోకి నీరు సమృద్ధిగా చేరడంతో వన్యప్రాణులకు తాగునీటి కష్టాలు దూరమ య్యాయి.

పుష్కలంగా భూగర్భ జలాలు

గత వేసవిలో నీటి వనరుల్లో నీరు లేక వన్యప్రాణులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తాగు నీటికోసం గ్రామాల సమీపంలోకి రావడంతో రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మృత్యువాత పడ్డాయి. అడవిలో నీటి వనరుల చెంత వేటగాళ్లు బిగించిన ఉచ్చుకు బలైపోతున్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్న అధికారులు కొండలు, రాళ్లగుట్టలు, వాగులు, వంకల్లో ప్రవహించే నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు చెక్‌డ్యాంల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పూర్తిస్థాయిలో నీరు చేరడంతో వేసవిలో నీటి ఎద్దడి తీరనుందని అధికారులు భావిస్తున్నారు.

సంరక్షణతో జీవం

జిల్లాలో 31,100.368 హెక్టార్లలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో గతంలో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం జిల్లాలోని అడవుల్లో ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, జింకలు, కనుజులు, దుప్పులు, కుందేళ్ల సంచారం ఉంది. గత కొన్నాళ్లుగా అటవీ ప్రాంతాలు కబ్జాలకు గురవుతుండటంతో అధికారులు దృష్టి సారించారు. అటవీ ప్రాంతం కబ్జాకు గురికాకుండా 3 లక్షల మీటర్ల వరకు కందకం, గుట్టలు, కొండల దిగువ ప్రాంతాల్లో 25 వేల కాంటూరు కందకాలు నిర్మించారు. రూ.54.80ల వ్యయంతో 11 చెక్‌డ్యాంలు, రూ.7.80 లక్షల వ్యయంతో భారీ నీటినిల్వ తొట్లు 6 నిర్మించారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం: 31,100.368 హెక్టార్లు ఉండగా 14 సెక్షన్లు, 40 బీట్లు ఉన్నాయి.

సంరక్షణతో జీవం

జిల్లాలో 31,100.368 హెక్టార్లలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో గతంలో పెద్దపులి సంచరించింది. ప్రస్తుతం జిల్లాలోని అడవుల్లో ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్లు, జింకలు, కనుజులు, దుప్పులు, కుందేళ్ల సంచారం ఉంది. గత కొన్నాళ్లుగా అటవీ ప్రాంతాలు కబ్జాలకు గురవుతుండటంతో అధికారులు దృష్టి సారించారు. అటవీ ప్రాంతం కబ్జాకు గురికాకుండా 3 లక్షల మీటర్ల వరకు కందకం, గుట్టలు, కొండల దిగువ ప్రాంతాల్లో 25 వేల కాంటూరు కందకాలు నిర్మించారు. రూ.54.80ల వ్యయంతో 11 చెక్‌డ్యాంలు, రూ.7.80 లక్షల వ్యయంతో భారీ నీటినిల్వ తొట్లు 6 నిర్మించారు. జిల్లాలో అటవీవిస్తీర్ణం: 31,100.368 హెక్టార్లు ఉండగా 14 సెక్షన్లు, 40 బీట్లు ఉన్నాయి.

నిఘా పెంచుతున్నాం

- శివయ్య, జిల్లా అటవీశాఖ అధికారి

జిల్లాలో అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో వన్యప్రాణుల దాహార్తితోపాటు భూగర్భ జలాలు పెంచేందుకు చెక్‌డ్యాంలు, నీటి తొట్ల నిర్మాణాలు చేపట్టాము. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు సమృద్ధిగా చేరింది. వన్యప్రాణులకు నీటి కష్టాలు తీరాయి. అడవి జంతువులు వేటగాళ్ల బారిన పడకుండా నిఘా పెంచుతున్నాం.

# వసతి గ్రహణం



సిరిసిల్ల : బోధనతోపాటు ఆవాసాన్ని కల్పించే వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆశ్రమాల పరిసరాలు పిచ్చిమొక్కలతో విష సర్పాలకు నివాసాలవుతున్నాయి. చిన్న చిన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోక బాలబాలికలకు శాపంగా మారుతున్నాయి.

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలతోపాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో సుమారు ఆరు వేల మంది విద్యార్థులు ఉన్నారు. చాలా చోట్ల ఊరికి దూరంగా ఉన్నాయి. వనాలకు చేరువ, పొలాల మధ్య ఏర్పాటు చేయడంతో విష సర్పాలు తిరుగుతున్నాయి. దీనికి తోడు మైదానం, భవనాలు, కిటికీల వరకు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం జిల్లాలో సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. సిబ్బంది హాజరు, భోజన నాణ్యతను పరిశీలిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులను నియమించాం. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, లేదా, పరిశుభ్రత పాటిస్తున్నారా, లేదా పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా సమస్యలున్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

- ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల వసతి గృహాల పరిసరాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఆదర్శ వసతి గృహంలో కిటికీల వరకు పెరిగాయి. సర్పాలు కిటికీల గుండా లోనికి వెళ్లే అవకాశాలు ఉండటంతో బాలికలు భయంగా గడుపుతున్నారు మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఇరుకు గదులతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో బాలికలు నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల జ్వర పీడితులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయలేదు. తీవ్ర అనారోగ్యానికి గురైతే తల్లిదండ్రులకు సమాచారమిచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

కేజీబీవీలో 200 మంది పైగా బాలికలు ఉన్నారు. కిటికీల తలుపులు ఊడిపోవడంతో చలి, వర్షపు చినుకులు గదిలోకి వస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి గురుకుల పాఠశాలను అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నిర్వహిస్తున్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో కొనసాగుతుంది. చిన్న చిన్న గదుల్లో ఒక డార్మెటరీపై నలుగురు విద్యార్థులు నిద్రిస్తున్నారు. గ్రీజర్ లేకపోవడం వల్ల చల్లని నీటితో స్నానం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల చుట్టూ పొలాలు ఉండటంతో విష కీటకాలు లోపలికి వచ్చే ప్రమాదం ఉంది.

# శునకాల నియంత్రణ ఏదీ?

పెద్దపల్లి: వీధి కుక్కల సంతతి నియంత్రణకు కార్యాచరణ తూతూమంత్రంగా జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. వీటి కారణంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టాలంటే జంకే పరిస్థితి నెలకొంది. శునకాల సంతతి నియంత్రించేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గ్రామాలు, పట్టణాల్లో జంతు సంతతి నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి శునకాల గణన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 11,748 పెంపుడు, 35,990 వీధి కుక్కలు కలిపి మొత్తం 47,738 ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. వీటి సంతతి పెరగకుండా చేపడుతున్న చర్యలను జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శంకర్‌తో ప్రస్తావించగా... నగరపాలక, పురపాలికలతో పాటు పంచాయతీరాజ్ శాఖ సహకారంతో త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యుల కొరత ఉండటంతో ప్రక్రియ సాఫీగా సాగడం లేదని.. ఇతర రాష్ట్రాల నుంచి పశువైద్యులను రప్పించి త్వరలో చర్యలు చేపడతామన్నారు.

పెరుగుతున్న బాధితులు

కుక్కల బెడద పెరిగిపోవడంతో తరచూ జిల్లావ్యాప్తంగా ఎక్కడో ఒకచోట ప్రజలు కుక్కకాటు బారిన పడుపతున్నారు. గడచిన మూడు నెలలుగా



కుక్కకాటుతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందినవారు 246 మంది ఉన్నారు. దాదాపు 235 వరకు మూగజీవాలను సైతం ఇవి గాయపరిచాయి. ఒక్కో శునకానికి శస్త్రచికిత్స చేసేందుకు రూ.1600 వరకు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. జంతుసంతతి నియంత్రణ కేంద్రం(ఏబీసీ సెంటర్) ఏర్పాటు చేసి శునకాలకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా ఇంకా ప్రక్రియ ప్రారంభం కాలేదు. జిల్లావ్యాప్తంగా వీధుల్లో గుర్తించిన శునకాలను ఈ కేంద్రానికి తీసుకువచ్చి శస్త్రచికిత్స చేసి అనంతరం వదిలేయాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా పశు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో శునకాలకు ఎలా శస్త్రచికిత్స నిర్వహించాలో అధికారులకు అంతుచిక్కడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి శునకాల బారినుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు. ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.- అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

# ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు.సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

## చర్లపల్లిలో రైళ్ల భద్రతా తనిఖీలు

హైదరాబాద్ : సామర్థ్యానికి మించి రైళ్లు నడపడం, భద్రతా తనిఖీల్లో జాప్యంతో సమయపాలన గాడి తప్పి అనేక రైళ్లు రద్దవుతున్నాయి. నగరంలో భద్రతా తనిఖీలు చేసే పిట్‌లైన్లు ఎక్కువగా లేకపోవడంతోనే రైళ్లు ఆలస్యమవుతున్నాయి. వందల సంఖ్యలో రైళ్లు, లక్షలాది మంది ప్రయాణించే రైళ్ల సమయ పాలన సరిగా ఉండేలా దక్షిణ మధ్యరైల్వే సన్నాహాలు చేస్తోంది.సికింద్రాబాద్, కాచిగూడ, లింగంపల్లి స్టేషన్లలో భద్రతా తనిఖీల కోసం పిట్‌లైన్లు ఉన్నా రాకపోకలు సాగించే రైళ్లను తనిఖీ చేసేందుకు టైమ్‌స్లాట్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజూ 12 రైళ్లలో..సుదూరం వెళ్లే రైళ్లు లేదా 1800 కి.మీ వెళ్లే ప్రతిరైలుకు సేఫ్టీచెక్ తప్పనిసరి. భద్రతను పరిశీలించిన తర్వాతే మరో చోటికి పంపాలన్న నిబంధనలున్నాయి.

ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో పిట్‌లైన్లను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే భావిస్తోంది. ఒక రైలు భద్రతా తనిఖీకి 6గంటల సమయం పడుతుంది. రోజుకు ఒక్కో పిట్‌లైన్‌లో మూడు చొప్పున ప్రతి రోజూ 12 రైళ్లలో భద్రతా తనిఖీలు చేయనున్నారు. 500కిలోమీటర్ల పరిధిలో ప్రయాణించే రైళ్లకు ఓఇఎం (అదర్ ఎండ్ మెయింటనెన్స్) రైళ్లను శుభ్రపరచడం, నీరు, విద్యుత్తు సరఫరా తదితరాలను ఇక్కడే పరిశీలించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాందేడ్, నిజామాబాద్ మీదుగా నగరానికి వచ్చే రైళ్లను మల్కాజిగిరి లోని దయానంద్‌నగర్ స్టేషన్ నుంచి మౌలాలీ మీదుగా చర్లపల్లి



తరలించాలని అధికారులు భావిస్తున్నారు. ఇలా చేయడంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

ప్రస్తుతం ఆగుతున్న రైళ్లు కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ కృష్ణా ఎక్స్‌ప్రెస్ గుంటూరు ఇంటర్ సిటీ కాచిగూడ-మిర్యాలగూడ పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్) శబరి ఎక్స్‌ప్రెస్ రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం) శాతవాహన కాకతీయ ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్)కాచిగూడ, మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రేపల్లె ఎక్స్‌ప్రెస్ (రాత్రి)

## కబ్జా చెరలో పదెకరాల గొల్లచెరువు

తాండూరు: తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు శిఖం భూమిలోని పది ఎకరాలు పూర్తిగా కబ్జాకు గురైందని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు తేల్చారు. ఈమేరకు వారు శాటిలైట్ సర్వే నిర్వహించారు. ఒకప్పుడు తాగు, సాగు నీటికి ఉపయోగపడింది. కాలక్రమంలో ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చే శిఖం భూములు ఆక్రమణలకు గురై వర్షాలకు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. గొల్లచెరువులోకి మురుగు నీరు రాకుండా చేసేందుకు ప్రత్యేకంగా కాలువ నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవలే నిధులను మంజూరు చేసింది. వీటి ఆధారంగా కాలువను నిర్మించేందుకు



ఇంజినీర్లు సర్వే చేశారు. ఈ నేపథ్యంలోనే గొల్ల చెరువు శిఖం 10 ఎకరాలకు గురైందని గుర్తించారు. ప్రస్తుతం ఉన్న శిఖంలోకి మురుగు నీరు రాకుండా చుట్టూరా కాలువను నిర్మించి దిగువన ఉన్న కాగ్నానదిలోకి పంపించేందుకు నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల జోలికి వెళ్లదలచు కోలేదని అధికారులు తెలిపారు.

## తిరస్కరణకు తొందరెందుకు?

హైదరాబాద్ : కొత్త కనెక్షన్ జారీ, యజమాని పేరు మార్పిడి, కేటగిరీ మార్పు వంటి సేవలు అందించడంలో తీవ్ర జాప్యం చేసే విద్యుత్తు పంపిణీ సంస్థ.. వినియోగదారుల దరఖాస్తులను తిరస్కరించడంలో మాత్రం ఎక్కడ లేని తొందర ప్రదర్శిస్తోంది. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల్లో ఏవైనా పత్రాలు తక్కువ ఉంటే తిరస్కరిస్తున్నారు. చాలావరకు వినియోగదారుల సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. వెబ్‌సైట్‌లో, ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కొందరివి అసంపూర్తిగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వినియోగదారులకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారు. అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు గడువు 48 గంటలే ఇస్తున్నారు.




ఎస్ఎంఎస్‌ను కొందరు వెంటనే చూసుకోకపోవడం.. కోరిన పత్రాలను సేకరించేందుకు కొంత సమయం పట్టడం వంటి కారణాలతో గడువులోపు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు.

ఎందుకిలా? ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. గడువు లోపల ఎన్ని పరిష్కరించారు..వందశాతం సాధించారా.. లేదా.. అనే గణాంకాలను మాత్రమే సమీక్షల్లో పైఅధికారులు చూస్తున్నారు. దరఖాస్తు పెండింగ్‌లో చూపిస్తే దానికి అధికారులు కారణాలు చెప్పాలి. తమ రికార్డుల్లో గడువులోగా అన్ని కనెక్షన్లు ఇచ్చామని చూపేందుకు ఈ తరహాలో డిస్కం ఆన్‌లైన్ వ్యవస్థ తిరస్కరిస్తోంది. కనీసం పక్షం రోజులైనా గడువు ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు. తిరస్కరించిన తర్వాతనైనా కూడా ఎడిట్ ఆప్షన్ ఇస్తే అందులో పత్రాలను అప్‌లోడ్ చేసేందుకు వీలవుతుంది. దీన్ని పరిశీలించాలని సీఎండీని కోరుతున్నారు.

# ఎన్నెన్నో విశేషాలు.. మిగిలాయి అవశేషాలు



శంషాబాద్ : ఒకప్పుడు 45 చెరువులను నింపి సుమారు 75 వేల ఎకరాలకు సాగునీరందించిన జల్‌పల్లి పరిధిలోని ఫిరంగి నాలా ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. గత 15 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి గురికావడంతో ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ నాలా వెంట చిన్నాపెద్దా సుమారు 20 వేల ఇళ్లు వెలిశాయంటే పరిస్థితి ఏ స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నాలాను పునరుద్ధరించి జలవనరులను కాపాడాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో నాలాను పరిశీలించగా.. అనేక ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. ప్రత్యేకతలివీ..మూసీ నదికి ఉప నదైన ఈసీ నదికి అడ్డంగా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామ సమీపంలో 1972లో నిజాం ప్రభుత్వం ఆనకట్టను నిర్మించింది.

వరద నీటిని ఇందులోకి మళ్లించే వారు. షాబాద్ మండలంలో ప్రారంభమైన ఫిరంగి నాలా కొత్తూర్ మండలంతో పాటు శంషాబాద్, సరూర్‌నగర్ తదితర మండలాల్లోని సుమారు 45 గొలుసు కట్టు చెరువులను, కుంటలను నింపుకుంటూ చివరిగా ఇబ్రహింపట్నం మండలం పెద్ద చెరువులోకి వరద నీరు ప్రవహించేలా రూపకల్పన చేశారు.నాలా 31 అడుగుల వెడల్పుతో సుమారు 65 కి.మీ మేర నిర్మించారు. 81 ప్రాంతాల్లో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు, తూములు, అలుగులు నేటికీ చెక్కుచెదరలేదు.

శంషాబాద్ మండలం పాల్మాకుల్ గ్రామ సమీపంలోని అచ్చంపేట వద్ద అర కి.మీ.కు పైగా 20 ఎడుగుల ఎత్తులో పెద్దపెద్ద బండ రాళ్లతో నిర్మించిన భారీ కట్టడం ఆకట్టుకుంటోంది. దీనిపై నంది విగ్రహాలను ప్రతిష్ఠించడంతో నందుల కత్వ పేరుతో రికార్డుల్లో నేటికి ఉంది.

1908లో హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తిన వరదల్లో నందుల కత్వకు పడిన గండి ఆనవాళ్లు స్పష్టంగా ఇప్పటికీ కనిపిస్తుంటాయి.

కబ్జా కోరల్లో చిక్కి..

శంషాబాద్‌లో విమానాశ్రయం నిర్మించడంతో భూములకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక గ్రామాల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి నాలాను ధ్వంసం చేశారు.

నర్కూడ, ఊట్‌పల్లి తదితర గ్రామాల్లో పట్టా భూమిలో నాలా ఉందంటూ చదును చేశారు. రెవెన్యూ అధికారులు సదరు సదరు వ్యక్తులపై కేసు పెట్టారు.జూకల్ గ్రామంలో ఓ రియల్ వ్యాపారి సుమారు ఒక కి.మీ.కి పైగా నాలాను ధ్వంసం చేసి లేఅవుట్ వేసి ఆక్రమిస్తున్నారు.

షాబాద్ మండలంలో 12 కి.మీ.ల మేర ఉంటే ఆక్రమణకు గురైంది. జల్‌పల్లి, బలాపూర్‌లోనూ అనేక ప్రాంతాల్లో ఈ నాలా కనిపించడం లేదు. శంషాబాద్, తొండుపల్లి, సాతంరాయి తదితర గ్రామాల్లో పూర్తిగా కబ్జా కోరల్లో చిక్కుకుంది. శంషాబాద్‌లో మధురానగర్, ఆదర్శనగర్, ఆర్బీనగర్, మిషన్ కాంపౌండ్ ప్రాంతాల్లో వందల ఎకరాల్లో కాలనీలు వెలిశాయి. సుమారు రెండు కి.మీలకు పైగా నిర్మాణాలు జరిగాయి.

# పర్యావరణం మరింత బలోపేతం



పూడూరు: పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడం కోసం చేపట్టిన 'వన మహోత్సవం' (గతంలో హరిత హారం) పటిష్ఠ అమలుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా గతంలో నాటి పాడైన వాటి స్థానంలో మొక్కలు నాటేందుకు ఇటీవల 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే కార్యక్రమాన్ని తీసుకు వచ్చారు. అంతేకాదు ఈసారి లక్ష్యాలను అధిగమించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటడం చేస్తున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వటం, పూలు, పండ్ల జాతులు వృద్ధిచేసి అవసరమున్న వారికి అందజేస్తున్నారు.

ఆరు నెలల ముందునుంచే కార్యాచరణ

జిల్లా వ్యాప్తంగా ఈసారి 30 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. గ్రామాల్లో వన మహోత్సవం చేపట్టేందుకు అధికారులు ఆరు నెలల ముందు నుంచే కార్యాచరణ చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో నర్సరీల్లో మొక్కలు పెంచారు. ప్రస్తుతం సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. ఈసారి గ్రామ పంచాయతీకి ఐదు వేల వరకు మొక్కలు పెంపకం చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 566 నర్సరీలు జిల్లాలోని పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల పరిధిలో 566 నర్సరీలు ఏర్పాటుకాగా, పూడూరు మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో మొక్కలు పెంచారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటాల్సిన చోట గుంతలు తీయించే పనులు జరుగుతున్నా యి. వెంటనే మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లో అలోవేర, దానిమ్మ, కరివేపాకు, రెయిన్ ట్రీ, నీలగిరి, నిమ్మ, ఉసిరి, టేకు, మద్ది, గులాబీ, మందారం, జామ, మామిడి, సీతాఫలం, చింత, కానుగ వంటివి ఉన్నాయి. వీటితోపాటు కొందరు దూరపు ప్రాంతాలలో ప్రైవేటు నర్సరీల నుంచి ఖరీదైన మొక్కలు తెప్పించి నాటిస్తున్నారు. ఈ సందర్భంగా పూడూరు ఏపీఓ రాములుతో మాట్లాడుతూ.. ఇంకా విస్తారంగా నాటాల్సి ఉందన్నారు. పూడూరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఇప్పటివరకు 90 శాతం మేర మొక్కలు నాటామన్నారు. క్షేత్రసహాయకుల ఆధ్వర్యంలో కూలీలు గుంతలు తీస్తున్నారని, రహదారులతో పాటు ఎక్కడ ఖాళీ స్థలాలున్నా వారు మొక్కలు నాటేందుకు ప్రోత్సహిస్తామన్నారు.

# 'సమీకృతం' అసంపూర్ణం.. సమస్యలు నిత్యకృత్యం

వికారాబాద్ : జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ పురపాలికల్లో సమీకృత మార్కెట్ యార్డుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సకాలంలో పూర్తి కాకపోవటంతో రైతులు రోడ్ల పక్కనే కూరగాయలను విక్రయించాల్సి వస్తోంది. తాజాగా శిక్షణ కలెక్టర్ ఉమాహారతి సైతం వికారాబాద్ మార్కెట్ స్థితిగతులను మున్సిపల్ అధ్యక్షురాలు మంజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

వారం వారం సంతలు

జిల్లాలో వారానికి ఒక రోజు పట్టణాల్లో సంతలు నిర్వహిస్తారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలో సంత కొనసాగుతుంది. సాధారణంగా ప్రతి రోజు 120నుంచి 150 మంది వరకు రైతులు రైతు బజార్‌కు వచ్చి కూరగాయలు, తు కూరలు విక్రయిస్తారు. యార్డుల్లేక రైతుబజార్ ఎదురుగా ఉన్న రోడ్డుపైనే రైతులు కూర్చుని విక్రయిస్తున్నారు.

పరిగిలో నడిరోడ్డుపైనే విక్రయాలు

పరిగి పట్టణంలో రోడ్డు పక్కనే కూరగాయలను విక్రయిస్తున్నారు. ఇక్కడ సమీకృత విపణి నిర్మాణం కోసం రూ.4 కోట్ల అంచనాతో పనులు చేపట్టారు. ఇందుకు గాను 30 గుంటల భూమిని కేటాయించారు. ఈ పనులకు 2022 జూన్ 18న మాజీ మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. పిల్లర్ల వరకు పూర్తి చేశారు. పునాదిలో నాణ్యత లోపం కారణంగా బీటలు కనిపిస్తున్నాయి. కొడంగల్, తాండూరు పట్టణాల్లో విపణి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నిధులందక నిలిచిపోయాయి

ప్రజలందరికీ ఒకే చోట కూరగాయలు, మాంసం, చేపలు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం విపణి నిర్మాణాలను



చేపట్టింది. నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయినట్లు సమాచారం.

వికారాబాద్ పట్టణంలోని రైతు బజార్ పక్కన ఎకరన్నర స్థలంలో నిర్మాణాన్ని చేపట్టారు. ఇందుకు గాను రూ. 7కోట్ల20లక్షలు మంజూరు చేశారు. 2022 డిసెంబర్ నెలలో పనులు ప్రారంభించారు. పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 108 దుకాణాలుంటాయి, వీటిలో 60 కూరగాయలు, 30 మాంసం, 18 పూలు పండ్ల విక్రయాలకు కేటాయిస్తారు. కానీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

– జాకీర్ అహ్మద్, పుర కమిషనర్, వికారాబాద్.

వికారాబాద్ సమీకృత మార్కెట్ యార్డును ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారు. యార్డు నిర్మాణ పనులు పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## బుల్డోజర్లు హిమాయత్‌సాగర్ వైపు.. భారీ నిర్మాణాల జాబితాలో ప్రముఖుల ఫాంహౌస్‌లు!

హైదరాబాద్: బుల్డోజర్లు ఇక హిమాయత్‌సాగర్ వైపే సాగనున్నాయి. వారంలో జలాశయంలోని నిర్మాణాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. జలమండలి, రెవెన్యూ అధికారులు ఎఫ్‌టీఎల్ (పూర్తిస్థాయి నీటి మట్టం) పరిధిలో ఉన్న నిర్మాణాలను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. మొదటి దశలో కొందరు ప్రముఖుల ఫామ్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు ఇందులో ఉన్నట్టు తేలింది.

కాంగ్రెస్ నేతల వంతు: అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర పార్టీలు, ప్రముఖుల బంగ్లాలు అందులో ఉన్నాయి. వాటి నుంచి పది భారీ నిర్మాణాలను అధికారులు ఎంపిక చేశారు. అధికార పార్టీ ప్రస్తుత ఎమ్మెల్యే వ్యవసాయ క్షేత్రంతోపాటు ఇతర నేతల ఫామ్‌హౌస్‌లు తెరపైకి వచ్చాయి. ఆయా నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ హద్దు లోపల ఎంత వరకు ఉన్నాయి. బఫర్‌జోన్ లోపల, వెలుపల ఎంత మేర ఉన్నాయనే వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని హైడ్రా కార్యాలయం జలమండలి, రెవెన్యూ అధికారులను ఆదేశించింది. వచ్చే సోమవారానికి నివేదికను పూర్తి చేస్తామని అధికారులు హైడ్రాకు నివేదించారు.



జలాశయాల రక్షణ లక్ష్యం

ఈ నెల 11న గండిపేట జలాశయంలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వ్యాపార వేత్తల ఫామ్‌హౌస్‌లు, హోటళ్లు, క్రీడా ప్రాంగణాలను నేలమట్టం చేశారు. అనంతరం నగరంలోని తమ్మిడికుంటలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చింది. ఈర్లకుంట, చింతల్‌చెరువు, తదితర తటాకాల్లోని ఆక్రమణలను తొలగించారు. ఇప్పుడు హిమాయత్‌సాగర్ ఆక్రమణలపైనా దృష్టిపెట్టారు. మొదటి దశలో ఎఫ్‌టీఎల్‌లోని పెద్ద బంగ్లాలను కూల్చుతామని, అనంతరం బఫర్‌జోన్‌లోని కట్టడాలను నేలమట్టం చేస్తామంటున్నారు. జలమండలితోపాటు ఇతర శాఖ అధికారులు క్షేత్రస్థాయి సమాచారంతోపాటు గూగుల్ మ్యాప్‌లతో అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నారు.

## విద్యుత్తు నియంత్రికలు ఢాం

సిరిసిల్ల : మొన్నటి వరకు ఎండా కాలం వల్ల విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది. ప్రస్తుత వానాకాలంలో సరైన వర్షాలు లేకపోవడం వల్ల సాగునీటి కోసం అన్నదాతలు వ్యవసాయ కరెంటు మోటార్లను నిరంతరాయంగా నడుపుతున్నారు. ఫలితంగా విద్యుత్తు నియంత్రికలపై అధికభారం పడుతుండటంతో తరచూ కాలిపోతున్నాయి. దీంతో వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాటి మరమ్మతులు, కొత్త వాటిని అమర్చడంలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్)పై ఆర్థికభారం పడుతోంది. కాలం చెల్లినవి ఓవర్‌లోడ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. జిల్లాలో సెస్ పరిధిలో వివిధ రకాల సర్వీసు కనెక్షన్లకు విద్యుత్తు అందించడానికి మొత్తం 10,508 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు 449 పైగా టాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిని పూర్తిగా మరమ్మతు చేయడానికి



ఒక్కో దానికి సుమారు రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది. నియంత్రికలో కాలిపోయిన భాగాలను బట్టి మరమ్మతు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో కనెక్షన్లను బట్టి లోడ్‌ను అంచనా వేసి నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా, ఓవర్‌లోడ్ కాకుండా అదనపు నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అక్రమ కనెక్షన్లను గుర్తించి వాటిని క్రమబద్ధీకరిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో జూన్ నుంచి ఆగస్టు వరకు సుమారు 60 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. ప్రస్తుతం సాగునీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో రైతులు ఆటో స్టార్టర్లను ఉపయోగించడం వల్ల ఒక్కసారిగా విద్యుత్తు నియంత్రికలపై భారం పడుతుంది. అలాగే నాణ్యత లేని కరెంటు మోటార్ల వల్ల కూడా కాలిపోతున్నాయి. కారణాలు ఇవీ...నాణ్యత లేని మోటార్లను వాడటం వల్ల ఎక్కువ ఆమ్స్ విద్యుత్తును తీసుకుంటున్నాయి. నియంత్రికల్లో ఎల్‌టీ బుష్‌లు కరిగిపోవడం, హెచ్‌టీ లింకులు విరిగిపోవడం, ఆయిల్ తగ్గిపోవడం, ఫ్యూజులు పోవడం వంటి సాంకేతిక సమస్యలు తలెత్తుతూ ఏకంగా కాలిపోతున్నాయి.

గాలితో కూడిన వర్షాలకు విద్యుత్తు తీగలు ఒకదానికొకటి రాసుకోవడం, పిడుగుపాటు ప్రభావం కూడా వీటిపై పడుతోంది. చాలా చోట్ల ఏళ్ల కింద అమర్చినవి అధిక భారాన్ని తట్టుకోలేకపోతున్నాయి.

రైతులు వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడంతోపాటు ఆటో స్టార్టర్లను వినియోగించుకోకుంటే విద్యుత్తు నియంత్రికల జీవితకాలం పెరుగుతుందని సెస్ అధికారులు చెబుతున్నారు.

మరమ్మతులు నిరంతర ప్రక్రియ

సెస్ పరిధిలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. వినియోగదారులు సెస్‌కు చెల్లించాల్సిన బిల్లులను సకాలంలో చెల్లించాలి. విద్యుత్తు మరమ్మతులు రోజూ కొనసాగుతూనే ఉంటాయి. ఇది నిరంతర ప్రక్రియ. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వదులు తీగలను సరిచేశాం. వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు ఉంటే సెస్ సిబ్బందిని సంప్రదించాలి. – శ్రీనివాసరెడ్డి, సెస్ ఎండీ

# కడ'గండ్లు మిగిలాయ్'..

అశ్వారావుపేట : భారీ వర్షాలకు అశ్వారావుపేట మండలం చిగురుటాకులా వణికింది. పెద్దవాగు ప్రాజెక్టుకు గండ్లు పడటంతో ముంపు ప్రాంతాల వాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జాగారం చేశారు. ఓవైపు చిమ్మచీకట్లు, మరోవైపు జలప్రళయంతో ఎవరిని కదిపినా తొలుత కన్నీళ్లే సమాధానమిస్తున్నాయి.

**ఆనవాళ్లు కోల్పోయిన పెద్దవాగు ప్రాజెక్టు**

ఇన్నాళ్లూ వరప్రదాయినిగా పేరుగాంచిన పెద్దవాగు ప్రాజెక్టు.. ఇప్పుడు అన్నదాతలకు తీరని శోకం మిగిల్చింది. ప్రాజెక్టుకు ఉన్న మూడు గేట్లలో రెండింటిని ఎత్తి నీటిని విడుదల చేయగా మరో గేటు ఎత్తే క్రమంలో మొరాయించింది. ఎగువ ప్రాంతంలో నారాయణపురం–బచ్చువారిగూడెం మధ్య సుమారు మూడు కిలోమీటర్ల మేర నిలిచిన వరదనీరు నదిని తలపించింది. పైనుంచి వరద నీరు చేరటంతో ఒత్తిడి పెరిగి పెద్దవాగు ప్రాజెక్టు కట్టకు గండ్లు పడ్డాయి. ప్రాజెక్టు దిగువ భాగం.. రాళ్ల గుట్టను తలపిస్తోంది. కట్ట నుంచి కుడికాల్వ పునాది వరకు ఆనవాళ్లు కనిపించకుండా పోయింది. ఈప్రాంతం ప్రమాదకరంగా మారటంతో కట్టపైకి ఎవరూ వెళ్లకుండా పోలీసులు ముళ్ల కంచె వేశారు. గుమ్మడవల్లి నుంచి ప్రాజెక్టుకు వెళ్లే మార్గం ఛిద్రమైంది. వేలేరుపాడు మార్గంలో నారాయణపురం– బచ్చువారిగూడెం మధ్య రెండు కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోయింది. సుమారు 25 చోట్ల ప్రాజెక్టుకు గండ్లు పడటంతో ఆయకట్టు భూముల్లో ఇసుక మేటలు, రాళ్ల కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ భూములను మళ్లీ సాగుచేయాలంటే ఎకరాకు కనీసం రూ.50 వేల నుంచి రూ.లక్ష ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్వారావుపేట వెంకమ్మ చెరువు ప్రధాన కాల్వకు అయిదు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. సుమారు 150 ఎకరాల్లో వేసిన వరి నాట్లు కొట్టుకుపోయాయి.



**నష్టం అంచనా రూ.190 కోట్లు!**

పెద్దవాగు ప్రాజెక్టు వద్ద గండ్ల పూడ్చివేత, రింగ్ బండ్, కుడికాల్వ తూముల పునరుద్ధరణ, క్రస్ట్‌గేట్ల మరమ్మతులు తదితరాలకు సుమారు రూ.150కోట్లు ఖర్చవుతాయని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. నారాయణపురం– గాండ్లగూడెం, కావడిగుండ్ల– గోపన్నగూడెం నడుమ వంతెనలు దెబ్బతిన్నాయి. రోడ్డు రక్షణకు ఏర్పాటు చేసిన గోడ కొట్టుకుపోయింది.నారాయణపురం–బచ్చువారిగూడెం, గాండ్లగూడెం– నారాయణపురం, మల్లాయిగూడెం– దబ్బతోగు, గోపన్నగూడెం– కన్నాయిగూడెం, కొత్తకన్నాయిగూడెం– గోగులపూడి మధ్య రహదారులు ఛిద్రమయ్యాయి. మొత్తమ్మీద ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.35కోట్లకు పైగా నష్టం సంభవించిందని సమాచారం. ఐటీడీఏ రహదారుల మరమ్మతులకు సుమారు రూ.15లక్షలు వెచ్చించాల్సి వస్తుందని తెలుస్తోంది. సుమారు 350 విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. పది నియంత్రికలు నేలమట్టమయ్యాయి. విద్యుత్తు సంస్థకు సుమారు రూ. 4కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు భావిస్తున్నారు.

**21న కేంద్ర బృందం రాక**

పెద్దవాగు ప్రాజెక్టును పరిశీలించేందుకు జాతీయ ప్రాజెక్టుల భద్రత అధికారుల బృందం గుమ్మడవల్లికి ఆదివారం రానున్నట్లు సమాచారం.

పెద్దవాగు కింద కట్ట సమీపంలో ఏర్పాటుచేసిన దొడ్డిలో మేకలు, గొర్రెలు ఉంచాను. రాత్రిపూట అకస్మాత్తుగా వరద వచ్చి దొడ్డిపై పడటంతో పది గొర్రెలు, పది మేకలు మృతిచెందాయి. మరో పది జీవాలు వరదల్లో కొట్టుకుపోయాయి. ఒడ్డుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కొన్ని మాత్రమే ఒడ్డుకు చేరాయి. రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. మా గ్రామంలో పది మంది రైతుల పశువులు, గొర్రెలు, మేకలు కొట్టుకుపోయాయి. సాధనం రామకృష్ణ, కోయరంగాపురంమాకు ఉన్నదే రెండెకరాలు. వరి సాగుచేశాం. వరదకు పొలమంతా ఇసుక మేటలు వేశాయి. ఇసుకను తొలగించాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఏమి చేయాలో పాలుపోవటం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.సాయిల అన్నపూర్ణ, గుమ్మడవల్లి

# సౌరశక్తితో ఆదాయం

భువనగిరి : కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత సౌర విద్యుత్తు అందించడమే లక్ష్యంగా 'ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ' పథకానికి శ్రీకారం చుట్టింది. సామాన్య పౌరుడిపై విద్యుత్తు భారం, వాతావరణ కాలుష్యం తగ్గించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించింది. ఇందుకోసం పెద్ద ఎత్తున రాయితీ సైతం కల్పిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల కాలపరిమితితో విద్యుత్తు ఛార్జీల నుంచి ఉపశమనం పొందవచ్చు. వినియోగానికి మించి విద్యుత్తు ఉత్పత్తి జరిగితే నెట్ మీటరింగ్ విధానంలో విద్యుత్తు శాఖ ఒక్కో యూనిట్‌కు రూ.4.17 చెల్లించి కొనుగోలు చేస్తుందని, ఆదాయం పెంపొందించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

**రాయితీ ఇలా..**యూనిట్‌కు అయ్యే ఖర్చు లబ్ధిదారులే చెల్లించాలి. దీని కింద అందించే రాయితీ నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని, బ్యాంకుల నుంచి భారీ రాయితీలు, రుణాలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు కిలోవాట్ (నెలకు 120



యూనిట్ల వినియోగం) విద్యుత్తు పొందాలనుకునే వినియోగదారులు రూ.55 వేలు చెల్లిస్తే రూ.30 వేల రాయితీ, 2 కిలోవాట్లకు రూ.లక్ష చెల్లిస్తే రూ.60 వేల రాయితీ, 3 కిలోవాట్లకు రూ.1.40లక్షలకు గానూ రూ.78 వేల రాయితీ అందుతాయి.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఇలా..**ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో %http:///// www.pmsuryaghar.gov.i n% లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ–మెయిల్ ఐడీ, విద్యుత్తు కనెక్షన్, చరవాణి నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయాలి. సర్వీస్ నెంబరు, మొబైల్ నంబరుతో లాగిన్ అయి రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఉపయోగించిన విద్యుత్తు వివరాలు నమోదు చేయాలి. విద్యుత్తు శాఖ అధికారులు వినియోగదారుడి చిరునామాకు వచ్చి అన్ని వివరాలు పరిశీలిస్తారు. అనంతరం గుత్తేదారుకు ఈ వివరాలు అందిస్తారు. నిర్ణీత రుసుం చెల్లిస్తే గుత్తేదారు సౌర పలకలు, ప్యానల్ బోర్డులు బిగిస్తారు. విద్యుత్తు కార్యాలయంలో దరఖాస్తు చేసిన తర్వాత నెట్ మీటరింగ్ బిగిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తదనంతరం రాయితీ సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.

# శాతవాహనలో అక్రమాల నిగ్గు తేల్చండి



కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే వేదిక. అందులో చదువుకున్న వారు వివిధ హోదాల్లో ఉన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా వర్సిటీలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పలు సందర్భాల్లో ఆరోపించారు. అందులో ఏం జరిగినా బయటకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతున్నారని తెలిపారు. చివరకు వారు కొంతకాలంగా తెలంగాణ స్టేట్ విజిలెన్స్ కమిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేస్తూ వస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు ఎంతవరకు నిజమో తెలుసుకోవడానికి ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను విచారణకు ఆదేశించింది. సంబంధిత అధికారులు త్వరలో విచారణ చేయనున్నారు.

సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ఫిర్యాదు అంశాలు ఇలా..

ఎస్‌యూలో కొందరు ఉన్నతాధికారులు అక్రమార్జనే ధ్యేయంగా పాలన కొనసాగించారు. పాలకుల పైరవీలు, సిఫార్సులతో యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టారు. కనీస అర్హత లేకపోయినా నచ్చిన వారిని ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించారు.

నకిలీ ఐడీ కార్డు వేసుకొని ఓ వ్యక్తి యూనివర్శిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వసూళ్లకు తెగబడ్డారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా మిన్నకుండిపోయారు.

రెగ్యులర్ కోర్సులుగా నడుస్తున్న నాలుగు డిపార్ట్‌మెంట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా చూపి యూజీసీ–12బి గుర్తింపు కోసం తప్పుడు నివేదికను సమర్పించి, జాతీయ సంస్థను మోసం చేశారు.

విశ్వవిద్యాలయ వాహనాల కొనుగోలు, యాక్సిడెంట్ల ఖర్చుల మీద, చలాన్ల పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారు.

అర్హత లేని విశ్రాంత అసిస్టెంట్ ట్రెజరీ అధికారిని డిప్యూటీ ట్రెజరీ అధికారిగా పత్రాల్లో చూపి శాతవాహన ఫైనాన్స్ అధికారిగా కొనసాగించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఎస్‌యూలో లేకపోయినా గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధి బంధువు, విశ్రాంత ఆచార్యుడిని నియమించారు.

పరిపాలన భవనం మొదటి అంతస్తు నిర్మాణంలో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించక విశ్వవిద్యాలయం నిధులు కోట్లల్లో కొల్లగొట్టారు. పరీక్ష పేపర్ లీకేజీలు, టెండర్ లేకుండానే పరీక్ష జవాబు పత్రాల స్కానింగ్ ప్రక్రియపై ఓ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.

పరీక్షల విభాగంలో ఓ అధికారి 2015 నుంచి తిష్ఠ వేయగా అతనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యతల నుంచి తొలగించాలి.

గత ఉపకులపతి రెసిడెన్స్ నిర్వహణ, హాస్పిటాలిటీ, ఖర్చులు ఇబ్బడి ముబ్బడిగా చేశారు.

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలపై తీసుకొచ్చిన కొత్త జీవో 1222లో అవకతవకలు జరిగాయి.

బోధనేతర సిబ్బందికి పీఎఫ్ డబ్బులను ఖాతాలో జమ చేయకుండా ఫైనాన్స్ అధికారి, రిజిస్ట్రార్ వద్దనే అంటిపెట్టుకున్నారు. బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీల టెండర్లపై సమగ్ర విచారణ చేయాలి.

గత 2021-22, 2022-23 సంవత్సరంలో జరిగిన ఆడిట్ నివేదికలపై సమగ్ర విచారణ చేపట్టాలి.

ఇతర శాఖలతో కలిసి ముందుకు..

శాతవాహన విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలనే ఉత్తర్వులు గురువారం జిల్లా కార్యాలయానికి అందాయి. ఆరోపణలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇతర శాఖల అధికారుల సహకారం తీసుకొని విచారణ కొనసాగిస్తాం. ఎస్‌యూలో జరిగిన అవకతవకలపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారమున్నా మమ్మల్ని సంప్రదించవచ్చు. విచారణ పారదర్శకంగా జరిపి హైదరాబాద్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.అనిల్‌కుమార్, విచారణ అధికారి,విజిలెన్స్ విభాగం, కరీంనగర్

# పరిసరాల పరిశుభ్రత పాఠాలకే పరిమితం!



సత్తుపల్లి : సత్తుపల్లి పాత సెంటర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులు, మరో తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో స్కావెంజర్ లేకపోవడం, మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ శుభ్రం చేయటానికి మున్సిపల్ కార్మికులు రాకపోవడంతో ఉపాధ్యాయులే తలాకొంత వేసుకుని ఓ కార్మికురాలితో పనులు చేయించుకుంటున్నారు.

పెనుబల్లి మండలం వీఎం బంజర హైస్కూల్లో స్కావెంజర్ లేరు. పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి. కానీ పంచాయతీ కార్మికులు రావటం లేదు. దాదాపు 380 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. స్కావెంజర్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సర్కారు బడుల్లో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రైవేటుకు దీటుగా డిజిటల్ తరగతులు, పౌష్టికాహారం, ఏకరూప దుస్తులు, అభ్యసన సామగ్రి అందిస్తోంది. మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాయి. అంతవరకు బాగానే ఉన్నా పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించకపోవడంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఆవరణ అధ్వానంగా మారుతుండగా శౌచాలయాలు కంపు కొడుతున్నాయి. పరిసరాల పరిశుభ్రత పాఠాల వరకే పరిమితమవుతోంది.

**కొవిడ్ తర్వాత స్కావెంజర్ల రద్దు**

కొవిడ్‌కు ముందు అన్ని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించగా ఆవరణ, తరగతి గదులను శుభ్రం చేస్తూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేవారు. కొవిడ్ కాలం తర్వాత స్కావెంజర్ల వ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బందితో పాఠశాలలను శుభ్రపరచుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఎక్కడా స్కావెంజర్లను నియమించలేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడం, ఉన్నచోట తరగతుల ప్రారంభమైన తర్వాత వస్తుండడంతో పెద్దగా ప్రయోజనం నెరవేరటం లేదు. ఎక్కువ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది.

**అపరిశుభ్ర వాతావరణంతో గగ్గోలు**

అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఊడ్చేందుకు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది లేకపోవడంతో ఆవరణల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోయింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నారు. అసలే వర్షాకాలం.. మున్ముందు ఇదే తంతు కొనసాగితే చాలామంది విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముంది.

మండల స్థాయిలో ఎంపీడీఓలు పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులతో, పట్టణ స్థాయిలో పురపాలిక పారిశుద్ధ్య సిబ్బందితో ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేయించుకోవాలి. వారితోనే పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రపర్చుకోవాలని ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్కావెంజర్లను ఏర్పాటుచేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వెంకటేశ్వరచారి, డీఈఓ, భద్రాద్రి కొత్తగూడెం

# రుణమాఫీ సమస్యలకు పరిష్కార విభాగం

ఖమ్మం : పంట రుణమాఫీపై రైతుల సందేహాలు, ఇబ్బందులు పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా 'పరిష్కార విభాగాన్ని' ఏర్పాటు చేసినట్లు డీఏఓ విజయనిర్మల తెలిపారు. రైతులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నం.1950 లేదా 90632 11298ను సంప్రదించాలని సూచించారు. మండల స్థాయిలో ఏఓలు, క్లస్టర్ పరిధిలోని ఏఈఓల ద్వారా కూడా తెలియజేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన పరిష్కార విభాగానికి సంబంధించి పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు టోల్‌ఫ్రీ నంబర్ల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

బదిలీలకు తాత్కాలిక బ్రేక్?

రైతు రుణమాఫీ నేపథ్యంలో వ్యవసాయశాఖలో బదిలీలకు తాత్కాలిక బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. మరోపక్క బదిలీల ప్రక్రియ పూర్తిచేసేందుకు ఈ నెల 20 వరకు గడువుంది. ఇప్పటివరకు చేపట్టకపోవటంతో వాయిదాపడే అవకాశం ఉందని ఉద్యోగులు భావిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అయిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారులు, ఉద్యోగులు సుమారు 90శాతం ఉన్నారు. వానాకాలంలో రైతులకు ఎరువులందేలా చర్యలు తీసుకోవాలి. కీలక సమయంలో బదిలీలతో ఇబ్బందులుంటాయనే ఉద్దేశంతో తాత్కాలిక విరామమివ్వాలని నిర్ణయించినట్టు సమాచారం.

# జీవనశైలి మార్పు.. దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు

భువనగిరి : జీవనశైలి మారడంతో మూడు పదుల వయస్సు వారు సైతం మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. వ్యాధిగ్రస్థులను గుర్తించి ఔషధాలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ (సంక్రమించని వ్యాధులు) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా ఎన్‌సీడీ ద్వారా పరీక్షలు చేస్తూ దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు(బీపీ), మధుమేహం గుర్తిస్తోంది. నోటి క్యాన్సర్, గైనిక్ సంబంధించి క్యాన్సర్ల అనుమానిత లక్షణాలున్నవారికి నిర్ధారణకు జిల్లా కేంద్రాసుపత్రి, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. బీపీ, షుగర్‌తో బాధపడేవారికి ఔషధాలు అందజేస్తూ జబ్బు తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**రక్తపోటు, మధుమేహం బాధితులే ఎక్కువ**

రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య వేగంగా పెరుగుతుందని పలు సర్వేలతో పాటు, ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తుండగా జిల్లాలో



కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పరీక్షల్లో 50 వేల మందికి పైగా రక్తపోటుతో బాధపడుతున్న నిర్ధారణ అయ్యింది. 25 వేల మందికిపైగా మధుమేహ బాధితులు ఉన్నట్లు తేలింది. బీపీకి సంబంధించి నాలుగు రకాల మాత్రలు, షుగర్‌కు సంబంధించి మూడు రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి. వ్యక్తుల వ్యాధి తీవ్రతను బట్టి పీహెచ్‌సీ వైద్యుడు మాత్రలు ఇస్తున్నారు. క్యాన్సర్ అనుమాన లక్షణాలు గుర్తించినట్లయితే స్క్రీనింగ్ కోసం జిల్లా కేంద్రాసుపత్రులకు పంపిస్తున్నారు.

**పెరుగుతున్న వ్యాధి బాధితులు**

జిల్లాలో ఇప్పటి వరకు 3,87,852 మందికి పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు బయటపడ్డ వారి వివరాలు వెబ్‌పోర్టల్ నమోదు చేస్తూ ఎన్‌సీడీ కార్డు అందజేస్తున్నారు. ఆ కార్డులో రోగి పేరు, వ్యాధికి ఇస్తున్న ఔషధాల వివరాలు పొందుపరుస్తున్నారు. పీహెచ్‌సీల పరిధిలో ఆశా, ఏఎన్‌ఎమ్‌ల ద్వారా నెలనెలా ఔషధాలు అందజేస్తున్నారు.

జిల్లా కేంద్రాసుపత్రిలో ఎన్‌సీడీ శిబిరం ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది.

దీర్ఘకాలిక జబ్బులు తీవ్రం కాకుండా గుర్తిస్తున్నాం

సుమన్ కళ్యాణ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్

ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తిస్తున్నాం. నెలనెలా పరీక్షలు చేస్తూ ఔషధాలు అందజేస్తున్నాం. దీర్ఘకాలిక రోగాలు తీవ్రం కాకుండా అన్నీ పీహెచ్‌సీల పరిధిలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కావాల్సిన చికిత్సలు సైతం అందజేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులు నిర్ధారణ అయినవారు వైద్యుల సూచనలు లేకుండా ఔషధాలు ఆపివేయొద్దు.

# నల్లమట్టి కొల్లగొట్టె..!

మిర్యాలగూడ :గుర్రంపోడు మండలంలోని చేపూరు, మొసంగి పాల్వాయి చెరువుల నుంచి మట్టిని తరలిస్తున్నట్లు చాలాకాలంగా ఆరోపణలు వస్తున్నాయి. చెరువుల్లోని సారవంతమైన నల్లమట్టిని పొలాలకు తరలించి నాణ్యమైన దిగుబడిని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గండిపడుతోంది. గతంలో మిషన్ కాకతీయ పేరిట ఆయా గ్రామాల్లో చెరువు మట్టిని రైతులు తమ పంట పొలాల్లో పోసుకోవడానికి అవకాశం ఉండేది. అయితే కొంతమంది చెరువుల్లో నల్లమట్టి పూడికతీత పేరిట అనుమతులు తీసుకుని డంపింగ్ చేసి ఇటుక బట్టీలకు వేలాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. ఈ దందాకు అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన చర్యలు జాకబ్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, మైనింగ్‌శాఖఅక్రమాలను నియంత్రించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు వేసిన కమిటీలో కలెక్టర్, ఆర్డీవో, పుర కమిషనర్, ఇతర జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి కమిటీలో ఎంపీడీవో, తహసీల్దారు, సీఐ, ఎస్సై, ఏఈ తదితర మండల స్థాయి అధికారులకు పర్యవేక్షణ అధికారాలున్నాయి. మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే టన్ను మట్టికి రూ.440 జరిమానాతో పాటు వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతాం.

అనుమతులు ఇలా..చెరువుల నుంచి ఇటుకల బట్టీలకు తరలించడానికి టన్ను మట్టికి రూ.43 చొప్పున చెల్లించాల్సి ఉంది. ఇందుకు వినియోగించే జేసీబీకి, టిప్పర్‌కు ముందస్తుగా అనుమతి పత్రాలు మైనింగ్‌శాఖ నుంచి పొందాల్సి ఉంటుంది. అధికారుల అంచనా ప్రకారం ఒక టిప్పర్‌లో సుమారు 15 నుంచి 20 టన్నుల చెరువు మట్టి తరలించవచ్చు. సెలవు దినాలలో సాయంత్రం ఆరు గంటల తర్వాత మట్టి రవాణాకు అనుమతి లేదు.

38 చెరువులకే..పూడికతీసి మట్టిని తరలించడానికి జిల్లాలో 38 చెరువులకు అనుమతులు ఇచ్చినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. నిడమనూరు, గుర్రంపోడు, దేవరకొండ, మిర్యాలగూడ, మాడ్గులపల్లి, వేములపల్లి, దామరచర్ల, కనగల్, చింతపల్లి, నాంపల్లి మండలాల్లో చెరువుల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు తీసుకున్నారు. వీరికి ఇటుక బట్టీలకు తరలించడానికి నిబంధనలతో కూడిన అనుమతి జిల్లా మైనింగ్ శాఖ ఇస్తుంది.

# వైద్యారోగ్యం.. పర్యాటకం

హైదరాబాద్: అంతర్జాతీయ వైద్య ప్రమాణాలు, పర్యాటక ప్రాంతాల విశిష్టతలు ఒకే ప్రాంతంలో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో హెల్త్ టూరిజం హబ్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ, ఐటీ, పరిశ్రమలు, వైద్యారోగ్యశాఖల అధికారులు హెల్త్‌టూరిజం హబ్‌ను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి 20 కిలోమీటర్ల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సేకరిస్తున్నారు. ఒకేచోట 500 నుంచి 1000 ఎకరాల భూములుంటే బాగుంటుందన్న ఆలోచనతో అధికారులున్నారు. షాబాద్.. శంషాబాద్.. మహేశ్వరం.. హెల్త్ టూరిజం హబ్ కోసం షాబాద్, శంషాబాద్, మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలిస్తున్నారు. షాబాద్ మండలంలో చందనవెల్లిలో ఇప్పటికే ఐటీ, పరిశ్రమలుండటం, శంషాబాద్‌లో బహుళ అంతస్థుల భవనాలు, పట్టణ అటవీ పార్కులు, ఎకోటూరిజం పార్కు ఉండటం, మహేశ్వరంలోని తుక్కుగూడ సమీపంలో ఐటీ పరిశ్రమలు ఇప్పుడిప్పుడే వస్తుండటం, కందుకూరు మండలంలో ఫార్మాసిటీ కోసం భూములు సేకరించడం వంటి అంశాలను ఐటీ, పరిశ్రమల అధికారులు పరిశీలిస్తున్నారు.

# చంద్రన్న బీమా.. కార్మికులకు ధీమా

చిత్తూరు : తెదేపా కూటమి ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచింది. చంద్రన్న బీమా కింద వారి కుటుంబాలకు భరోసానిచ్చింది. పేద అసంఘటిత రంగ కార్మికుల కుటుంబాలకు భద్రత కల్పిస్తూ ఇది వరకు ఉన్న బీమా మొత్తాన్ని ఏకంగా రూ.10 లక్షలకు పెంచింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
ఈ పథకంలో నమోదు చేసుకున్న వారికి ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత వైకల్యంతో బాధపడుతున్నా రూ.10 లక్షలు లబ్ధిదారుడి కుటుంబానికి అందిస్తారు. వైకల్యాన్ని బట్టి రూ.1.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ బీమా అందుతుంది. 15 రోజుల లోగా లబ్ధిదారుల కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలోకి నగదు జమ చేయనున్నారు. ఈ పథకంలో జిల్లాలో 1.5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, 4 లక్షల మంది ఇతర కార్మికులు, మొత్తం 5.5 లక్షల కార్మిక కుటుంబాలకు చంద్రన్న బీమా కింద భరోసా లభించనుంది.
అవసరమైన ధ్రువపత్రాలు..
సహజ మరణమైతే క్లెయిమ్ ఫామ్, మరణ ధ్రువపత్రం, ఆధార్, నామినీ ఆధార్ కార్డు, నామినీ బ్యాంకు పాసు పుస్తకం.
ప్రమాదవశాత్తూ మరణిస్తే వీటికి అదనంగా ఎఫ్ఐఆర్, కంప్లైంట్



కాపీ, శవ పంచనామా రిపోర్ట్, పోస్టుమార్టమ్ రిపోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్.
వర్తింపు ఇలా..18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకూ ప్రమాదవశాత్తూ మరణ, శాశ్వత వైకల్యం ఉంటే రూ.10 లక్షలు, 51 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకూ ప్రమాదవశాత్తూ మరణం, శాశ్వత వైకల్యం ఉంటే రూ.3 లక్షల బీమా ఇస్తారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వరకూ సహజ మరణ అయితే రూ.2 లక్షలు బీమా, 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకూ ప్రమాదం కారణంగా పాక్షిక, శాశ్వత వైకల్యం వస్తే రూ.1.5 లక్షల బీమా వర్తిస్తుంది. తక్షణ సాయం కింద రూ.10 వేలు..బీమా మొత్తాన్ని మంజూరు చేయడంతో పాటు తక్షణ సాయం కింద రూ.10 వేలు అందిస్తారు. లబ్ధిదారులు ఏటా రూ.15 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం గుర్తింపు కార్డు అందిస్తుంది. అందులో ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్య పాలసీ సంఖ్య ఉంటుంది. క్లెయిమ్ మొత్తం ప్రత్యక్ష బ్యాంకుకు బదిలీ పద్ధతి ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. లబ్ధిదారుడు ఏదైనా సమస్య ఎదుర్కొంటుంటే బీమా నమోదు, క్లెయిమ్ చెల్లించేందుకు సంబంధించిన ఫిర్యాదు కోసం పీడీ డీఆర్డీఏను సంప్రదించాలి.

# మత్స్యకారుల కల.. నెరవేరే వేళ



అచ్యుతాపురం : పూడిమడక మత్స్యకారుల దశాబ్దాల కల నెరవేరే రోజు వచ్చింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు ఊరించిన ప్రాజెక్టు కూటమి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబునాయుడు చొరవతో పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. ఈ నెల 30న ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు చేపట్టారు. ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులుచేసి దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు.
గ్రామంలో నివాసం ఉండేవారిలో 90 శాతం సముద్రాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు. తెల్లారితే పడవలు, వలలతో కుస్తీపడుతూ గంగమ్మతల్లిని నమ్ముకొని జీవిస్తున్నారు. హార్బర్ లేకపోవడంతో పడవలు మోయలేక, వలలు దాచుకోలేక, ఇంజిన్లు భద్రపరచలేక నిత్యం ఉపాధికి కష్టాలు పడుతున్నారు. చివరికి ఒడిశా, కాకినాడ, చెన్నై వంటి తీర ప్రాంతాలకు ప్రతి ఏడాది మత్స్యకారులు అధిక సంఖ్యలో వేటకు వెళ్తున్నారు. వీరి ఉపాధి ప్రయాణంలో చాలామంది ప్రమాదాలకు గురై, సముద్రంలో గల్లంతై విగతజీవులవుతున్నారు. కుటుంబాలను విడిచి వెళ్లలేక, స్థానికంగా ఉపాధి పొందలేక వీరు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. వైకాపా ప్రభుత్వం రూ. 387 కోట్లతో మినీఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నామని హడావుడి చేసింది. ఐదేళ్ల పాటు ఊరించి మోసం చేసింది. వైకాపా ప్రభుత్వం చేసిన డిజైనింగ్ లోపాలను సరిచేయడానికి బెంగళూరుకు చెందిన సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీఐసీఈఎఫ్) డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ బెల్లియప్ప, రాష్ట్ర మెరైన్ జాయింట్ డైరెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఏపీ మారిటైన్ బోర్డు సీటీఓ శివశంకర్ ఈనెల 20న పూడిమడక వచ్చారు. ప్రాజెక్టు స్థలాన్ని, మ్యాపులను పరిశీలించారు. ప్రాజెక్టును నిశితంగా పరిశీలించిన నిపుణుల బృందం ప్రభుత్వ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని మార్పులు సూచిస్తూ ప్రభుత్వానికి నివేదిక అందించింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు.
అనుబంధంగా పరిశ్రమలు హార్బర్ నిర్మాణంతో పూడిమడక దశ మారనుంది.
చేపల వేటపరంగా తిరుగులేని చరిత్ర ఉన్న పూడిమడకకు మరింత అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడనుంది. హార్బర్‌కు అనుబంధంగా ఐస్ ప్లాంట్లు, శీతల గిడ్డంగులు, చేపలతో తయారు చేసే ఆహారపదార్థాల తయారీ పరిశ్రమలు, ఎండు చేపల వ్యాపారం, రవాణా ఇలా పలు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. హార్బర్ వల్ల మత్స్యకార యువత, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. పూడిమడ కతోపాటు పరవాడ, రాంబిల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల వరకు ఉన్న లక్షలాది మంది మత్స్యకారులు ఈహార్బర్‌ను ఉపయోగించుకొని ఉపాధి పొందనున్నారు. హార్బర్ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల ఉపాధికి భరోసా కలిగినట్లే!

# కుటుంబంలో కుట్రలు.. ఏవీ విలువలు!

పాడేరు : మానవతా విలువలు మరిచి కుటుంబసభ్యులే హత్యలకు పాల్పడుతున్నారు. రక్త సంబంధీకులే కాలయముల్లా మారుతున్నారు. నైతిక విలువలను మంటకలుపుతూ విచక్షణ కోల్పోయి ప్రాణాలు తీస్తున్నారు. క్షణికావేశంలో తమ వారనేది కూడా ఆలోచించకుండా హతమారుస్తున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వివాహేతర సంబంధాలు, ఆస్తి తగాదాలతో దాడులకు తెగబడుతున్నారు. ఇటీవల జరిగిన దారుణ ఘటనలివి..మాకవరపాలెం మండలం తాడపాలెం గ్రామంలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న ఆస్తి తగాదాను పరిష్కరించడానికి వెళ్లిన సొంత బాబాయినే అన్న కుమారుడు గొడ్డలితో హత్య చేశాడు.
చోడవరం మండలం అడ్డూరులో భార్యను కాపురానికి పంపడం లేదన్న కోపంతో అల్లుడు అత్తను హత్యచేసి అక్కడే చాలాసేపు ఉండి మామ వచ్చాక అతనిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చిన ఆసుపత్రిలో చేర్చాడు.
ఎలమంచిలిలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న జ్యూయలరీ దుకాణం వివాదం ఏకంగా ఒకరి హత్యకు దారి తీసింది.
మాడుగుల మండలం ఎం.కోటపాడులో కన్న కుమారుడే తండ్రితో పాటు తోడబుట్టిన తమ్ముడిని హతమార్చాడు. ఆస్తి పంపకాలు చేయమని అడిగినందుకు పన్నాగం పన్ని అయిదుగురి సాయం తీసుకుని ఇద్దరిని హతమార్చాడు.
బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెంలో భార్య వివాహేతర సంబంధం కళ్లారా చూసిన భర్త దాడి చేయడంలో ఆమె మరణించింది.
చోడవరం గాంధీగ్రామానికి చెందిన వివాహిత పాడేరులో ఉద్యోగం చేస్తూ వేరే వ్యక్తితో సంబంధం పెట్టుకుంది. అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్యచేయించింది.
వివాహేతర సంబంధాలు, ఆస్తి తగాదాలతోనే హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. కుటుంబ సభ్యులే హంతకులు అవుతున్నారనేది విచారణలో నిగ్గుతేలడంతో పోలీసులు విస్తుపోతున్నారు.
ఒకప్పుడు హత్యలు క్షణికావేశంలో జరిగేవి. ప్రస్తుతం పన్నాగం పన్ని మరీ హత్యలకు పాల్పడుతున్నవి అధికంగా ఉన్నాయి. వివాహేతర సంబంధాల్లో ప్రియుడి సహాయంతో హత్యలు చేస్తున్న వారు పోలీసులను పక్కదారి పట్టించాలని చూస్తూ చివరికి కటకటాల పాలవుతున్నారు. ఆస్తి తగాదాల్లోనూ రక్తసంబంధీకులు ఒకరినొకరు హత్య చేసుకుంటూ పోలీస్‌స్టేషన్లకు వచ్చి లొంగిపోతున్న సంఘటనలు



పెరిగిపోతున్నాయి. సెల్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం మన చేతిలో ఉన్నట్లుగా చాలామంది భావిస్తున్నారు. దీన్ని మంచికి వినియోగించకుండా చెడుమార్గాలకు ఉపయోగించడమే అనేక అనర్థాలకు దారితీస్తోంది. ఫోన్లలో పరిచయమైన అపరిచిత వ్యక్తులతో మాటలు కలపడం, వారితో సంబంధాలు పెట్టుకోవడంతో మొదలవుతున్న పరిచయాలు అనర్థాలకు దారితీస్తున్నాయి. సజావుగా సాగుతున్న సంసారంలో వేరే వారితో పెట్టుకుంటున్న సంబంధాలు చిచ్చు పెడుతున్నాయి. ఇవి ప్రాణాలు తీసేంత వరకు వెళ్తున్నాయి. ఈ కేసుల్లో పోలీసులను ఎంత తప్పుదారి పట్టించాలని చూసినా చివరికి కటకటాలపాలవుతున్నారు. హత్యలతో కుటుంబాలు చెల్లాచెదురవుతున్నాయి. ఇలాంటి దారుణాలకు సహకరించిన వారికీ కఠిన శిక్షలు పడుతున్నాయి.
పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి
పిల్లలకు మానవతా విలువలు నేర్పించేలా పాఠశాలలో విద్యాబోధనతో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఫోన్‌లో ఏమి చూస్తున్నారో పర్యవేక్షణ చేయాలని చెబుతున్నారు. చాలామంది సోషల్ మీడియా ప్రభావంతో నేర సంస్కృతి వైపు అడుగులు వేస్తున్నారు. ఎక్కడైనా ఏదైనా హత్య జరిగితే దాన్ని తాము ఎలా చేయవచ్చనే ఆలోచనతో చాలా వరకు హత్యలు జరుగుతున్నట్లు మానసిక నిపుణులు గుర్తించారు. మానసిక రుగ్మత ఉన్నవారు తమకు వచ్చే చెడు ఆలోచనల నుంచి విముక్తి పొందేందుకు సలహాలు, సూచనలకు ప్రభుత్వం 14416కి ఫోన్ చేసి మానసిక స్థితిని మెరుగుపరచుకోడానికి ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబరును ప్రవేశపెట్టింది. 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచి సేవలు అందిస్తున్నారు.
చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ తురుతుంపాడు గ్రామానికి చెందిన కొర్రా రవికుమార్, చింతలూరు గ్రామానికి చెందిన గెమ్మెలి జానకి 2021లో ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. మరో యువతితో రవికుమార్ వివాహేతర సంబంధం పెటుకున్నాడు. దీనికి అడ్డొస్తోందని జులై 27న జానకిని హతమార్చాడు.
జి.మాడుగులలో మెకానిక్‌గా పనిచేస్తున్న చౌటూరి శివ నాగవర్మ(33) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికెళ్లి భార్య ధనలక్ష్మితో గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జి.మాడుగులలో సారా విక్రయిస్తున్న పలువురు దగ్గరకు భార్య వెళ్లి.. తన భర్త వస్తే నాటుసారా ఇవ్వవద్దని చెప్పింది. దీంతో భార్యతో గొడవ పడి గతేడాది ఆగస్టు 31న ఉరేసుకున్నాడు.
పన్నాగాలు పన్నుతూ..
అల్లూరి జిల్లాలో 2022లో 8 హత్యలు జరగ్గా.. వీటిలో వివాహేతర సంబంధాలతో మూడు, ఆస్తి, ఇతర గొడవలతో 5 హత్యలు జరిగాయి. 2023లో ఆరు హత్యలు జరిగాయి. వీటిలో మూడు వివాహేతర సంబంధాలతో, రెండు కుటుంబం మధ్య గొడవలు, ఒకటి ఆస్తి తగాదాలతో జరిగాయి. 2024లో ఇలాంటి హత్యలు ఐదు జరిగాయి.
సహనం ఎంతో అవసరం
సమాజంలో ఓపిక, సహనం తగ్గిపోతున్నాయి. ఏమి అనుకున్నామో అది వెంటనే జరిగిపోవాలన్న భావన పెరుగుతోంది. అనుకున్నది జరకపోతే దానికి కారకులైన వారిపై కక్ష పెంచుకుంటున్నారు. జీవితంలో సహనం చాలా ముఖ్యం. దీన్ని అలవర్చుకునేలా చిన్నతనం నుంచే బోధించాలి. పిల్లలు ఎలా చదువుతున్నారో, వారి వ్యవహారశైలి, అలవాట్లు, స్నేహితులపై పెద్దలు పరిశీలన చేయాలి. ఉమ్మడి కుటుంబాలు లేకపోవడంతో ఏదైనా సమస్య వస్తే పరిష్కరించే వారు కరవవుతున్నారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా దాన్ని కుటుంబసభ్యులంతా మాట్లాడి పరిష్కరించుకోవాలి.
జి.సాయిలక్ష్మి, సైకాలజిస్టు, అనకాపల్లి

# తెరపైకి కారవాన్ టూరిజం!



చిత్తూరు : ప్రకృతి అందాలు.. ఆధ్యాత్మిక ప్రదేశాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రసిద్ధిగాంచింది. సమీపంలోనే రెండు మహా నగరాలు ఉండటం మరింతగా కలిసొచ్చే అంశం. ఇన్ని సానుకూలతలున్నా ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ శాఖ మంత్రి జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించినా పర్యాటక రంగం దైన్యస్థితిని చవిచూసింది. ఒక్క ప్రాజెక్టు ముందుకు కదలలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే కారవాన్ టూరిజం ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. కుప్పాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు 2014- 19లో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు యత్నించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో రామకుప్పం మండలం ననియాలలో ఎకో టూరిజం ప్రాజెక్టు నిర్మించారు. ఇతక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు విడుదల చేశారు. పనులు చివరి దశలో ఉండగా వైకాపా అధికారంలోకి వచ్చింది. ప్రాజెక్టు పడకేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ రావడంతో అధికారులు ఆఘమేఘాలపై కదిలారు. పెండింగ్ పనుల పూర్తితో పాటు కారవాన్ టూరిజాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.
ఎక్కడెక్కడంటే.. కేరళ తరహాలో.. కేరళ తరహాలో కారవాన్ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు అధికారులు పలు ప్రతిపాదనలు రూపొందించారు. కేరళ వరకు వెళ్లి మధ్యలో ఎక్కడైనా తిరిగేందుకు అవకాశం కల్పించనున్నారు. అలాగే తిరుపతి నుంచి శ్రీశైలం వరకు మూడు రోజులకు కారవాన్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గండికోట జలాశయం చూసే వెసులుబాటు ఉంది.
తిరుపతి జిల్లాలో..
తలకోన, సింగిరికోన, కైలాసకోన, సదాశివకోన, చంద్రగిరి కోట, మామండూరు అటవీ ప్రాంతం, మల్లెమడుగు జలాశయం, కల్యాణిడ్యాం, ఆరణియార్ ప్రాజెక్టు, పులికాట్ సరస్సు, నేలపట్టు
చిత్తూరు జిల్లాలో..
చౌడేపల్లె మండలం బోయకొండ, పెనుమూరులోని పులిగుండు, బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ జలపాతం, రామకుప్పంలోని ననియాల ఎకో టూరిజం. కేరళ తరహాలో జిల్లాలోనూ కారవాన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలున్నాయని పర్యాటక శాఖ అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 15 ప్రాంతాలు అనువుగా ఉన్నాయని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.
వాహన సౌకర్యమిలా..ఒక కుటుంబం సరిపడే వాహనం ఒకటి, రెండు కుటుంబాల వరకు వెళ్లేందుకు వీలుగా మరొకదాన్ని అందుబాటులో తేవాలని భావిస్తున్నారు.
అభివృద్ధికి రూ.5 కోట్లు అవసరం
ముందుగా ఈ ప్రాంతాల అభివృద్ధికి రూ.5 కోట్లు అవసరమని నివేదించారు. వీటితో పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. సర్కార్ నుంచి కారవాన్ వస్తే ప్రాజెక్టును పట్టాలెక్కించవచ్చు. జిల్లాకు దగ్గరలోనే బెంగళూరు, చెన్నై ఉన్నందున అక్కడి నుంచీ తాకిడి ఉంటుందని భావిస్తున్నారు.ప్రజాప్రతినిధులూ చొరవ చూపితేనే: పర్యాటక శాఖ నుంచి ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. కారవాన్ టూరిజం ప్రాజెక్టు ఆచరణలోకి రావాలంటే ప్రజాప్రతినిధుల చొరవే కీలకం. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూస్తేనే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుతుంది. తద్వారా రానున్న రోజుల్లో జిల్లాలోని పర్యాటక ప్రదేశాలకు తాకిడి పెరుగుతుంది. స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

# అన్నదాతకు అండ

అమలాపురం : క్షేత్ర స్థాయిలో పంట కాలువలు, నీటి సరఫరా తీరుతెన్నుల పర్యవేక్షణతోపాటు ఆయకట్టు పరిధిలో సమస్యలు పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించే సాగునీటి సంఘాల గురించి వైకాపా పాలనలో పట్టించుకోలేదు. వాటిని రద్దుచేశారు. అంతకు ముందు వరకు ఏటా ఖరీఫ్‌కు ముందుగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టి కాలువల నిర్వహణ పర్యవేక్షించేవి. గడిచిన అయిదేళ్లలో వీటిని పూర్తిగా పక్కన పెట్టేయడంతో పంట కాలువలు చెత్తాచెదారంతో పూడిపోయాయి. ఎక్కడికక్కడ ఆక్రమణల కుగురై వాటి స్వరూపం మారిపోయింది. కూటమి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరపాలని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయిండంతో రైతుల్లో కొత్త హుషారు కనిపిస్తోంది.
కాలువల నిర్వహణ అధ్వానం..
జిల్లాలో ప్రధానంగా ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాల పరిధిలో వరి సాగు ద్వారానే అన్నదాతలు జీవనం సాగిస్తున్నారు. వీరంతా మేజర్, మైనర్ కాలువలపై ఆధారపడి సాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. మరమ్మతులు లేక, తూడు, గుర్రపు డెక్క తొలగించకపో



వడంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ నీటి సంఘాలకు జీవం పోస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
ప్రభుత్వ నిర్ణయంతో ప్రయోజనం
– యాళ్ల బ్రహ్మానందం, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, బెండమూర్లంక
సాగునీటి సంఘాలు లేకపోవడంతో రైతులకు సమాధానం చెప్పేవారు కరవయ్యారు. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు తీతకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం శుభపరిణామం.
సమస్యలకు సత్వర పరిష్కారం
– అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు
ఇప్పటివరకు కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శివారు భూములకు సాగునీరు రాక రైతులు ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుత నిర్ణయంతో రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించుకునే వెసులుబాటు కలగనుంది.
జిల్లాలో ఖరీఫ్ సాగు: 1.69 లక్షల ఎకరాలు
రైతులు: 1.25 లక్షల మంది
సబ్ డివిజన్లు: అమలాపురం, పి.గన్నవరం
డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లు: 9
డబ్ల్యూయూఏ(వాటర్ యూజర్స్ అసోసియేషన్లు):64

# ఇసుక అందుబాటులో లేదండీ!

రాజమహేంద్రవరం : జిల్లాలో ఇసుక కొరత ఏర్పడింది. యంత్రాంగం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ఖాళీ అయింది. సుమారు నెల రోజులుగా ఎక్కడా పూర్తిస్థాయిలో లభించక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఒకవైపు అక్రమార్కులు సృష్టించిన కృతిమ కొరత.. మరోవైపు ఇసుక ర్యాంపులకు అనుమతి మంజూరు చేయకపోవడం వంటివి ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి.
వర్షాకాలం ఆరంభం కాకముందు జిల్లాలో వరద పరిస్థితిని ఊహించి ఏటా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా మే నెలకు ముందే స్టాక్ పాయింట్లకు ఇసుకను భారీగా డంప్ చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చి ప్రభుత్వం కొలువుదీరే సమయంలో సందట్లో సడేమియా అంటూ అక్రమార్కులు స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను అక్రమంగా రాత్రి సమయాల్లో తరలించేశారు. సుమారు రూ.10 కోట్ల విలువైన ఇసుక గుట్లను మాయం చేసేశారు. ఆ తర్వాత ఉన్నతాధికారులు స్థానచలనం ఇవన్నీ ఇసుక మాఫియాకు కలిసొచ్చింది.
కొత్త ప్రభుత్వం వచ్చేసరికి..
కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు ఉచిత ఇసుక విధానం ప్రకటించేనాటికి స్టాక్ పాయింట్ల వద్ద కొద్దిపాటి నిల్వలే మిగిలాయి. వరదల కారణంగా ర్యాంపులు పూర్తిగా నీటితో నిండిపోయాయి. దీంతో తవ్వకాలకు అవకాశం లేకుండా పోయింది. చేసేది లేక అధికార యంత్రాంగం ఉన్న వాటినే వినియోగదారులకు సరఫరా చేసింది. ఇలా రెండు నెలలపాటు పాటు సర్దుబాటు చేసినా ప్రస్తుతం అదీ కూడా అందుబాటులో లేకుండా పోయింది.
ఉన్నవి లక్ష.. అనుమతి వంద..
ఇసుక కొరత గ్రహించిన జిల్లా యంత్రాంగం నిడదవోలు వద్ద రెండు ర్యాంపులకు అనుమతి ఇచ్చింది. వాహనాలకు జీపీఎస్, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వంటి విధానాలు అమలుతో ఇసుక లభ్యత కష్టంగా మారుతోంది. జిల్లాలో ఇసుక, గ్రావెల్ తరలింపునకు సంబంధించి లక్షకు పైగా వాహనాలున్నాయి. వాటికి జీపీఎస్



అనుసంధానం చేయాల్సి ఉంది. ప్రస్తుతం వంద దాటిన వాహనాలు మాత్రమే ఆ పరిధిలో రిజిస్ట్రేషన్ కావడంతో ఇసుక దొరకడం కష్టంగా మారుతోంది.
మాఫియా కృతిమ కొరత
ఎన్నికల తర్వాత గుట్టలు మాయం చేసిన ఇసుక మాఫియా దీన్ని అవకాశంగా తీసుకుని చెలరేగిపోతోంది. అక్రమంగా దాచిపెట్టిన ఇసుకను బయటకు తీసి రాత్రిపూట విక్రయాలు చేస్తోంది. మార్కెట్‌లో అయిదు యూనిట్ల ఇసుక లారీ లోడ్ రూ.23 వేలు పలుకుతోంది. అత్యవసరం, ముహూర్తం కోసం నిర్మాణాలు ఉన్నవారు తప్పని పరిస్థితిలో కొనుగోలు చేస్తున్నారు.
అనుమతులకు ఎదురుచూపు
ఇసుక తవ్వకాల కోసం కొత్తగా అనుమతులు ఇవ్వాల్సి ఉంది. జిల్లాలో సుమారు 60 ర్యాంపులు అందుబాటులో ఉండగా వీటికి అనుమతులు రావాలి. ప్రతీ రేవులో మూడు నుంచి నాలుగు బోట్స్‌మ్యాన్ సొసైటీలున్నాయి. ప్రతి సొసైటీలో 50 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు.

# పెడ చెవిన పెట్టారు.. నిత్యనరకం మిగిల్చారు..

అనంతపురం : జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండల కేంద్రానికి సమీప గ్రామాల ప్రజల రాకపోకలు నరకాన్ని తలపిస్తున్నాయి. వేదవతి హగరి నదిని దాటి కణేకల్లు వచ్చే దారిలో మాల్యం వద్ద వంతెన ఉండేది. 2022 సెప్టెంబరులో వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి వైకాపా ప్రభుత్వం ఆ వంతెన స్థానంలో మట్టిరోడ్డు వేసి వదిలేసింది. ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా శాశ్వత వంతెన ఏర్పాటుకు వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఈ సంవత్సరం కురిసిన వర్షాలకు, చిన్నపాటి వరదకే ఈ మట్టి రోడ్డు కాస్తా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ప్రజలకు కష్టాలు రెండింతలయ్యాయి. మండల కేంద్రానికి బురదలో, ఇసుకలో ద్విచక్ర



వాహనాలతో రావాలంటే నరకం కనిపిస్తోంది.వేరే మార్గం గుండా వెళ్లాలంటే సుమారు 6 కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. పైగా.. ఆ మార్గంలో హెచ్చెల్సీ కాలువ వంతెన కట్టపై ప్రయాణం చేయాల్సి ఉంది. ఈ కాలువ వంతెన పటిష్ఠంగా ఉందా? అంటే అదీ అంతంత మాత్రమే.. పైగా ప్రమాదకరం కూడా.. పెద్ద వాహనాలు రావటానికి లేదు. వంతెన సరిగా లేని కారణంగా ఉరవకొండ నుంచి కణేకల్లు వచ్చే బస్సులనూ కూడా మాల్యం గ్రామం వద్ద ఆపేస్తున్నారు. మొదటిసారి వరద వచ్చినపుడు ఇక్కడ శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణం చేపట్టి ఉంటే ఈ బాధలు తప్పేవి. ప్రస్తుతం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విన్నవించడంతో రూ.40 కోట్లతో వంతెన నిర్మాణం పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన చెబుతున్నారు.

# ఫిట్‌నెస్ ధ్రువపత్రాల జారీ ప్రైవేటుకు..

అనంతపురం : రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ ధ్రువపత్రాల జారీ బాధ్యతలు ఇక నుంచి ప్రభుత్వ రవాణా శాఖ కార్యాలయాల్లో కాకుండా ఓ ప్రైవేటు ఏజెన్సీ నిర్వహించనుంది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ అంశానికి సంబంధించి నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబరు 1 నుంచి అనంతపురం జిల్లాకు సంబంధించి శివశంకర్ ఎంటర్‌ప్రైజర్స్ బాధ్యతలు దక్కించుకుంది. సంబంధిత సంస్థ కేంద్రం నగరానికి సమీపాన ప్రసన్నాయపల్లిలో ఉంది. ఈ మేరకు ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అనంతపురం జిల్లాలో అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి రవాణాశాఖ కార్యాలయాల్లో ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను రవాణాశాఖ అధికారులు ఇచ్చేవారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌పోర్టు వాహనాలు అనంతపురం ప్రసన్నాయపల్లిలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఎంటర్‌ప్రైజర్స్ వద్దకు వచ్చి ధ్రువపత్రాలు పొందాల్సి



ఉంటుంది. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సదరు ఏజెన్సీ వారు స్లాట్ కేటాయిస్తారు. దాని ప్రకారం ఏజెన్సీ వద్దకు వెళితే ప్రభుత్వ నిబంధనలకు మేరకు ఉన్నదీ లేనిదీ పరిశీలించి ధ్రువపత్రాలను జారీ చేస్తారు. జిల్లాలో లారీలు, ఐచర్ వాహనాలు, బస్సులు, అంబులెన్సులు, ట్యాక్సీ క్యాబ్, స్కూల్ బస్సులు, స్టేజ్ క్యారేజ్ బస్సులు, కార్లు వంటి తదితర గూడ్సు వాహనాలు 52 వేలకు పైగా ఉన్నాయని, ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లాకు చెందిన రవాణా శాఖ డీటీసీ వీర్రాజు తెలిపారు.

# పోలవరం.. ఇక మంచిరోజులు!

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ జీవనాడి.. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి. గత అయిదేళ్లు నిర్లక్ష్యానికి గురైన ఈ కీలక ప్రాజెక్టు పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించడమే ఇందుకు కారణం. ప్రాజెక్టులో భాగంగా ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల సాగు-తాగు నీటితోపాటు.. పారిశ్రామిక అవసరాలు తీరే అవకాశం ఉంది.

**ఆశలపై పన్నీటి జల్లులు..**



పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ (పీఐపీఎల్ఎంసీ) పూర్తయితే నాలుగు జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఇందులో ఉమ్మడి జిల్లాలో 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. విశాఖలోని తాగు నీటి, పారిశ్రామిక అవసరాలకు 23.44 టీఎంసీల నీరు అందుతుంది. అక్కడ్నుంచి శ్రీకాకుళం వరకు ఈ జలాలు పంపాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశముంది.

**నాడు రివర్స్ గేర్ ముంచేసింది..**

పోలవరం ఎడమ ప్రధాన కాలువ రూ.4,202.69 కోట్ల అంచనా వ్యయంతో పూర్తిచేయాల్సి ఉంది. ఇప్పటికి రూ.2,963.19 కోట్ల విలువైన పనులు కొలిక్కివచ్చాయి. వైకాపా ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రారంభం కాని పనులతోపాటు.. నిర్మాణంలో ఉన్నవీ ఆపేసింది. దీంతో ప్రగతి పడకేసింది. ఈ ప్రాజెక్టు పరిధిలో 10,438.38 ఎకరాల భూసేకరణలో గొల్లప్రోలు, తుని తదితర మండలాల్లో అడ్డంకులు తొలగాలి. టోపోగ్రాఫికల్ సర్వే పూర్తిచేసి జాతీయ రహదారి క్రాసింగ్ కాంక్రీటు పనులు, కాలువ మట్టి పనులు కొలిక్కి తేవాలి. గుత్తేదారులకు రూ.60 కోట్ల బిల్లు బకాయిలు చెల్లించి.. ప్రాజెక్టుకు నిధుల ఊతమిస్తే కదలిక వచ్చే వీలుంది.

# పచ్చదనం పెంచేలా... ఆహ్లాదం పంచేలా!



నర్సీపట్నం : కేవలం 19 శాతంగా ఉన్న జిల్లా అడవుల విస్తీర్ణాన్ని 50 శాతానికి పెంచడాన్ని సామాజిక అడవుల విభాగం అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 'అమ్మపేరిట మొక్క' కార్యక్రమంలో అనకాపల్లి రాష్ట్రంలోనే మొదటి వరసలో నిలిచింది. జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4,29,200 హెక్టార్లు కాగా, దాంట్లో 78,372 హెక్టార్లలోనే అడవులున్నాయి. సాధారణంగా జిల్లా విస్తీర్ణంలో 35 శాతం అడవులు ఉండాలన్నది మార్గదర్శకం కాగా.. కేవలం 19శాతమే అడవులు ఉన్నాయి. అమ్మపేరిట మొక్క కార్యక్రమంలో భాగంగా 50 లక్షల మొక్కలు నాటించాలన్నది లక్ష్యం. ఇందులో లక్ష్యానికి మించి 53 లక్షలు ఇప్పటికే నాటించారు. సామాజిక బాధ్యత కింద జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్టీపీసీ) నిధులతో 22 కిలోమీటర్ల మేర 13,200 మొక్కలు నాటించింది. అవిప్పుడు ఏపుగా ఎదిగాయి. మరో 40 వేల మొక్కలను 50 కి.మీ. పొడవునా నాటించే కార్యక్రమం కొనసాగుతోంది. అటవీశాఖ పరంగా ఈ ఏడాది 60 హెక్టార్లలో టేకు, 85 హెక్టార్లలో మారుజాతి మొక్కలు నాటిస్తున్నారు. పేపర్‌మిల్లు యాజమాన్యం 60 లక్షల సరుగుడు మొక్కలను పంపిణీ చేసింది. శారదా నది పేరుతో కశింకోట మండలం బయ్యవరం అటవీప్రాంతంలో 'శారదా నగరవనం' సిద్ధమవుతోంది. ఈ కార్తిక మాసానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రకృతిపై అవగాహనకు ఈ వనం తోడ్పడనుంది.

జిల్లాస్థాయి వనమహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్నారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మొక్కలు నాటతారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ్ కృష్ణన్, జేసీ జాహ్నవి పాల్గొంటారు.

**అవగాహనకు చర్యలు**

పౌరుల్లో పర్యావరణ స్పృహ మరింత పెంచేందుకు వివిధ రకాల పోటీలు, ర్యాలీలు నిర్వహిస్తాం. ఈ ఏడాది రెండులక్షల వెదురు, 1274 ఘనపుటడుగుల టేకుకలప ప్రజల అవసరాలకు అందుబాటులో ఉంచుతున్నాం. చిన్న, సన్నకారు రైతులకు, పరిశ్రమలు, సంస్థలకు మొక్కలను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. సభాపతి అయ్యన్న ఆదేశం మేరకు నర్సీపట్నం నియోజకవర్గంలోని శ్మశానవాటికల్లోనూ మొక్కలు నాటించాలని యోచిస్తున్నాం. -జి.లక్ష్మణ్, సామాజిక అడవుల విభాగం డీఎఫ్ఓ

# వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల్లో మాయాజాలం



కదిరి : రైతులను ప్రతికూల వాతావరణం దెబ్బతీస్తోంది. తద్వారా ఏర్పడిన కరవు ప్రాంత రైతాంగానికి అండగా తెదేపా ప్రభుత్వ హయాంలో ఏపీ డ్రాట్ మిటిగేషన్ ప్రోగ్రాం ఏర్పాటైంది. అదే కార్యక్రమాన్ని పల్లెజీవం పేరుతో కొనసాగించారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలను ఏర్పరిచారు. వ్యవసాయంతో పాటు రూ.1,110 సభ్యత్వంతో చేరిన రైతులను సంఘంలో చేర్చుకున్నారు. కానీ, కొందరు అక్రమార్కులు ఖాతాల్లోని రూ.లక్షల్లో సొమ్ము స్వాహా చేశారు. దీంతో సంఘంపై రైతుల నమ్మకం వమ్మయింది. అంతేగాక సంఘాలకు వచ్చిన యంత్ర సామగ్రి కొందరికే పరిమితమైంది. అద్దెకు ఇచ్చిన వలసమణి (నూర్పిడి యంత్రం) వెనక్కు రాకపోవటంతో అమ్మేశారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో ఓబుళదేవరచెరువు మండలంలోని టి.కుంట్లపల్లి, గాండ్లపెంట మండలంలోని మల్లమీదపల్లి, పరిగి మండలాల్లో సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటికి వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీతో సంఘాలకు ఇచ్చారు. భూమిలేని సంఘ సభ్యులకు రూ.లక్షతో కోళ్లషెడ్లను మంజూరు చేశారు. అంతాబాగానే నడుస్తున్నదని భావించారు. 2019లో కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కమిటీ అధ్యక్షులు మారిపోయారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తుల అజమాయిషీ పెరిగింది. అధికార పెత్తనంతో యంత్ర పరికరాలను వాడుకున్నారు. వాటికి కట్టాల్సిన అద్దె ఏళ్లుగా జమ చేయకున్నారు. వాహనాల దుర్వినియోగం, సొమ్ముల కాజేతను రైతులు ఆలస్యంగా తెలుసుకున్నారు. నిలదీయడంతో సొమ్ము జమకు వారం, పదిరోజులంటూ గడువు కోరటంతో ఆగారు. ఒకటి, రెండు రోజుల్లో ఆందోళనతో, న్యాయం కోసం స్టేషన్ వరకు వెళ్తామని సభ్యులు చెబుతున్నారు.

**రూ.6.50 లక్షలు..**

ఓబుళదేవరచెరువు మండలం టి.కుంట్లపల్లిలోని సోమావతి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో రూ.1,150 సభ్యత్వంతో సభ్యులుగా చేరారు. ఆ సొమ్ములో రూ.6.50 లక్షలు సంఘం అధ్యక్షుడు స్వాహా చేసినట్లు సభ్యులు గుర్తించారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో నాబార్డుతో రూ.7 లక్షల నిధులు వచ్చాయి. రాయితీతో వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కొన్నారు. వాటిని నామమాత్రపు అద్దెతో రైతులకివ్వాలి. అంతేగాక సంఘం మండల రైతులతో వేరుసెనగ విత్తనం కొనుగోలుతో ప్రాసెసింగ్‌తో ప్రభుత్వానికి అందజేసేది. వైకాపా ప్రభుత్వం వచ్చాక రైతుల వేరుసెనగ విత్తనకాయలు కొనుగోలు చేయలేదు. వైకాపా ప్రభుత్వంతో సంఘ అధ్యక్షుడిగా వైకాపా నాయకుడు చెన్నారెడ్డిని ఎంపిక చేశారు. ఈయన అధ్యక్షుడైన తర్వాత వలసమని అమ్ముకోవడంతో పాటు, సభ్యులు పొదుపు చేసుకున్న రూ.6.50 లక్షలు తీసుకున్నట్లు సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు.

**అద్దెకు తీసుకెళ్లి అమ్మేశారు..**

గాండ్లపెంట మండలం మల్లమీదపల్లిలో 530 మందితో భూలక్ష్మి వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఏర్పాటైంది. రెండున్నరేళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు లేక సంఘం నిర్వీర్యమైంది. సంఘానికి చెందిన వాహనాలు, సేద్య పరికరాలను సభ్యులకు సంబంధం లేకుండా అజమాయిషీ కలిగినవారే ఉపయోగించుకుంటున్నారు. వ్యవసాయ యంత్ర పరికరాల అద్దె ఏళ్లుగా సంఘానికి చెల్లించకున్నారు. ట్యాంకరు చక్రాలను తొలగించి, సొంతానికి వాడుకున్నట్లు విమర్శలున్నాయి. వలసమణి (నూర్పిడి యంత్రం) అద్దెకు తీసుకెళ్లిన వ్యక్తి అమ్మేశారు. విషయం తెలిసి ఫిర్యాదు చేయటంతో గుడిబండ పోలీసుస్టేషన్‌లో ఉంచారు. సభ్యులు కట్టిన సభ్యత్వ రుసుం రూ.7.40 లక్షలు సంఘం ఖాతాలో ఉందని అధ్యక్షుడు సిద్ధారెడ్డి తెలిపారు.

# నడక వంతెన 'కల' నెరవేరేనా..?



కొమ్మాది : చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారిపై 'నడక వంతెన' ఏర్పాటు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. వైకాపా సర్కారు ఈ విషయంలో మాటలకే పరిమితం అయిందని, కూటమి పాలకులు ఈ సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సందర్భంగా పలువురి మనోగతం వారి మాటల్లోనే..

**రోడ్డు దాటుతూ మా అబ్బాయి కాలు విరిగింది**

మా అబ్బాయి సుమంత్ చంద్రంపాలెం పాఠశాల విద్యార్థి. గత ఏడాది ఆగస్టులో బడికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో ఎడమ కాలు విరిగి ఏడాది పాటు నడవలేని పరిస్థితి ఏర్పడడమే కాకుండా చదువుకూ దూరమయ్యాడు. ఆ ఘటనలో మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి.

-కనక అప్పలనర్సమ్మ, స్వతంత్రనగర్

**నిత్యం భయపడుతూనే బడికి..**

మధురవాడ జాతీయ రహదారిపై గ్రిల్స్ దాటుకుంటూ విద్యార్థులు ప్రమాదకరంగా పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో నిత్యం భయాందోళనకు గురవుతున్నాం. ఈ పాఠశాలకు వచ్చే వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలే. ఇక్కడ తక్షణమే పాదచారుల వంతెన నిర్మించాలి.

-నాయన కనకమహాలక్ష్మీ, మధురవాడ

**రాకపోకలకు నిత్యం ఇబ్బందే..**

మధురవాడ పైవంతెన సేవా మార్గంలో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. పాఠశాల వదిలినప్పుడు తొందరగా ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశంతో విద్యార్థులంతా ప్రమాదపుటంచుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో శనివారం సంత జరిగినప్పుడు సమస్య మరింత తీవ్రంగా ఉంటోంది. ఇక్కడ నడక వంతెన ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యకూ పరిష్కారం లభిస్తుంది.

-ఆర్.చిన్నసత్యనారాయణ, ఆటోడ్రైవర్, మిథిలాపురి వుడాకాలనీ

**వైకాపా పాలనలో శిలాఫలకానికే పరిమితం**

3700 మందికి పైగా విద్యార్థులకు, లక్షకు పైగా జనాభాకు ఉపయుక్తంగా ఉండే నడక వంతెన సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తాం. ఈ విషయంలో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులతో, స్థానిక అఖిలపక్ష నేతలతో కలిసి కూటమి పాలకులకు సమస్య వివరిస్తా. వైకాపా పాలనలో ఓ ప్రయివేటు ఏజెన్సీ ముందుకొచ్చి ఆ మేరకు శిలాఫలకం ఆవిష్కరించినా తర్వాత పనులు జరగలేదు. -గుదే అచ్యుత్‌రావు, ఎస్ఎంసీ ఛైర్మన్, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల

# వణుకుతున్న ఊళ్లు

రాజమహేంద్రవరం : వాతావరణ పరిస్థితులు.. పారిశుధ్య నిర్వహణలో సమస్యలు..తదితర కారణాలతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. సాధారణ రోజులతో పోల్చితే రెండు రెట్లు అధికంగా జ్వరపీడితులు ఆసుపత్రులకు వస్తున్నారు. వారిలో 50 శాతం మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, బ్యాక్టీరియల్ నిమోనియాతో చేరుతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు సరిపోక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులను కూడా ఉంచాల్సిన పరిస్థితి. ఎక్కువమందిలో జ్వరం, తీవ్రమైన తొలనొప్పి, నీరసం, కాళ్లు, కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు, శ్వాసకోస సమస్యలు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 13 ఏళ్ల బాలుడికి



వారం క్రితం తీవ్ర జ్వరం, తలనొప్పి, నీరసం రావడంతో ఆర్ఎంపీని సంప్రదించారు. రెండ్రోజులు మందులు వాడిన తరువాత ప్లేట్‌లెట్లు 80 వేలకు పడిపోయాయని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మూడు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారు. రూ.32 వేల వ్యయమైంది.

గతేడాదితో పోల్చితే..

గత ఏడాది ఇదే సమయంతో పోల్చితే ఈ దఫా జ్వరపీడితుల సంఖ్య భారీగా పెరిగింది. రికార్డుల్లో నమోదవ్వని కేసులు ఇంకా ఎక్కువే. డెంగీ నిర్ధారణ పరీక్షల్లో నెగెటివ్ రిపోర్టు వచ్చినా శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. ఈ సమస్యతో బాధపడుతున్నవారిలో 80 శాతం మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

**వార్డులన్నీ కిటకిట..**

సర్వజనాసుపత్రికి సగటున రోజుకు 1000 ఓపీ నమోదవుతుంటుంది.. జనరల్ మెడిసిన్ విభాగానికి సంబంధించి గతంలో రోజుకు 150 కేసులు వస్తుండగా ప్రస్తుతం 200 వరకు వస్తున్నాయి. వాటిలో 60 వరకు జ్వరసమస్యలే. రోజుకు 30 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. 30 శాతం వరకు డెంగీ, ఇతర లక్షణాలు ఉన్నాయి. దగ్గు, కఫంతో రక్తం పడడం, ఆయాసం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందితో రోజుకు అయిదుగురు చేరుతున్నారు. : రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రులకు తాకిడి పెరిగింది. 18 ఏళ్లలోపు వారు తీవ్ర జ్వరం.. వైరల్, బ్యాక్టీరియల్ నిమోనియాతో బాధపడుతున్నారని ఓ వైద్య నిపుణుడు తెలిపారు. ఉదయం 7.30 నుంచి రాత్రి 10 గంటల వరకు కొందరు వైద్యులు ఓపీలు చూసే పరిస్థితి ఉంది. సమూహాల్లోకి వెళ్లొద్దు -వై.గురుప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, రాజమహేంద్రవరం

మారిన వాతావరణ పరిస్థితులతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది. విష జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు కొద్ది రోజులు సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి. మాస్కు వినియోగించాలి. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి.

# కూటమి దృష్టిసారిస్తే.. నీరు పారిస్తే..

చిత్తూరు: హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) జిల్లా రైతాంగం, ప్రజలకు వరప్రదాయిని. రెండు దశాబ్దాల క్రితం మొదలై 2014- 19 మధ్య తెలుగుదేశం హయాంలో ఓ కొలిక్కి వచ్చిన పనులు వైకాపా పాలనలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా తయారయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. కుప్పం బ్రాంచ్ కాలువను పూర్తి చేసేందుకు చంద్రబాబు సర్కార్ శరవేగంగా అడుగులు వేస్తుండగా ప్రధాన కాలువపైనా అదే చొరవ చూపాలని కర్షకులు కోరుతున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ 185.32 కి.మీ మేర తవ్వించారు. 90 శాతం నిర్మాణాలు జరిగాయి. ప్రధాన కాలువ 500 మీటర్లు మాత్రమే పెండింగ్ ఉంది.చిన్నమండ్యం మండలం పడమటికోన వద్ద 200 మీటర్లు, కలకడ దగ్గర 300 మీటర్లు తవ్వాలి. ఈ రెండు పూర్తయితే 1.02 టీఎంసీల సామర్థ్యమున్న శ్రీనివాసపురం రిజర్వాయర్, 1.84 టీఎంసీలున్న అడవిపల్లె జలాశయాన్ని నింపవచ్చు. ఈ రెండు రిజర్వాయర్లు ఇప్పటికే అందుబాటులోకి ఉన్నాయి. వచ్చిన నీటిని వచ్చినట్టే నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంది. కలకడ మండలం దొడ్డిపల్లి వద్ద మూడు కాంక్రీటు నిర్మాణాలు చేయాలి. అక్కడక్కడ కొన్ని స్ట్రక్చర్లు, అక్విడక్టులు నిర్మించాలి. కూటమి ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరు చేస్తే ఈ పనులన్నీ వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తవుతాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రజాప్రతినిధులుస్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని రైతాంగం కోరుతోంది.

రూ.65 కోట్లతో నీవా బ్రాంచ్ పూర్తి

అడవిపల్లె రిజర్వాయర్ నుంచి నీవా బ్రాంచి కాలువకు నీరు ఇవ్వాలంటే మరో రూ.65 కోట్ల వ్యయమవుతుంది. కాలువ పనులు, పంప్‌హౌస్‌లకు సంబంధించి కొంత నిర్మాణం జరగాలి. రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తే 57,500 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుంది. చిత్తూరు నగర తాగునీటి ఎద్దడిని నివారించవచ్చు.

పెండింగ్ బిల్లులే రూ.61.01 కోట్లు

ప్రధాన కాలువ కింద గతంలో చేసిన పనులకు సంబంధించి రూ.61.01 కోట్ల బిల్లులు చెల్లించాలి. పెండింగ్ పనులకు మరో రూ.45.59 కోట్లు అవసరం. శ్రీసత్యసాయి జిల్లాలోనూ పాత బకాయిలు, నిర్మాణాలకు రూ.50 కోట్లు ఖర్చవుతుంది. రూ.156 కోట్లు విడుదల చేస్తే ప్రధాన కాలువలో కృష్ణా జలాలు ప్రవహిస్తాయి. వర్షాకాలంలోనూ ట్యాంకర్లతో నీళ్లు తోలే దుస్థితి తప్పుతుంది. సర్కారుపై ఏటా రూ.50 కోట్ల వరకు భారం తగ్గుతుంది.

నిఘానేత్రం
తెలుగు దినపత్రిక
మంగళవారం 3 సెప్టెంబర్ 2024

# అద్దె యంత్రం.. గద్దల సొంతం

నెల్లూరు: అధికారంలోకి వచ్చిన రెండేళ్ల పాటు వ్యవసాయ యాంత్రీకరణ జోలికే వెళ్లని వైకాపా ప్రభుత్వం- ఆ తర్వాత కస్టం హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)లంటూ కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టింది. 2021-23 మధ్య యంత్ర పరికరాలు ఇస్తామంటూ.. మేళాలు నిర్వహించింది. ఒక్కో గ్రూపునకు గరిష్ఠంగా రూ. 15 లక్షలతో పరికరాలు మంజూరు చేయగా.. వాటిని ఆర్బీకే(ప్రస్తుతం రైతు సేవా కేంద్రం)ల వద్ద ఉంచి, రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇవ్వాల్సి ఉంది. కాగా, ఈ ప్రధాన ఉద్దేశాన్ని వైకాపా ప్రభుత్వం తుంగలో తొక్కింది. రాయితీపై ట్రాక్టర్లు, ఇతర పరికరాలు ఇస్తామని ఆశ చూపిన పాలకులు.. చివరకు వాటిని వైకాపా నాయకులకు కట్టబెట్టారనే విమర్శలు ఉన్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టడంతో.. రైతుల పేరుతో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు.. వ్యవసాయ అవసరాలకంటే ఇసుక, గ్రావెల్ తవ్వకాలకే ట్రాక్టర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. చాలా పరికరాలు ఇప్పటికే చేతులు మారాయి. దీనిపై అధికారులు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తుండటంతో అక్రమార్కులు వణికిపోతున్నారు.

**వైకాపా నాయకుల ఇళ్ల దగ్గరే..**

జిల్లాలో 561 రైతు భరోసా కేంద్రాలు ఉండగా- ప్రతి కేంద్రం పరిధిలో అద్దె కేంద్రాన్ని(కస్టం హైరింగ్ సెంటర్) నెలకొల్పారు. అయిదారుగురు రైతులను కలిపి ఓ బృందంగా ఏర్పాటు చేశారు. ఒక యూనిట్ రూ. 15 లక్షలు.. అందులో 10 శాతం రైతులు, 50 శాతం బ్యాంకు రుణం, మిగిలిన 40 శాతం రాయితీ(రూ.6 లక్షలు)గా ఉంటుంది. 2021 నుంచి 2023 వరకు జిల్లాలో 614 గ్రూపులు ఏర్పాటు చేయగా.. 380 ట్రాక్టర్లు, 35 వరికోత యంత్రాలు, 4,314 ఇతర పరికరాలు అందజేశారు. ఇవన్నీ దాదాపు వైకాపా కార్యకర్తలు, అప్పటి ప్రజాప్రతినిధుల సిఫార్సులు ఉన్నవారికే కట్టబెట్టారు. రాయితీ రూపంలో రూ. 23 కోట్లు అందజేశారు. ఆ పరికరాలను.. ఆర్బీకేల ఎదుట ఉంచి అవసరమైన వారికి అద్దెకు ఇవ్వాల్సి ఉండగా.. అవన్నీ వైకాపా నాయకుల ఇళ్ల వద్దకు చేరాయి. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి వివరణ కోరగా.. వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు తేలితే.చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ రాయితీని రికవరీ చేస్తామన్నారు. దీనిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

**ఎక్కడ.. ఎవరి దగ్గర ఉన్నాయ్..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. ఈ పథకం కింద నిధుల విడుదల, యంత్ర పరికరాల మంజూరుపై నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా వ్యవసాయశాఖలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అసలు అవి రైతులు తీసుకున్నారా? వైకాపా నాయకుల దగ్గర ఉన్నాయా? పథకం ఉద్దేశం సద్వినియోగమైందా? ఇతర అవసరాలకు మళ్లించారా? విక్రయించేశారా?వంటి విషయాలపై సమగ్ర వివరాలు సేకరించనున్నారు. డివిజన్, మండల వ్యవసాయాధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. గ్రూపు సభ్యులతో కలిపి పరికరాలు ఫొటోలు తీసి, ప్రభుత్వ అధికారి వైబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. కాగా, జిల్లాలోని చాలా సీహెచ్‌సీ గ్రూపుల సభ్యులు ఫొటో దిగేందుకు ముందుకు రావడం లేదు. ఒకరిద్దరు మాత్రమే వస్తుండటంతోఅధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

# అయిదేళ్లు.. జాడ లేని పరిశ్రమలు

కందుకూరు : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఎంతో కీలకమైన రామాయపట్నం ఓడరేవు నిర్మాణం జరుగుతోంది. ఇదే సమయంలో ఓడరేవు పరిధిలో భారీగా పరిశ్రమలు స్థాపిస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. అయిదేళ్లు పూర్తయినా పరిశ్రమల జాడలేదు. కేవలం 35 ఎకరాల్లో చేవూరు వద్ద ఇండోసోల్ సోలార్ పలకల పరిశ్రమ నిర్మాణాన్ని ఇటీవల ప్రారంభించారు. పరిశ్రమల స్థాపనతో ఓడరేవు పరిధిలోని రెండు జిల్లాల్లో నిరుద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు.

**పట్టించుకోని జగన్ ప్రభుత్వం**

2019 జనవరిలో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రామాయపట్నం ఓడరేవుకు శంకుస్థాపనతోపాటు సుమారు రూ.3500 కోట్ల వ్యయంతో ఏపీపీ పరిశ్రమ స్థాపనకు శంకుస్థాపన చేశారు. అయితే, తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పరిశ్రమల ఊసే ఎత్తలేదు.

**భూముల వరకే తీసుకుంటే ఇబ్బందే**

చేవూరు, రావూరుకు చెందిన భూములను తీసుకుంటే గ్రామస్థులకు ఇబ్బంది అని, తర్వాత ఎలా జీవించాలంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాలతోపాటు భూములన్నింటిని తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**కాగితపు పరిశ్రమలకు అనుకూలం**

ప్రకాశం, నెల్లూరు జిల్లాలో విస్తారంగా సరుగుడు, జామాయిల్,



సుబాబుల్ తోటలున్నాయి. ఈ ప్రాంతంలో కాగితపు పరిశ్రమ ఏర్పాటు చేస్తే స్థానికంగా వీటిని సాగుచేసే రైతులకు మేలు కలుగుతుంది. రెండు జిల్లాల్లో సుమారు లక్ష మంది రైతులకు అనుకూలంగా ఉంటుంది. అదే సమయంలో పదివేల మందికి ప్రత్యక్షంగా, మరో పది వేలమందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇప్పుడు మళ్లీ తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక్కడ భూములను పరిశ్రమలకు కేటాయించి స్థానికంగా నిరుద్యోగితను తగ్గించడానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**భారీగా భూముల సేకరణ**

వైకాపా ప్రభుత్వం రామాయపట్నం ఓడరేవు పరిసరాల్లో సుమారు 3000 ఎకరాలకు పైగా భూముల సేకరణకు ప్రయత్నాలు చేసింది. అయితే, ఇందులో చేవూరు, రావూరు గ్రామాలకు చెందిన మాగాణి భూములుండటంతో కొందరు రైతులతోపాటు, రావూరు గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానం ఆశ్రయించారు. అయినా, చేవూరు వద్ద కొంతమంది రైతులకు కేవలం రూ.23 లక్షల వరకు నామమాత్రం ధర చెల్లించి భూములను తీసుకున్నారు. ఇక్కడ ఎకరా ధర సుమారు రూ.50 లక్షల నుంచి రూ.75లక్షలు ఉంది. దీంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందడుగు

ఏవీ రమణ, తహసీల్దార్, గుడ్లూరుఓడరేవు పరిసరాల్లో కేటాయించిన భూముల్లో పరిశ్రమల స్థాపనకు వివరాలు లేవు. నూతన ప్రభుత్వం తమ ప్రాధాన్యతల్లో పరిశీలించడానికి వివరాలు సిద్ధం చేశాం. సర్కారు నిర్ణయం మేరకు ముందడుగు వేస్తాం.

# పరీక్షలకు దూరం.. రైతులకు భారం



పలాస : సాగుకు సంబంధించిన అంశాల్లో సాంకేతిక, నాణ్యత పరమైన సమస్యలు అధిగమించడానికి గత ప్రభుత్వం రూ.కోట్లు వ్యయం చేసి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లు అలంకారప్రాయంగా మారాయి. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగా అన్ని అంశాలను పరీక్షించి రైతులకు సహకారం అందించాలనే ఉద్దేశంతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. భవనాలు నిర్మించి పరికరాలు సమకూర్చినా నిపుణులు, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించలేదు. కొన్నిచోట్ల తూతూమంత్రంగా పరీక్షలు జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల పరికరాలు అమర్చడానికి అనువైన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ఫలితంగా రైతులు భూసారం, విత్తనాల నాణ్యత వివరాలు తెలుసుకోవడం భారమవుతోంది.

సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, రణస్థలం, ఆమదాలవలస, శ్రీకాకుళంలో అగ్రిల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికలకు ముందు హడావుడిగా వాటిని ప్రారంభించారు. ప్రస్తుతం పని చేస్తున్న వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ల్యాబ్ పరిధి అధికంగా ఉండటంతో నియోజకవర్గంలోని రైతులందరికీ సేవలు అందించే అవకాశం లేకుండా పోయింది. వివిధ పంటలకు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యత ల్యాబ్‌ల్లో పరీక్షించి నివేదికలు సిద్ధం చేసి రైతుల దృష్టికి తీసుకెళ్లాలి. నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి. జిల్లాలో రైతులు ఒడిశా, ఇతర ప్రాంతాలకు సంబంధించిన విత్తనాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. వాటి నాణ్యతపై నారు వేసే సమయంలోనే పరీక్షిస్తే అన్నదాతలు నష్టపోకుండా చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

**స్పష్టత కరవు**

వ్యవసాయ పరీక్ష కేంద్రాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. ఎంత మంది సిబ్బంది ఉండాలి? ఏయే విధులు నిర్వహించాలనే అంశంపై స్పష్టత లేదు. ప్రస్తుతానికి కొందరు వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించి నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ల్యాబ్, పరీక్షల నిర్వహణ, నివేదికల తయారీ, ఇతర అంశాలకు సంబంధించి నిపుణులైన సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి**సోంపేట, టెక్కలిలో భవనాలను ప్రారంభించి ఊరుకున్నారు. పరికరాలు సమకూర్చినా వాటిని అమర్చడానికి ఫర్నీచర్ అందజేయకపోవడంతో ల్యాబ్‌లు వినియోగంలోకి రాలేదు. పరీక్షలు నిర్వహించే అవకాశం లేక ఉపకరణాలు మూలకు చేరాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి విధి, విధానాలపై సమగ్ర ప్రణాళిక అమలయ్యేలా చర్యలు తీసుకుంటేనే అగ్రి ల్యాబ్‌లు రైతులకు ఉపయోగపడతాయని రైతు సంఘం ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. పాత సిబ్బందితోనే వాటిని నిర్వహిస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.

**వ్యవసాయ విస్తరణాధికారులతో నిర్వహణ..**

అగ్రి ల్యాబ్‌ల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించలేదు. ప్రతి ల్యాబ్‌లో ఒక వ్యవసాయ విస్తరణాధికారి విధిగా ఉండేలా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాం. కొన్నిచోట్ల వ్యవసాయాధికారి, విస్తరణాధికారి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొన్ని పరికరాలు, ఫర్నీచర్ సమకూరకపోవడంతో టెక్కలి, సోంపేట కేంద్రాల్లో ఇంకా పరీక్షలు ప్రారంభం కాలేదు. త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. కె.శ్రీధర్, వ్యవసాయ సంయుక్త సంచాలకుడు, శ్రీకాకుళం

# ప్రాథమిక అవస్థల కేంద్రాలు!



శ్రీకాకుళం : వేళకు అందుబాటులో ఉండని వైద్యులు.. నిరుపయోగంగా పరికరాలు.. అరకొర సదుపాయాలు.. పర్యవేక్షణ లేమి.. కొన్నిచోట్ల సిబ్బంది కొరత.. ఇదీ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి. వీటన్నింటి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు వెళ్తే మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకం ప్రజల్లో సన్నగిల్లుతోంది. ఇక్కడ 24 గంటల సేవలు పేరుకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పీహెచ్‌సీలను (18వ తేదీ) పరిశీలించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ లోపాలను తక్షణమే సరి చేసి.. అందరికీ మెరుగైన వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

జిల్లాలో 71 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిల్లో ఇద్దరేసి చొప్పున వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, పార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సీనియర్ అసిస్టెంట్లు, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌ఈవో, ఎఫ్‌ఎన్‌వోలు, ఇతర సిబ్బంది ఉండాలి. అన్ని పీహెచ్‌సీల్లో కలిపి ప్రస్తుతం 1,004 మందికిగాను 952 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరత తక్కువగానే ఉన్నప్పటికీ రోగులకు సేవలు సక్రమంగా అందట్లేదు.

**ఎప్పుడు ఉంటారోతెలీదు..**

నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు తప్పనిసరిగా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. చాలా చోట్ల అలా జరగట్లేదు. ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ చాలా చోట్ల ఒక్కరు మాత్రమే ఉంటున్నారు. క్షేత్రస్థాయి పేరుతో మరొకరు ఏ రోజు ఎక్కడ ఉంటున్నారో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. అందుబాటులో ఉన్న చోట సాఫ్‌నర్సులే సేవలందిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ... పీహెచ్‌సీలపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల కనీస వసతులు లేకపోయినా పట్టించుకునే వారే లేకుండా పోయారు. చాలా ఆసుపత్రుల్లో ప్రసవాలు, శస్త్రచికిత్సలూ జరగట్లేదు. అవసరమైన సౌకర్యాలున్నప్పటికీ వేరే ఆసుపత్రులకు పంపించేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ప్రారంభం కావడంతో అతిసారం, మలేరియా, విషజ్వరాలు, కీళ్లనొప్పులు, జలుబుతో నిత్యం ఎంతో మంది పీహెచ్‌సీలకు వస్తున్నారు. చాలా చోట్ల పని వేళల్లో అందుబాటులో లేక ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు.

**నాలుగు గంటలకే నిర్మానుష్యంగా..**

మందస పీహెచ్‌సీలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇద్దరు వైద్యుల్లో ఒకరు కూడా అందుబాటులో లేరు. స్టాఫ్ నర్సులు కూడా మధ్యాహ్నం వెళ్లిపోయారని అక్కడున్న సిబ్బంది తెలిపారు. ఎవరూ లేకపోవడంతో సాయంత్రం 4 గంటలకు ఆసుపత్రి నిర్మానుష్యంగా మారింది. ఇక్కడ మరమ్మతులకు గురైన పడకలపైనే రోగులకు చికిత్స అందించాల్సి వస్తోంది.

**వచ్చేవరకు వారే వైద్యులు**

టెక్కలి మండలం కె.కొత్తూరు పీహెచ్‌సీలో ఉదయం 9:55 గంటలకు ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలను చిత్రంలో చూడవచ్చు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఒకరు ఉదయం 9:57 గంటలకు ఆసుపత్రికి రాగా.. మరొకరు 10:02 గంటలకు ఆసుపత్రికి వచ్చారు. అప్పటికే 34 మంది రోగులు ఓపీ విభాగంలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. జ్వరాలు, అతిసారం లక్షణాలతో ఎక్కువ మంది వస్తుండగా.. వారందరికీ స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులే చికిత్స చేసి పంపుతున్నారు.

**అధ్వానంగా పరిసరాలు..**

పలాస మండలం రెంటికోట పీహెచ్‌సీ ఆవరణలో పనికిరాని మొక్కలు, పాములు, చీమల పుట్టలు ఉన్నా, కుక్కలు తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. దీంతో దోమలు, కీటకాలు పెరిగిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మందులు సైతం వరండాలోనే నిల్వ ఉంచుతున్నారు. గతంలో ఇక్కడ నెలకు కనీసం 15 కుటుంబ నియంత్రణ, ఇతర శస్త్ర చికిత్సలు జరిగేవని, ఇప్పుడు ఒక్కటీ చేయని పరిస్థితి నెలకొంది.

**వరండాలోనే మందులు**

కంచిలి పీహెచ్‌సీని వసతి సమస్య వేధిస్తోంది. కనీసం మందులు ఉంచడానికి కూడా గది లేకపోవడంతో ఇలా వరండాలోనే ఉంచుతున్నారు.

**ఏడు నెలలుగా వైద్యుల్లేరు..**

సోంపేట మండలం బట్టిగళ్లూరు పీహెచ్‌సీలో ఏడు నెలలుగా వైద్యుల్లేరు. బారువ నుంచి సిరిమామిడి పంచాయతీల వరకు తీర ప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రే ఆధారం. పీహెచ్‌సీ పరిధిలో కిడ్నీ వ్యాధి తీవ్రత ఉన్నప్పటికీ వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్, ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్‌ఎన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ చేయకపోవడంతో రక్తపరీక్షలు, ఈసీజీ సేవలు, శస్త్రచికిత్స చేసేందుకు అన్ని సౌకర్యాలు, పరికరాలు ఉన్నప్పటికీ సేవలందించే అవకాశం లేకుండా పోతోంది. సిబ్బంది జీతభత్యాలు, దస్త్రాలపై సంతకాలు చేసేందుకు మాత్రం కొర్లాం వైద్యురాలికి బాధ్యతలు అప్పగించారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేవలం 13 మంది రోగులు రాగా.. వారికి కూడా సిబ్బంది నామమాత్రంగా సేవలందించి పంపించేశారు.

**సమస్యలుంటే ఫిర్యాదు చేయండి..**

అన్ని పీహెచ్‌సీల్లో 24 గంటలు తప్పనిసరిగా సేవలందించాలి. స్టాఫ్ నర్సులు వంతులవారీగా అందుబాటులో ఉంటారు. వైద్యాధికారులు సాయంత్రం 4 గంటల వరకు ఉండాలి. నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలి. ఎక్కడైనా వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోయినా, ఇతర సమస్యలేమైనా ఉంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

## శిథిలం..భయం భయం

శ్రీకాకుళం : నగరపాలక సంస్థ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్ల కిందటి నిర్మాణం కావడంతో పైకప్పు పూర్తిగా పాడైంది. పలుచోట్ల స్లాబు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు వచ్చాయి. గోడలు బీటలు వారాయి. సీలింగ్‌లు వర్షపు నీటికి తడిసి కూలుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పలు విభాగాల్లో దస్త్రాలు తడవకుండా ఫ్లెక్సీలతో కప్పారు. సౌర విద్యుత్తు కేంద్రానికి సంబంధించిన పలకలపై వ్యర్థాలు పేరుకుపోయాయి. స్లాబుపై వర్షపు నీరు నిలిచి కిందకు దిగుతుండటంతో పైకప్పు పాడవుతోంది. ఇంజినీరింగ్ అధికారులు పలుమార్లు రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టినా పైకప్పును పటిష్ఠపరిచే చర్యలు తీసుకోలేదు. మరోవైపు గతంలో ఉన్న కౌన్సిల్ హాలును తొలగించి రూ.10 లక్షలు వెచ్చించి నూతన హంగులతో కొత్తది నిర్మించడం గమనార్హం. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసును 'న్యూస్‌టుడే' సంప్రదించగా కార్యాలయ మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కాలువల అక్రమణలు.. కర్షకుల కన్నీళ్లు

రాజమహేంద్రవరం :అయిదేళ్ల వైకాపా జమానాలో జలవనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేయగా.. అధికారులు సైతం ఉన్న వనరులను కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. పంట కాలువలపై ఎడాపెడా ఆక్రమణలకు పాల్పడ్డారు. ఏళ్లతరబడి ఉన్న ఆక్రమణలూ పట్టించుకోలేదు. దీంతో కాలువలు కుంచించుకుపోయి నీరు సజావుగా పారేందుకు అవకాశం లేక.. వర్షాలు, వరదల సమయంలో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. రబీలో శివారు ఆయకట్టు వరకు నీరందక వేల ఎకరాలు బీళ్లుగా మారుతుంటే.. ఖరీఫ్‌లో ముంపు సమస్య వెంటాడుతోంది. దీంతో రైతులు ఏటా ఆర్థికంగా కుదేలై చితికిపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా పంట కాలువలపై 3,910 ఆక్రమణలు ఉన్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. తూర్పు డెల్టాలో 690, మధ్య డెల్టాలో 3100, వై.ఐ.(ఏలేరు ఇరిగేషన్) డివిజన్‌లో 120, డ్రెయినేజీ విభాగంలో 600 వరకు ఆక్రమణలున్నట్లు గతంలోనే తేల్చారు. తాజాగా వీటిసంఖ్య పెరిగింది. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా రెండోపంట రబీలో శివారు ఆయకట్టుకు నీరందక ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాలు, వరదల వల్ల ముంపు సమస్య అధికమవుతోంది. పంట కాలువలను ఆనుకుని లేఔట్లు వేయడం, ఈ క్రమంలో కాలువలను కప్పేసి తూరలు ఏర్పాటు చేయడంతో నీరు సజావుగా పారడం లేదు.



కొన్ని రోజులకు ఆ తూరలు పూడిపోవడంతో సమస్య మరింత జటిలమవుతోంది. గట్లపై పక్కా నిర్మాణాలు, దుకాణాలు వెలుస్తున్నాయి. గతంలో కొందరికి నోటీసులిచ్చి ఆ తరువాత మిన్నకున్నారు. ఇప్పటికైనా కలెక్టర్లు జోక్యం చేసుకుని జలవనరులు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో సమస్య పరిష్కారంపై దృష్టిసారిస్తే రైతులకు ఎంతో మేలు చేసినవారవుతారు.

**చిన్నపాటి వర్షాలకే ..**

పి.గన్నవరం మండలం పోతవరంలోని చిన్నతరహా మురుగు కాలువ ఇది. దీని ఆధారంగా దాదాపు 150 ఎకరాల వరి ఆయకట్టు ఉంది. సుమారు కిలోమీటరు మేర ఆక్రమణలకు గురైంది. దీంతో ముంపు దిగక రైతులు పంట నష్టపోతున్నారు. వారం రోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షాలకే చేలు చెరువును తలపిస్తున్నాయి. ముంపునీరు దిగకపోవడంతో ఖరీఫ్ నాట్లు వేసేందుకు అవకాశం లేకుండా పోయిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..**

431 కి.మీ. మేర ప్రధాన పంట కాలువలు, 2,024 కి.మీ. పిల్ల కాలువలు ఉన్నాయి. వీటి మొత్తం పొడవు 2,455 కిమీ ఉన్నాయి. 379 కి.మీ. మేర 20 ప్రధాన మురుగు కాలువలు, 363 కి.మీ. 45 మధ్యతరహా మురుగు కాలువలు, 1,184 కి.మీ. మేర 272 చిన్నతరహా మురుగు కాలువలు, 700 కి.మీ. మేర 900 రెవెన్యూ మురుగు కాలువలు ఉన్నాయి. చేలల్లోంచి ముంపు బయటకు పోవాలంటే వీటిని పటిష్ఠం చేయల్సి ఉంది.

**ఏటా తప్పని వెతలు..**

ఏటా ఖరీఫ్‌లో దాదాపు 25 వేల ఎకరాలు ముంపుబారిన పడతాయి. ఆ భయంతో నష్టాన్ని ఎదుర్కోలేక ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, తాళ్లరేవు తదితర మండలాల్లో సుమారు 23 వేల ఎకరాల్లో సాగుకు దూరంగా ఉంటున్నారు. ః రబీలో నీటిఎద్దడి సమస్య దాదాపు 30 వేల ఎకరాలపై ఏటా ప్రభావం చూపుతోంది కాట్రేనికోన, తాళ్లరేవు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, పెదపూడి, రాజోలు, అంబాజీపేట, మామిడికుదురు తదితర మండలాల్లోని శివారు ప్రాంతాలపై ఈ ప్రభావం ఉంటుంది. ః ముమ్మిడివరం మండలం అయినాపురంలో నక్కల కాలువ కొంత రెవెన్యూ, మరికొంత జలవనరులశాఖ పరిధిలో ఉంది. దీన్ని ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించారు. ఇరుసుమండ డ్రెయిన్ పరిస్థితీ అంతే. అయినాపురంలో డ్రెయిన్‌ను ఆక్రమించి కొబ్బరి సాగు చేపట్టారు. ఇలా ఆక్రమణలు పెరగడంతో ముంపు సమస్య తలెత్తి 2021, 2022 ఖరీఫ్ సీజన్‌లో పంట విరామం ప్రకటించారు.

# సముద్ర తీరంలో రక్షణ గోడ

కొత్తపల్లి : ఉప్పాడ ప్రాంతంలో సముద్ర కోత నుంచి తీరానికి రక్షణ కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాకినాడ నుంచి యు.కొత్తపల్లి మండలంలో అమినాబాద్ వరకు తీర ప్రాంత రక్షణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇటీవల పవన్‌కల్యాణ్ యు.కొత్తపల్లి మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి కోత ప్రభావం, జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

**14.5 కిలోమీటర్ల మేర..**

కాకినాడ వాకలపూడిలోని లైట్ హౌస్ నుంచి ఉప్పాడ కొత్త హార్బర్ ప్రాంతం వరకు కోత ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ రెండు ప్రాంతాల మధ్య 14.5 కిలోమీటర్ల మేర రక్షణ గోడ నిర్మించాలని నిర్ణయించారు. సుబ్బంపేట నుంచి హార్బర్ వరకు తొమ్మిది ప్రాంతాల్లో కెరటాల ప్రభావం తగ్గించడానికి గ్రోయల్ గట్లు నిర్మించనున్నారు. వీటితోపాటు ఉప్పాడ నుంచి కాకినాడ వరకు బీచ్ అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించి మానిటరింగ్ అధికారి, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసరావు శుక్రవారం మండలంలో పర్యటించి ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాలపై కోత ప్రభావం, ప్రస్తుత పరిస్థితులను తెలుసుకున్నారు.

**కాకినాడ- ఉప్పాడ హార్బర్**కోత ప్రభావం నుంచి గ్రామాలకు రక్షణ కల్పించేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. కాకినాడ నుంచి ఉప్పాడ హార్బర్ వరకు రక్షణగోడ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా మండలంలో అధికారులను కలిసి వివరాలు సేకరించి నివేదిక రూపొందిస్తున్నాం.- శ్రీనివాసరావు, మానిటరింగ్ అధికారి

# అధ్యాపకుల కొరత.. బోధనకు వెత

గుత్తి : ఉమ్మడి అనంత జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. నాణ్యమైన బోధన అందక విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. పర్యవసానంగా ఏటా జూనియర్ కళాశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. విద్యార్థులు ఇబ్బందులు పడినా గత వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఐదేళ్లలో ఒక్క అధ్యాపక పోస్టును భర్తీ చేయలేదు. దీంతో చాలా చోట్ల అధ్యాపకులు తమ సబ్జెక్ట్ కాకపోయినప్పటికీ ఇతర సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకుని పాఠాలు చెప్పారు. ఇటీవల వెల్లడైన ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిపోయింది. ఈనేపథ్యంలో తెదేపా కూటమి అధికారంలోకి రావడంతో ఆశలు చిగురించాయి. ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీసీ, బైపీసీ గ్రూపులను విద్యార్థులు ఎంపిక చేసుకుంటున్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జువాలజీ సబ్జెక్టు పాఠాలు బోధించేందుకు చాలా కళాశాలల్లో అధ్యాపకులు లేకపోవడం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ద్వితీయ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు అక్కడితోనే చదువు ఆపేస్తున్నారు.

42,000 మంది విద్యార్థులుంటే రెగ్యులర్, ఒప్పంద అధ్యాపకులతో కలిపి 590 మంది ఉన్నారు. వీరందరికీ పాఠాలు బోధించాలంటే 800 మందికి పైగా అధ్యాపకులు అవసరమవుతారు. ప్రభుత్వం స్పందించి.. ఖాళీలను భర్తీ చేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని విద్యావేత్తలు అంటున్నారు.

**కొన్ని చోట్ల పరిశీలిస్తే..**

తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 110 మంది విద్యార్థులకు ముగ్గురు అధ్యాపకులు, ముదిగుబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 మంది విద్యార్థులకు నలుగురు ఒప్పంద అధ్యాపకులతో బోధన సాగుతోంది. రెండు కళాశాలల్లో ఆంగ్లం, గణితం, బయాలజీ, జువాలజీ తదితర సబ్జెక్టులకు అధ్యాపకులు లేరు. కొన్ని చోట్ల అతిథి అధ్యాపకులు ఉన్నా... వేతనం తక్కువ అందుతుందని మధ్యలోనే ఆగిపోతున్నారు. గుత్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 400 మంది విద్యార్థులకు గాను ఏడుగురు మాత్రమే అధ్యాపకులు ఉన్నారు. ప్రిన్సిపల్ శాశ్వత ఉద్యోగి కాగా, మిగిలిన వారంతా ఒప్పంద, అతిథి అధ్యాపకులే కావడం గమనార్హం.

పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 180 మంది విద్యార్థులుంటే, 11 మంది అధ్యాపకులు ఉన్నారు. వారిలో పలువురు సొంత సబ్జెక్ట్‌తోపాటు ఇతర సబ్జెక్ట్‌లను బోధిస్తున్నారు. దీంతో పనిభారం పెరిగిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– రఘునాథ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఆర్ఐఓ

ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్నిచోట్ల అతిథి అధ్యాపకులను నియమించుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించాం. జోన్-4 ప్రకారం అధ్యాపకులను నియమించాలని కోరుతున్నాం. వాటి ద్వారానే భర్తీ చేస్తామని అధికారులు తెలిపారు.

# దుక్కులు చేసి.. దిక్కులు చూస్తూ..

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ ముందే రుతుపవనాలు ప్రవేశించాయి. భారీ వర్షమే కురిసింది. ఈసారి వానలు దండిగా కురుస్తాయని వాతావరణశాఖ సమాచారం చల్లని కబురు అందించింది. అన్నదాతల్లో ఆశలు రేకెత్తించాయి. పంటల సాగుకు సమాయాత్తం అయ్యే సమయానికి చినుకు జాడ లేకుండా పోయింది. ఇప్పటికే కార్తెలన్నీ కరిగిపోయాయి. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలవుతోంది. మేఘాలు ఊరిస్తున్నా చినుకు పడలేదు. జులై 15 దాటితే వేరుసెనగ విత్తు వేసిన దిగుబడి రాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నేలలు దున్ని.. విత్తనానికి పొలాలను సిద్ధం చేసుకున్న అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు.

**జూన్‌లో అధికం.. ఈనెలలో లోటు**

ఖరీఫ్ ప్రారంభం జూన్ నెలలో అత్యధిక వర్షం కురిసింది. జూలైలో లోటు వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలో గత జూన్ 14 నుంచి చినుకనేల పడలేదు. 36 రోజులు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయి. గాలి వేగం పెరిగింది. ఉన్న కొద్దిపాటి తేమ కూడా గాలితో తడి అరిపోతోంది. నేలలో పడిన విత్తు అరకొరగా మొలిచింది. కుందుర్పి, పెద్దపప్పూరు, అగళి మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. ః అనంతపురం జిల్లాలో గత నెలలో సాధారణ వర్షపాతం 61.0 మి.మీలకు గాను 142 మి.మీలు అత్యధికంగాను, జులైలో 63.9 మి.మీలకు గాను 15.5 మి.మీలు (ఈనెల 19వ తేదీ నాటికి) అత్పల్పంగా కురిసింది. జులైలో తక్కువ వర్షపాతం నమోదైంది.

శ్రీసత్యసాయి జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 66.6 మి.మీలకు గాను 148.9 మి.మీలు అత్యధిక వర్షం కురిసింది. జులైలో 70.9 మి.మీలకు గాను 34.4 మి.మీలు (ఈనెల 19 తేదీ నాటికి) అత్యల్పంగా వర్షం కురిసింది. అంటే జులైలో తక్కువ వర్షపాతమే నమోదయింది. జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వేరుసెనగ పంట ప్రధానం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 3,72,794 హెక్టార్లు కాగా, అందులో 74,899 హెక్టార్లు మాత్రమే సాగైంది. అనంతపురం జిల్లాలో 1,74,910 హెక్టార్లకు 26,665 హెక్టార్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 1,97,884 హెక్టార్లకు 48,234 హెక్టార్లలో వేరుసెనగ సాగైందని వ్యవసాయశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఖరీఫ్‌లో వేరుసెనగ విత్తనకాయలు రాయితీతో అనంతపురం జిల్లాలో 76,221 క్వింటాళ్లు 86,401 మంది రైతులకు, శ్రీసత్యసాయి జిల్లాలో 96,386 క్వింటాళ్లు 1,12,790 మంది రైతులకు పంపిణీ చేశారు. ఈనెలాఖరు వరకు వేచి చూడండి. ఒకవేళ వర్షం పడకపోతే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు అధికార వర్గాల సమాచారం. ఆగస్టులో తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలు జొన్న, కొర్ర, ఆముదం, ఉలవలు, పెసలు, అలసంద వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలం. ప్రత్యామ్నాయ పంటలకు ఏయే విత్తనాలు ఎంతెంత అవసరముందో నివేదికలు తయారు చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం.

**ఆగస్టు వరకు అవకాశం–** డాక్టర్ భార్గవి, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన కేంద్రం, రెడ్డిపల్లి వర్షాభావ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. అరకొర పదునులో విత్తనం రైతులు వేసుకోవద్దు. ఈ వారంలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సంకేతాలు ఇచ్చింది. ఈనెలాఖరు వరకు వేరుసెనగ పంట వేసుకోవచ్చు. ఆగస్టు మొదటి వారంలో కూడా వేరుసెనగ వేసుకోవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాల య శాస్త్రవేత్తలు సిఫార్సు చేశారు. వేరుసెనగలో అంతర పంటలుగా కంది, సజ్జ, కొర్రలు వేసుకుంటే మంచిది. ఆగస్టు 15 తర్వాత తక్కువ కాలంలో పండే కొర్ర, ఉలవలు, సజ్జ, జొన్న, ఆముదం పెసలు, అలసంద వంటి పంటలు వేసుకోవచ్చు.

# గుర్తించి, ప్రోత్సహిస్తే.. పతకాలు సాధిస్తాం



అనంతపురం : చదరంగంలో రారాజుగా ఎదగడానికి అనేక అవకాశాలున్నాయి. పుట్టిల్లు మనదేశమే అయినా నేడు ప్రపంచ దేశాల్లో ఈ ఆట ఆడేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అంతర్జాతీయ చదరంగ సమాఖ్య ఏటా జులై 20 తేదీని అంతర్జాతీయ చదరంగ దినోత్సవంగా నిర్వహిస్తారు. యునెస్కోచే ప్రతిపాదించిన తర్వాత 1966 నుంచి ఫిడే స్థాపన తర్వాత క్రమం తప్పకుండా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మన జిల్లాలో ఎంతోమంది చదరంగ ఆణిముత్యాలు ఉన్నారు. ప్రభుత్వపరంగా ఈ క్రీడకు పెద్దగా ప్రోత్సాహం ఉండటం లేదు. క్రీడాకారులు సొంత ఖర్చులతో సాధన చేస్తున్నారు. ఫిడే రేటింగ్‌లో పదుల సంఖ్యలో స్థానం సాధించి గుర్తింపు సాధించారు.

**అనంత అమ్మాయి అమెరికా పోటీల్లో..**

అనంతపురం నగరానికి చెందిన జి.అనన్య చదరంగంలో ప్రతిభ చాటుతోంది. అమెరికాలో జరిగిన పోటీల్లో సైతం రెండోస్థానం సాధించి ఔరా అనిపించింది. అమె అమెరికాలో జరిగిన ఓపెన్ చెస్ టోర్నీలో రజతం సాధించి జిల్లా పతాకను రెపరెపలాడించింది. బెంగళూరులో జరిగిన ఓపెన్ టోర్నీ ద్వారా ర్యాపిడ్ రేటింగ్‌లో స్థానం సాధించింది. ఈ బాలిక జాతీయస్థాయి పాఠశాల చెస్ క్రీడాపోటీల్లో సత్తాచాటింది. రాష్ట్రస్థాయి పోటీల్లో నంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. కర్నూలు, అనంతపురం, హిందూపురంలో జరిగిన పోటీల్లో కూడా రెండోస్థానం సాధించింది. ఆమె సోదరి అభిజ్ఞ కూడా చదరంగం క్రీడాకారిణి కావడం విశేషం. తల్లిదండ్రులు సురేష్‌కుమార్, హరిప్రియల ప్రోత్సాహంతో చదరంగంలో అనేక పతకాలు సాధించానని వెల్లడించింది. ప్రస్తుతం ఫిడే రేటింగ్ 1557లో ఉన్నానని ఈ రేటింగ్‌ను మరింత మెరుగు పరుచుకోవాలన్నదే నా లక్ష్యమంటూ ధీమా వ్యక్తం చేసింది.

**ప్రోత్సాహం కరవు**

– ఉదయ్‌కుమార్ నాయుడు, చెస్ సంఘం జిల్లా కార్యదర్శి

క్రీడకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు. ప్రభుత్వం తరఫున ఒక భవనం చాలా అవసరం. అనంత నగరంలోని పాత ఎమ్మార్వో కార్యాలయం చెంత చెట్లకిందనే ఆడుకునే పరిస్థితి ఉంది. ఎంతోమందికి ఆడాలనే ఆసక్తి, ఉత్సాహం ఉన్నా కనీస వసతి లేక తమ నైపుణ్యాన్ని చాటుకోలేకపోతున్నారు. భవన సదుపాయం లేక టోర్నీలు నిర్వహించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ స్థలంలో చిన్న గది ఏర్పాటు చేసినా క్రీడాకారులను ప్రోత్సహించినట్లు అవుతుంది. ఫిడే రేటింగ్‌లో స్థానం సాధించిన వారికి ప్రభుత్వం తరఫున ల్యాప్‌టాప్‌లో అందిస్తే గ్రాండ్‌మాస్టర్లుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం తరఫున ఒక శిక్షకుడిని నియమిస్తే క్రీడాకారులకు ఖర్చులు తగ్గుతాయి. అన్ని క్రీడలతో సమానంగా చెస్ క్రీడకు కూడా ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి.

**లేత వయసు నుంచే పతకాల వేట**

అనంతపురం నగరానికి చెందిన ఎం.శ్రీసాకేత్ 9 ఏళ్ల వయసు నుంచే పతకాల వేట మొదలెట్టాడు. తొలిసారిగా పట్నాలో జరిగిన అండర్-9 పోటీల్లో ప్రాతినిథ్యం వహించాడు. మరోసారి అదే విభాగంలో కాంస్యం సాధించాడు. ఫిడే రేటింగ్ చెస్ పోటీల్లో అండర్-10 విభాగంలో ఆరోస్థానం సాధించాడు. మస్తానయ్య అంతర్జాతీయ అఖిల భారత చెస్ పోటీల్లో రెండోస్థానం సాధించాడు. ఈ అబ్బాయి క్లాసికల్ రేటింగ్ 1,463. ఈ రేటింగ్‌ను మరింత మెరుగు పరుచుకుని గ్రాండ్‌మాస్టర్‌గా ఎదగాలన్నదే అతని ఆశయం.

**కళాజ్యోతి.. రాష్ట్రంలోనే ప్రత్యేకం**

రాష్ట్రంలోనే ధర్మవరం కళాజ్యోతి చెస్‌కు పెట్టింది పేరు. 1950లో కలవల అశ్వర్థనారాయణ, సత్రసాల వేణుగోపాల్, హుస్సేన్‌సాబ్‌లు కళాజ్యోతిలో చదరంగ సాధన ప్రారంభించి ప్రోత్సహించారు. ఫలితంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ధర్మవరం క్రీడాకారులు రాణిస్తున్నారు. 74 ఏళ్లుగా ఇక్కడ చెస్ ప్రస్థానం కొనసాగుతోంది. పట్టు సాధించిన క్రీడాకారుడు.. మరి కొందరికి ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన 20 మంది అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణిస్తున్నారు. ఆర్బిటర్స్ (అంపైర్స్) పరీక్షల్లోనూ ఉత్తీర్ణులయ్యారు. ఎక్కడ పోటీలు నిర్వహించినా ధర్మవరం క్రీడాకారులే రాణిస్తున్నారు. కళాజ్యోతి ఆడిటోరియంలో ఫిడే రేటింగ్ టోర్నీ రెండు సార్లు నిర్వహించారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీలు జరిపారు. వేసవిలో ఉచిత శిక్షణ నిర్వహించి విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికితీస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులు కళాజ్యోతిలో రోజూ చదరంగం ఆడుతూ.. యువకులకు, విద్యార్థులకు సాధన చేయిస్తున్నారు.

**60 ఏళ్లుగా ఆడుతున్నాం..–** శింగనమల రామకృష్ణ, కళాజ్యోతి ఉపాధ్యక్షుడు నేను 8 ఏళ్ల వయసులో చదరంగం నేర్చుకునేందుకు మొదటిసారిగా ధర్మవరం కళాజ్యోతికి వచ్చాను. నా వయసు ఇప్పుడు 78 ఏళ్లు. చదరంగంలో 70 ఏళ్లుగా ఎన్నో మెలకువలు నేర్చుకున్నా. చెస్‌పై ఆసక్తి ఉన్న వారందరినీ ప్రోత్సహిస్తూ మంచి క్రీడాకారులుగా రాణించేలా నా వంతుగా సహకారం అందిస్తున్నా. రోజూ కళాజ్యోతిలో కాసేపు అయినా చదరంగం ఆడితేనే నా మనసు ప్రశాంతంగా ఉంటుంది. వందలాది మంది క్రీడాకారులను తయారుచేసి పంపడం ఎంతో సంతృప్తినిస్తోంది.

# నకిలీ పట్టాలతో ప్రభుత్వ స్థలాలు కబ్జా



గుత్తి : గుత్తిలో ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తూ కొందరు రూ.కోట్లు విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారు. నకిలీ ఇంటి పట్టాలను సృష్టిస్తూ.. ప్రజలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బోగస్ పట్టాలతో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. ఈభూదందా గత వైకాపా ప్రభుత్వం నుంచి యథేచ్ఛగా సాగుతోంది. గుత్తి పురపాలికలో నివాస స్థలాలకు డిమాండు పెరుగుతోంది. పట్టణం చుట్టూ వెంచర్లు వెలుస్తున్నాయి. తొలుత రాజకీయ అండదండలున్న గల్లీ లీడర్లు ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ ఉద్యోగుల సహకార్యతో గుర్తిస్తారు. వెంటనే లేఅవుట్‌లు వేస్తున్నారు. ఎలాంటి హక్కులు లేకున్నా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారు. ప్రజలకు ప్లాట్లు వేసి విక్రయించి వారికి నకిలీ పట్టాలు అంటగడుతున్నారు. సెంటున్నర ప్లాటును రూ.లక్షకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాయకుల భూదందాకు ప్రజాప్రతినిధుల మద్దతు ఉంటోంది. చోటా నాయకులతో 5 నెలల కిందట వరకు అధికారంలో ఉన్న వైకాపా ప్రజాప్రతినిధుల బంధువులు వాటాలు పొందుతూ వచ్చారు. ప్రజల సామూహిక అవసరాలకు సర్కారు స్థలాలు లేకుండా నాయకులు కాజేశారు. రూ.కోట్లు విలువైన స్థలాలు చేతులు మారుతున్నాయి.

**ఎక్కడ.. ఎలాగంటే?**

గుత్తి శివారులోని సర్వేనంబర్ 609లో పదేళ్ల కిందట ప్రభుత్వం సుమారు 600 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చింది. మిగిలిన సుమారు 3 ఎకరాల స్థలంలో ఓపార్టీ నాయకులు ప్రజలతో డబ్బులు దండుకుని ఇళ్లను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగాయి. నాయకులు ఒక్కొక్కరితో రూ.2 వేల వరకు తీసుకుని నకిలీ పట్టాలిచ్చారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఆరునెలల కిందట విచారణకు వీఆర్‌వోలను నియమించారు. ఇప్పటికీ విచారణ పూర్తవ్వలేదు.

వీరారెడ్డికాలనీకి ఆనుకుని ఉన్న సర్వేనంబర్ 612-బీలో 2.14 ఎకరాల ప్రభుత్వ భూమి పరులపాలవుతోంది. 105 మందితో రూ.10 వేలు చొప్పున వైకాపా నాయకులు వసూలు చేసుకుని నకిలీ పట్టాలు సృష్టించి నాలుగు రోజుల కిందట ప్రజలకు ఇచ్చారు. ఈ విషయమై దళిత వాడకు చెందిన కొందరు తహసీల్దారు భారతికి ఫిర్యాదు చేశారు. నేమితాబాదు గ్రామానికి వెళ్లే మార్గంలో అసైన్డ్‌భూమి సర్వేనంబర్ 703లో కొందరు వైకాపా చోటానాయకులు వెంచర్ వేసి ప్రజలతో రూ.80 వేలు ప్రకారం పట్టాకు వసూలు చేసి సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు 8నెలల కిందట ప్లాట్ల హద్దురాళ్లను తొలగించారు. గుత్తికి ఆనుకుని ఉన్న రూ.కోట్లు విలువైన ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 727లో ఓ సామాజిక వర్గం వారు సుమారు 30 మంది నకిలీ పట్టాలతో పునాదులు వేశారు. మరో నాయకుడు తమ సామాజికవర్గం వారికి సుమారు 100 నకిలీ పట్టాలు ఇప్పించాడు. కొత్తపేటలో సర్వేనంబర్ 431లో ఓ వైకాపా నాయకుడు ఎకరా ప్రభుత్వ భూమిలో ప్లాట్లు వేశాడు. నకిలీ పట్టాలతో స్థలాలను విక్రయించాడు. ఇక్కడ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వాటిని అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులకు తమ వద్ద పట్టాలు ఉన్నట్లు బుకాయిస్తున్నారు. పట్టణంలో ఇద్దరు యువకులు నకిలీ పట్టాలు సృష్టిస్తున్నారు. తహసీల్దార్ల ఫోర్జరీ సంతకాలతో పట్టాలను తయారు చేస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం –** శ్రీనివాసులురెడ్డి, ఆర్డీవో, గుంతకల్లు గుత్తిలో నకిలీ పట్టాల సృష్టిపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. నకిలీ పట్టాలతో కొందరు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వ్యవహారంపై విచారణ చేస్తాం. తహసీల్దారుతో నకిలీ పట్టాలు, స్థలాల ఆక్రమణలు, విక్రయాలపై చర్చిస్తాం. అవసరమైతే స్వయంగా వెళ్లి భూదందాపై చర్యలు తీసుకుంటాం.

# పరిశ్రమల మూత.. రైతులకు గుండెకోత



పుత్తూరు : మామిడి రైతులకు ఏటికేడు గడ్డు పరిస్థితులు పెరుగుతున్నాయి. పంట ఉత్పత్తి ఎలా ఉన్నా గత ఐదేళ్లలో ఆశించిన ధరలు రాలేదు. మరో ఉపద్రవం చాప కింద నీరులా చేరింది. గుజ్జు పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూత పడ్డాయి. మొత్తంగా 80 ఉండాల్సిన పరిశ్రమలు ప్రస్తుతం 30కి చేరాయి. వీటిలోనూ మిణుకుమిణుకుమంటున్నవీ ఉన్నాయి. పరిశ్రమలుంటేనే ధర అంతంత మాత్రం కావడం.. జిల్లాలోని పరిశ్రమల్లో భారీ మొత్తంలో మామిడి గుజ్జు పేరుకుపోవడంతో రానున్న కాలంలో తమ పరిస్థితి ప్రశ్నార్థకం కానుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 85 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. జిల్లాలో మామిడి గుజ్జు ఇప్పుడు 30 పరిశ్రమల్లోనే తయారవుతోంది. వీటిలో అధికంగా తోతాపురి, రుమాని, నీలం రకాల పండ్లతో గుజ్జు తయారుచేస్తారు. పంట దిగుబడి అధికంగా ఉండి, ధరలు వారికి అనుకూలంగా ఉంటే నాలుగు లక్షల టన్నుల గుజ్జు తయారై అధికంగా గల్ఫ్ దేశాలు, ఉత్తర భారత దేశానికి ఎగుమతి అవుతోంది. గతేడాది నుంచి గల్ఫ్ దేశాలు ట్యాక్స్ పెంచడంతోపాటు ఆర్డర్లు తగ్గించాయి. ఈ క్రమంలో గతేడాది, ఈ ఏడాది మొత్తంగా జిల్లాలో 3.5 లక్షల టన్నుల గుజ్జు నిల్వ చేరింది. ఈ క్రమంలో ఎగుమతులు లేకపోవడం, మామిడి కాయల ధర పెరగడంతో ఈ ఏడాది అనేకమంది ముందుగానే పరిశ్రమలు మూసివేయడం గమనార్హం.

తగ్గిన కొనుగోళ్లు

వర్షాల కారణంగా, మంచి ధర వస్తుందని పశ్చిమ మండలాల్లో కొందరు రైతులు ఇంకా కాయలు కోయలేదు. వర్షాలతో కాయల్లో పురుగుల ఉద్ధృతి పెరగడంతో వ్యాపారులు కొనుగోళ్లు తగ్గించారు. ఈ క్రమంలో గుజ్జు పరిశ్రమలు మూసివేయడంతో ఆందోళన చెందుతున్నారు.

# అ'చ్చెరువు' చెందే కథ

సూళ్లూరుపేట : జాతీయ రహదారి పక్కన విలువైన ప్రభుత్వ భూములున్నాయి. రెవెన్యూ దస్త్రాల్లో చెరువుగా నమోదై ఉంది. ఇక్కడ ఎకరా రూ.కోటి పైమాటే. పేదల ఆధీనంలో ఉన్న ఆ భూములపై ఎప్పటి నుంచో పలువురు కన్నేశారు. ఇందుకుగాను జలవనరుల శాఖలోనే దస్త్రాలను మార్పు చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగ విరమణ చేసిన ఓ డీఈఈ పేరిట ఆ భూములు తమ పరిధిలో లేవంటూ లేఖ సృష్టించారు. ఆ మేరకు ఫైళ్లను సైతం కదిలించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ భూముల చుట్టూ పరిశ్రమలు, స్థిరాస్తి క్షేత్రాలు ఏర్పాటు కావడంతో అమాంతం విలువలు పెరిగాయి. దీనిని కాజేసేందుకు పలువురు యత్నిస్తున్నారు. సూళ్లూరుపేటకు కూతవేటు దూరంలో కోల్‌కతా-చెన్నై 16వ నంబరు జాతీయ రహదారి పక్కన పడమటి కండ్రిగ చెరువు ఉండేది. సర్వే నంబరు 33లో 69.30 ఎకరాల మేర విస్తరించినట్లు రెవెన్యూ దస్త్రాల్లో పేర్కొన్నారు. కాలక్రమేణా కనుమరుగై ప్రస్తుతం పొలాలుగా మారాయి. వీటిని సమీప గ్రామాల పేదలు సాగు చేసుకుంటుండగా పట్టాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. నిబంధనల




మేరకు ఇచ్చేందుకు లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈ భూములపై కన్నేసిన కొందరు..మొదట పేదల పేరిట పట్టాలు ఇప్పించి, తర్వాత ఏదోలా కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నారు.

**ఉద్యోగ విరమణ చేసిన మూడేళ్లకు**

పడమటికండ్రిగ చెరువు తమ పరిధిలో లేదని, అక్కడ చెరువే లేదని జల వనరులశాఖ డీఈఈ జె.మునీంద్రబాబు 2009 సెప్టెంబరులో స్థానిక తహసీల్దార్‌కు లేఖ రాసినట్లు సమాచారం. చెరువు లేనందున ఆ భూములను ఎవరికైనా ఇచ్చేందుకు తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఆ మేరకు జల వనరుల శాఖ ఫైళ్లు కదలించింది. మునీంద్రబాబు అప్పటికి మూడేళ్ల ముందే ఉద్యోగ విరమణ చేశారు. సూళ్లూరుపేట జలవనరుల శాఖ సబ్ డివిజన్ పరిధిలో డీఈఈగా దయాకర్‌రెడ్డి బదిలీ తర్వాత ఆ స్థానంలో జె.మునీంద్రబాబు సూళ్లూరుపేటలో 1999లో విధుల్లో చేరి, ఇదే కార్యాలయంలోనే 2006 జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన తర్వాత కొన్ని రోజులు రమణారెడ్డి విధులు నిర్వహించారు. ఈలోగా వెంకటయ్య రెగ్యులర్ డీఈఈగా ఇక్కడకు బదిలీపై వచ్చి, బాధ్యతలు చేపట్టారు. అయితే మునీంద్రబాబు 2006లో ఉద్యోగ విరమణ చేస్తే.. ఆయన పేరు మీద 2009లో ఏ విధంగా లేఖ రెవెన్యూ శాఖకు పంపారో తెలియని విషయం. ఆ లేఖ నకలు ప్రస్తుతం జల వనరులశాఖ కార్యాలయంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే లేఖలోని సారాంశాన్ని పొందుపరుస్తూ 2014 మార్చిలో అప్పటి జల వనరుల శాఖ డీఈఈ మధు సూళ్లూరుపేట సమీపంలోని పడమటికండ్రిగ గ్రామంలోని చెరువు పోరంబోకు భూములకు పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదంటూ తహసీల్దార్‌కు నివేదిక పంపారు. అందులో అప్పటి ఏఈఈ క్షేత్రస్థాయిలో పరిశీలించి, తెలిపినట్లు లేఖలో పేర్కొన్నారు.

**దస్త్రాల్లో లేదు**

పడమటికండ్రిగ చెరువుకు సంబంధించిన వివరాలు జల వనరుల శాఖ కార్యాలయ రికార్డుల్లో లేవు. ఎక్కడైనా నీటి వనరులు ఉంటే మేం సంరక్షించాల్సి ఉంది. ప్రస్తుతం పడమటికండ్రిగ చెరువుగా లేదు. అక్కడ పొలాలున్నాయి.ఎంవీ ఠాగూర్, జల వనరుల శాఖ ఏఈ

# ఆదర్శం.. ఐఐటీ ఆరోహణ

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ ఏర్పడిన అనతి కాలంలోనే మొదటి తరం ఐఐటీలతో పోటీ పడుతూ ఆదర్శవంతమైన అభివృద్ధి సాధించింది. 2015లో అద్దె భవనాల్లో ప్రారంభమైనప్పటికీ అతి తక్కువ కాలంలోనే ఏర్పేడు సమీపంలో 548 ఎకరాల్లో నూతన సాంకేతిక హంగులతో 12 వేల మంది విద్యార్థులకు సరిపడా అందమైన ప్రాంగణంలో అడుగుపెట్టింది. వివిధ పరిశోధనలు, సాంకేతిక ఒప్పందాలతో వేగంగా దూసుకుపోతున్న ఈ మూడో తరం ఐఐటీని ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది ఫిబ్రవరిలో జాతికి అంకితం చేయడం గమనార్హం. ఆరో స్నాతకోత్సవంలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ విద్యార్థులు 313 మంది ఐఐటీయన్లుగా పట్టాలు పొందనున్నారు.

**సాంకేతిక పరిశోధనలు, ఒప్పందాలు**

తిరుపతి ఐఐటీ ఏర్పడినప్పటి నుంచి ఆచార్యులు, విద్యార్థులు వివిధ సాంకేతిక పరిశోధనలు జరపడంతో పాటు, వివిధ పరిశ్రమలు, అంతర్జాతీయ విద్యా సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే 203 ప్రాయోజిత ప్రాజెక్టులతో పాటు పారిశ్రామిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీటిలో ప్రధానంగా హిందుస్థాన్ షిప్ యార్డు, డీఆర్‌డీవో, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ బోర్డు(ఎస్ఈఆర్ఈ), ఎంఓఈఎస్, యూఎన్‌డీపీ ఫారెస్ట్, క్లైమెంట్ ఛేంజ్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్, టీవీఎస్ మోటారు కంపెనీ వంటి ప్రముఖ సంస్థలతో సాంకేతిక ఒప్పందాలను పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. వివిధ అంశాలపై 177 పరిశోధన ప్రాజెక్టులు, 185 పరిశ్రమలతో పాటు అంతర్జాతీయ విద్యా సంస్థలు, ప్రయోగశాలలతో 50 ఒప్పందాలను చేసుకోవడంతో ఏఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో ఐఐటీ 56వ స్థానంలో నిలవడం గమనార్హం.

**ఆలోచించేలా.. ఆకర్షించేలా**

ఐఐటీ స్నాతకోత్సవంలో పట్టభద్రులైన విద్యార్థులతో పాటు ఆచార్యులు ధరించే వస్త్రాలు ఆకర్షింపజేయడంతో పాటు ఆలోచించేలా ఉన్నాయి. చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(ఎన్ఐఎఫ్‌టీ) సహకారంలో ఈ వస్త్రాలను తయారు చేశారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళాకారులు తయారు చేసిన ఎరుపు, నలుపు రంగుల చుక్క, రేఖలు కలిగి ఉండటంతో విద్యార్థి నేర్చుకున్న విజ్ఞానం రూపాంతరం చెంది వ్యక్తి శక్తిగా మారడాన్ని తెలియజేస్తోంది. అదేవిధంగా తిరుపతి ఐఐటీని త్రినేత్రం కలిగి ఉండటంతో పాటు ముగ్గురు గురు, శిష్యుల మధ్య జరిగే సంభాషణ(గురుకులం) జ్ఞానాన్ని బోధించే విధంగా నిక్షిప్తం చేయడం విశేషం.

నిఘానేత్రం



# టెన్నిస్ డ్రెస్సులో ఐషా పాప.. హై గ్లామర్ డోస్

చిరుత సినిమాలో నటించిన నేహా శర్మని ఎవ్వరు అంత ఈజీగా మర్చిపోరు. మొదటి సినిమాతోనే నేహా శర్మ అటు గ్లామర్, ఇటు నటనతో మెప్పించింది. తరువాత నేహా శర్మకి తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రాలేదు. బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అక్కడ అడపాదడపా సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తోంది. ఇక నేహా శర్మ చెల్లెలు ఐషా శర్మ కూడా అక్క దారిలోనే నటిగా బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. మోడల్ గా కెరియర్ స్టార్ట్ చేసిన ఐషా శర్మ తరువాత 2018లో జాన్ అబ్రహం హీరోగా తెరకెక్కిన సత్యమేవ జయతే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఆ మూవీతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే తరువాత ఐషా శర్మకి పెద్దగా




అవకాశాలు రాలేదు. 2022లో షైనింగ్ విత్ సర్మాస్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటించింది. అలాగే ఇప్పటి వరకు మూడు మ్యూజిక్ వీడియోస్ లలో కూడా ఈమె సందడి చేసింది. హీరోయిన్ గా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోయిన ఐషా శర్మ సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటోంది. ఇన్ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా ఫోటోలని, అప్డేట్స్ ని షేర్ చేస్తూ ఉంటుంది. ఈ బ్యూటీకి ఇన్ స్టాగ్రామ్ లో 6.8 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే ఎలాంటి ఫోటోలని షేర్ చేసిన లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. అక్క నేహా శర్మ ఇన్ ఫ్ల్యూయెన్స్ ఐషా శర్మ మీద ఎక్కువగానే ఉన్నట్లు కనిపిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు గ్లామర్ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో ఈ బ్యూటీ షేర్ చేస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా టెన్నిస్ కోర్టులో టెన్నిస్ స్పోర్ట్స్ స్టార్స్ వేసే స్కర్ట్, జాకెట్ తో ఐషా శర్మ ఫోటోలకి ఫోజులిచ్చింది. ఈ ఫొటోస్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ కాస్ట్యూమ్స్ తో ఐషా శర్మ అచ్చం టెన్నిస్ స్పోర్ట్స్ గర్ల్ లా ఉందనే కామెంట్స్ నెటిజన్ల నుంచి వినిపిస్తున్నాయి.

# అటువంటి పాత్రలకే రెడీ అంటున్న దేవర బ్యూటీ..

అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా కొనసాగుతోంది. ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంలో హీరోయిన్గా తెలుగు తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సినిమా విడుదలకు ముందే మెగా పవర్ స్టార్ పక్కన మరొక సినిమాకి చాన్స్ కొట్టేసింది. తాజాగా ఆమె నటించిన 'ఉలఝ్'మూవీ ఆగస్టు రెండున ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ తనకు నచ్చిన సినిమాల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. తన జీవితంలో సవాలతో కూడిన పాత్రలకు ప్రాధాన్యత ఇస్తానని ఈ బ్యూటీ కుండ బద్దలు కొట్టి చెప్పేసింది.. అంతేకాదు ఆమె జీవితమంతా నటనకే అంకితం అంటూ తొలి సినిమా నుంచి ఇప్పటివరకు ఎన్నో విషయాలు నేర్చుకుంటూ అంచలంచలుగా ముందుకు వెళ్తున్నాను అని స్పష్టం చేసింది. అందరిలాగా గ్లామర్ తో కూడిన కమర్షియల్ సినిమాలు చేస్తోంది.. మరోపక్క లేడీ ఓరియంటెడ్ పెక్యులర్ మూవీస్ కి కూడా సిద్ధంగా ఉంది. కమర్షియల్ సినిమాలు ,గ్లామర్ షోలు అతి తక్కువ సమయంలో విజయాన్ని తీసుకువస్తాయి. కానీ రిస్క్ తో



కూడిన పాత్రలు చేస్తేనే కదా మనం ఏంటో తెలుస్తుంది అంటుంది ఈ బ్యూటీ. 'రిస్క్ తో కూడిన పాత్రలో ఉన్న సినిమాలలో నా నటన చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోవాలి అని భావిస్తాను. అందుకే చిన్న సినిమాలనే ఎంచుకుంటున్నాను. ప్రతి సినిమాలో దర్శకుడు నా నుంచి ఏమి కోరుకుంటారో అది 100% ఇవ్వడానికి ప్రయత్నిస్తాను.. ఇప్పటివరకు నేను నా కెరీర్లో రెండు హైరిస్క్ సినిమాలను ఎంచుకున్నాను.. వాటిలో విడుదల కాబోతున్న 'ఉలఝ్' ఒకటి. ఈ మూవీ ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.'అని ఈ బ్యూటీ ఇంటర్వ్యూలో చెప్పింది. నిన్న మొన్నటి వరకు దేవర షూటింగ్లో చాలా బిజీగా ఉన్న జాన్వీ.. ప్రస్తుతం తన సరికొత్త మూవీ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బాలీవుడ్ నుంచి దేశభక్తి చిత్రాలు విడుదలవుతూ ఉంటాయి. జాన్వీ నటించిన 'ఉలఝ్'మూవీ కూడా దేశభక్తి కథాంశం తో సాగుతుంది. ఇండియన్ ఫారెన్ సర్వీస్ నేపథ్యంలో సాగే ఒక థ్రిల్లర్ మూవీ గా ఇది ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ చిత్రంపై అంచనాలను బాగా పెంచింది.




# ప్రభాస్ - ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్!



టాలీవుడ్ స్టార్ హీరోలంతా ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. నేషనల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకొని, మార్కెట్ విస్తరించుకోడానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభాస్, అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి హీరోలు పాన్ ఇండియన్ స్టార్ డమ్ అందుకున్నారు. అయితే వీరిలో నిజమైన పాన్ ఇండియా స్టార్ ఎవరనే విషయం మీద సోషల్ మీడియాలో తరచుగా ఫ్యాన్ వార్స్ జరుగుతూ ఉంటాయి. మిగతా హీరోలంతా డైరెక్టర్ ఎస్. ఎస్. రాజమౌళి అండతో స్టార్ డమ్ సాధించారని, ఆయన సపోర్ట్ లేకుండానే 'పుష్ప'తో సత్తా చాటిన బన్నీనే ఒరిజినల్ పాన్ ఇండియా స్టార్ అని ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ కామెంట్లు చేస్తుంటారు. RRR సినిమాతో గ్లోబల్ ఆడియెన్స్ దృష్టిని ఆకర్షించడమే కాదు, భారతీయ చిత్ర పరిశ్రమకు వందేళ్ల నాటి ఆస్కార్ అవార్డ్ కలను సాకారం చేసిన పెట్టిన ఎన్టీఆర్, రామ్ చరణ్ లు అసలైన పాన్ ఇండియా స్టార్స్ అని వాళ్ళ అభిమానులు అంటుంటారు. 'బాహుబలి' చిత్రంతో తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్ళి, పాన్ ఇండియాకి బాటలు వేసిందే ప్రభాస్ అని డార్లింగ్ ఫ్యాన్స్ అభిప్రాయ పడుతుంటారు. 'బాహుబలి 2' తో ఆయన క్రియేట్ చేసిన రికార్డులను ఇప్పటికీ ఎవరూ అందుకోలేకపోతున్నారని, 'కల్కి' మూవీతో రాజమౌళి మద్దతు లేకుండానే ?1000 కోట్లు కొట్టి చూపించాడని కామెంట్లు చేస్తుంటారు. అంతేకాదు ప్రభాస్ ఒక్కడే తన క్రేజ్ ను కాపాడుకునేలా సినిమాలు చేస్తున్నారని, బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ తో ఇండస్ట్రీని కాపాడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

నిజానికి ప్రభాస్ నుంచి గత రెండేళ్లలో నాలుగు పాన్ ఇండియా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిల్లో 'సలార్ 1', 'కల్కి 2898 AD' సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్టయితే, 'రాధే శ్యామ్' 'ఆదిపురుష్' చిత్రాలు ఫ్లాప్ అయ్యాయి. అదే సమయంలో 'పుష్ప: ది రైజ్' తర్వాత అల్లు అర్జున్ ఒక్కటంటే ఒక్క సినిమా కూడా రాలేదు. ఈ ఏడాది డిసెంబర్ లో 'పుష్ప: ది రూల్' రిలీజ్ అవుతుంది. అంటే బన్నీ నుంచి దాదాపు మూడేళ్ళకు ఇంకో సినిమా వచ్చినట్లు అవుతుంది. అలానే RRR తర్వాత ఎన్టీఆర్ నుంచి మరో మూవీ రాలేదు. రామ్ చరణ్ మాత్రం 'ఆచార్య' వంటి మల్టీస్టారర్ లో నటించారు కానీ, సోలోగా ఒక్క మూవీ కూడా రిలీజ్ చెయ్యలేదు. ఈ విధంగా వర్క్ విషయంలో కంపేర్ చేసి చూస్తే, ప్రభాస్ మిగతా హీరోల కంటే ముందున్నారని చెప్పాలి. పర్ఫెక్ట్ గా ప్లానింగ్ చేసుకొని సినిమాలు పూర్తి చేస్తున్నారు.. అనుకున్న సమయానికి వాటిని విడుదల చేస్తున్నారు. మరికొన్ని ప్రాజెక్ట్స్ ను లైన్ లో పెడుతున్నారు. రిజల్ట్ ఎలా ఉందనేది పక్కన పెడితే, పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వడం వల్ల రెవెన్యూ జెనరేట్ అవుతుంది. ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ దగ్గర నుంచి థియేటర్ క్యాంటీన్ల వరకూ అందరూ లాభ పడతారు. అదే జరిగితే ఇండస్ట్రీ కళకళలాడుతుంది. ఇటీవల 'కల్కి' సినిమా వల్ల కరెంట్ బిల్లులు కట్టుకోలేని స్థితికి వెళ్లిపోయిన ఎన్నో థియేటర్లను రీ ఓపెన్ చేశారు. మంచి విజయం సాధించడంతో సినిమాతో సంబంధం ఉన్న పార్టీలన్నీ లాభ పడ్డాయి. కాబట్టి వరుసగా నాలుగు సినిమాలను విడుదల చేసిన ప్రభాసే ఇప్పటికి నిజమైన 'పాన్ ఇండియా స్టార్' అనుకోవచ్చు.

# గేమ్ ఛేంజర్.. 'కియారా' కెవ్వు కేక!




ప్రామిసింగ్ యాక్ట్రెస్ గా సక్సెస్ ఫుల్ సినిమాలతో దూసుకుపోతున్న హీరోయిన్ కియారా అద్వాణీకి సూపర్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం ఫగ్లీ మూవీతో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ముద్దుగుమ్మ. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు భరత్ నేను మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు అటు హిందీ.. ఇటు తెలుగులో బిజీ బిజీగా గడుపుతోంది. మ్యారేజ్ అయ్యాక వచ్చిన అవకాశాలు అన్నీ అందుకుని ప్రాజెక్టులపై సైన్ చేస్తోంది కియారా. గత ఏడాది సత్యప్రేమ్ కి కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కియారా.. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న వార్-2లో నటిస్తోంది. ఇక సౌత్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ లో యాక్ట్ చేస్తోంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ బ్లాక్ బస్టర్ హిట్ మూవీ సలార్ సీక్వెల్ లో నటించనుందట. స్పెషల్ సాంగ్ తోపాటు కీలక పాత్రలో కనిపించనుందని టాక్ వినిపిస్తోంది. అయితే నేడు కియారా బర్త్ డే. దీంతో సోషల్ మీడియాలో ఆమెకు విషెస్ వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో గేమ్ ఛేంజర్ మేకర్స్.. కియారాకు పుట్టినరోజు విషెస్ తెలిపారు. "గేమ్ ఛేంజర్ టీమ్ తరపున జాబిలమ్మ కియారా అద్వాణీకి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆమె వైబ్రంట్ ఎనర్జీ త్వరలో మీ హృదయాలను మంత్రముగ్ధులను చేస్తుంది" అని ట్వీట్ చేశారు. దాంతోపాటు స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అయితే పోస్టర్ లో శంకర్ మార్క్ క్లారిటీగా కనిపిస్తుందనే చెప్పాలి. క్రేజీ లెహంగా వేసుకున్న కియారా చాలా అందంగా కనిపిస్తోంది. డ్రెస్సింగ్ అదిరిపోయింది. బ్యాక్ గ్రౌండ్ లోని విజువల్స్.. సూపర్ గా ఉన్నాయి. ఇప్పటికే గేమ్ ఛేంజర్ నుంచి రిలీజ్ అయిన జరగండి సాంగ్ లోని స్టిల్ నే మేకర్స్ విడుదల చేశారు. రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా కొన్ని రోజుల క్రితమే మేకర్స్ రిలీజ్ చేసిన జరగండి పాట.. మాస్ ఆడియన్స్ ను ఆకట్టుకుంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందించగా.. ఈ మూవీని దిల్ రాజు ప్రొడ్యూస్ చేస్తున్నారు. అయితే గేమ్ ఛేంజర్ మూవీ రిలీజ్ డేట్ కోసం ఇప్పుడు అంతా వెయిట్ చేస్తున్నారు. అక్టోబర్ లో రిలీజ్ అవుతుందని అంతా భావించినా.. ఇటీవల దిల్ రాజు క్రిస్మస్ కు కలుద్దామంటూ హింట్ ఇచ్చారు. దీంతో డిసెంబర్ 25వ తేదీన గేమ్ ఛేంజర్ విడుదల అవ్వనుందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే రామ్ చరణ్ తన పార్ట్ కంప్లీట్ చేసుకోగా.. కొద్ది రోజుల్లో షూటింగ్ మొత్తం పూర్తి కానుంది. అయితే సౌత్ లో సత్తా చాటాలనుకుంటున్న కియారా ఈ సినిమాతో ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి.

# టాలీవుడ్ కి ఏం కావాలో తెలుసుకుని వచ్చినట్టుంది !

టాలీవుడ్ లో సక్సెస్ అవ్వడం అంటూ జరిగింది అంటే ఆ హీరోయిన్ కి పాన్ ఇండియా రేంజ్ రావడం పక్కా.. ఎక్కడ నంచి వచ్చినా సరే తెలుగులో స్టార్ సినిమా ఛాన్స్ అందుకుంటుంది అంటే చిన్నగా ఆ హీరోయిన్ సౌత్ లో టాప్ ప్లేస్ కి వెళ్తుంది. అక్కడ నుంచి బాలీవుడ్ లో కూడా ఛాన్సులు అందుకుంటుంది. అందుకే హీరోయిన్స్ అంతా కూడా టాలీవుడ్ ఆఫర్ అనగానే మరో మాట మాట్లాడకుండా ఓకే చేస్తారు. ఈ క్రమంలో కరెక్ట్ గా టాలీవుడ్ లో ఎలా ఉండాలి.. ఇక్కడ ఆడియన్స్ కు ఏం కావాలి అని తెలుసుకుని మరీ అడుగు పెట్టింది భాగ్య శ్రీ బోర్స్. రవితేజ లాంటి హీరో సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ అంటే అది చాలా లక్కీ అన్నట్టే లెక్క. అది కూడా హరీష్ శంకర్ లాంటి డైరెక్టర్ సినిమా అంటే ఇక నో డౌట్ అన్నట్టే. తన సినిమాలో నటించిన హీరోయిన్స్ కి మంచి లైఫ్ ఇస్తూ వారి ఇమేజ్ డబుల్ అయ్యేలా చేస్తాడు హరీష్ శంకర్. అలాంటి హరీష్ శంకర్ డైరెక్షన్ లో మాస్ రాజా రవితేజ హీరోగా చేస్తున్న సినిమాతో తెలుగు తెరకు పరిచయమవుతుంది భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో రెండు



ప్రాజెక్ట్ లు చేసి సందడి చేసిన అమ్మడు టాలీవుడ్ నుంచి ఆఫర్ అనగానే నెక్స్ట్ థాట్ లేకుండా ఓకే చెప్పేసింది. తెలుగులో మాస్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్స్ కు మంచి పాపులారిటీ ఉంటుంది. మిస్టర్ బచ్చన్ తో యాక్టింగ్ తో ఇంప్రెస్ చేస్తూనే గ్లామర్ విషయంలో కూడా తగ్గలేదనిపిస్తుంది భాగ్య శ్రీ బోర్స్. హరీష్ టేకింగ్ భాగ్య శ్రీ అందాలు రవితేజ మాస్ మేనియా ఇది చాలు ఆడియన్స్ పండగ చేసుకుంటారు. ఈమధ్యనే మిస్టర్ బచ్చన్ టీజర్ రిలీజ్ టైం లో డ్యాన్స్ తో కూడా ఆడియన్స్ ని మెప్పించే ప్రయత్నం చేసింది భాగ్య శ్రీ. సో ఇక్కడ తన కెరీర్ సెట్ చేసుకోవాలని గట్టిగా ఫిక్స్ అయ్యే అమ్మడు వచ్చిందని ఆమె చేస్తున్న యాక్టివిటీస్ వల్ల తెలుస్తుంది. మిస్టర్ బచ్చన్ సెట్స్ మీద ఉండగానే విజయ్ దేవరకొండతో ఛాన్స్ అందుకుంది. మిస్టర్ బచ్చన్ అనుకున్న విధంగానే హిట్ పడితే మాత్రం అమ్మడికి మరిన్ని ఛాన్సులు వస్తాయి. సో కరెక్ట్ టైం లో కరెక్ట్ సినిమాతో భాగ్య శ్రీ టాలీవుడ్ ఎంట్రీ అమ్మడి కెరీర్ గ్రాఫ్ ని ఒక రేంజ్ కి తీసుకెళ్తుందని చెప్పొచ్చు.

# దేవియాని బికినీ డోస్.. ఇది సండే సర్ ప్రైజ్

ఢిల్లీ బ్యూటీ దేవియాని శర్మ.. టాలీవుడ్ లో తనకంటూ స్పెషల్ ఇమేజ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. రెండు వెబ్ సిరీసుల్లో నటించి ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో కూడా వేరే లెవెల్ లో ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. తన అందచందాలతో ఆకట్టుకుంటూ కుర్రాళ్ల దృష్టి తన వైపు తిప్పుకుంటోంది. నెట్టింట ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే అమ్మడు.. తన ఫ్యాన్స్ కోసం కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తూ సందడి చేస్తుంటోంది. అటు చీరల్లో.. ఇటు బికినీల్లో అందాలు ఆరబోస్తూ మైమరపిస్తుంటోంది. ఎక్కువగా పొట్టి బట్టల్లో గ్లామర్ షో చేస్తూ ఫిదా చేస్తుంటోంది. గ్లామర్ డోస్ విషయంలో తగ్గేదేలే అంటూ స్టిల్స్ ఇస్తుంటోంది. మత్తెక్కించే ఫోజులతో కిర్రెక్కిస్తుంటోంది. డైలీ తన సోషల్ మీడియా వాల్ చూడాలనిపించేలా ట్రీట్స్ ఇస్తుంటోంది. నెట్టింట సెగలు పుట్టిస్తూ మైండ్ బ్లాక్ చేస్తుంటోంది. ఎప్పటికప్పుడు తన పిక్స్ తోనే ఫుల్ ట్రెండింగ్ లో ఉంటోంది అమ్మడు. తాజాగా సండే ట్రీట్ ఇచ్చింది దేవియాని శర్మ. ఇన్నర్ సొగసులతో క్లీన్ బౌల్డ్ చేస్తోంది బ్యూటీ. జీన్ బాటమ్ వేసుకున్న అమ్మడు.. తన ఫిజిక్ తో అలరిస్తోంది.



నడుము మడతలతో అట్రాక్ట్ చేస్తోంది. నాభి అందాలతో కుర్రాళ్ల దృష్టిని తనవైపు తిప్పుకుంటోంది. నావెల్ పిన్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తోంది. ఎద అందాలతో కవ్విస్తోంది. ఇప్పుడు దేవియాని శర్మ పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. సండే ట్రీట్ అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. దేవియాని ఎవర్ గ్రీన్ గ్లామరస్ గర్ల్ అంటూ కొనియాడుతున్నారు. అయితే టాలీవుడ్ నటుడు నవీన్ చంద్ర భానుమతి రామకృష్ణ మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీకి పరిచయమైంది దేవియాని శర్మ. ఆ తర్వాత పలు చిత్రాల్లో కనిపించింది. ఆకాష్ పూరి రొమాంటిక్ సినిమాలో హీరో ఫ్రెండ్ గా నటించి మెప్పించింది. సేవ్ ది టైగర్స్, సైతాన్ వెబ్ సిరీసులతో తెలుగులో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ఆ రెండు సిరీసుల్లో తన నటనతో ఆకట్టుకుంది అమ్మడు. ఆ సిరీసుల సీక్వెల్ సీజన్స్ లో కూడా నటిస్తోంది దేవియాని శర్మ. సేవ్ ద టైగర్స్ వెబ్ సిరీస్ లో హై ప్రొఫైల్ ఫెమినిస్ట్ లాయర్ గా నటించి మెప్పించింది. సైతాన్ వెబ్ సిరీస్ లో రఫ్ అండ్ బోల్డ్ క్యారెక్టర్ లో ఓ రేంజ్ లో యాక్ట్ చేసింది. ఇప్పుడు పెద్ద హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. కోలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వాలని ఉందని ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. మరి దేవియాని శర్మ.. భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో వేచి చూడాలి.

Printed, Published & Owned by KOYALKAR RAM DAYANAND, Editor Koyalkar Swetha, Nigha Netram Telugu Daily. H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad, Telangana State, Printed at Swetha Offset Printers, H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad. e-mail : neeganethram@rediffmail.com. Cel No. 9440090053